అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

శుక్రవారం 20-01-2023 | సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 8 | సంచిక : 335 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

తగ్గేదే లే..!



- కొనసాగిన కుస్తీయోధుల ఆందోళన
- బ్రిజ్‌భూషణ్‌ను జైలుకు పంపించాలి
- రెజ్లింగ్ సమాఖ్యను ప్రక్షాళన చేయాలి
- వినేశ్, సాక్షి, బజరంగ్, రవి డిమాండ్

వివరాలు ఆటలులో..



సికింద్రాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

మంటలను ఆర్పేందుకు తీవ్రంగా శ్రమించిన అధికారులు

- 25 ఫైరింజన్లు.. 50 నీటి ట్యాంకర్ల వినియోగం
- గురువారం అర్ధరాత్రికి పరిస్థితి అదుపులోకి..
- దట్టమైన పొగతో ఇబ్బందికి గురైన స్థానికులు
- తీవ్ర అస్వస్థతకు గురైన వారిని ఆస్పత్రికి తరలింపు
- నలుగురిని రక్షించిన అధికారులు

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్ రాంగోపాల్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో భారీ అగ్నిప్రమాదం జరిగింది. మినిస్టర్ రోడ్డులోని 'దక్కన్ నైట్‌వేర్ స్పోర్ట్స్' దుకాణంలో గురువారం ఉదయం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ వ్యాపించింది. దీంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..

గుజరాత్‌కు చెందిన మహ్మద్ జావిద్ రహీం సికింద్రాబాద్‌లో 'దక్కన్ నైట్‌వేర్ స్పోర్ట్స్' దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఈ భవనం రెండు సెల్లార్లతో కూడిన ఆరు అంతస్తులుండగా, మొదటి అంతస్తులో కార్ డెక్కార్ వర్క్ చేస్తున్నారు. రెండో అంతస్తులో టీషర్ట్స్‌కు పెయింట్ వర్క్ చేస్తుండగా, మిగిలిన అంతస్తులో రా మెటీరియల్ ఉంచారు. రెండో అంతస్తులో అధిక మొత్తంలో రసాయనాలను ఉంచారు. అయితే, గురువారం ఉదయం 10:30గంటల సమయంలో ఒక్కసారిగా దుకాణంలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న తెలంగాణ రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య వెంటనే సిబ్బందిని రంగంలోకి దించారు. మంటలను ఆర్పేందుకు దాదాపు 25 ఫైరింజన్లతో అధికారులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. రాత్రి వరకు మంటలు అదుపులోకి వచ్చాయి. ఓ వైపు... 9లో

త్రిపురలో నిరంతరం దాడులు

ఎన్నికల సంఘం హామీ వృథా : ఏచూరి

న్యూఢిల్లీ : ఎన్నికల సంఘం ఇచ్చిన హామీకి విరుద్ధంగా త్రిపురలో నిరంతరం దాడులు జరుగుతున్నాయని సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. ఎన్నికల కమిషన్ పూర్తిస్థాయి బృందం రాష్ట్ర పర్యటన నుంచి తిరిగి వచ్చిన కొద్దిసేపటికే ప్రతిపక్ష పార్టీలపై దాడి జరిగిందని తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యుడు నీలోత్పల్ బసు, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు మురళీధరన్ కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం సీతారాం ఏచూరి మీడియాతో మాట్లాడుతూ 'త్రిపురలో వారం రోజుల్లోనే తొమ్మిది దాడులు జరిగాయి. పోలీసు వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఎన్నికల సంఘం ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదు' అని విమర్శించారు. 'జనవరి 12న గోమతి జిల్లాలోని ఉదయ్‌పూర్ డాక్ బంగ్లా రోడ్డులో నాలుగు ఇండ్లపై దాడి చేసి దోపిడి చేసి అందులో ఉన్నవారిని కొట్టారు. 14న ఉదయ్‌పూర్‌లోని మాతాబరిలో సీపీఐ(ఎం) స్థానిక కమిటీ కార్యాలయాన్ని దహనం చేశారు. 15న దక్షిణ త్రిపురలోని సందీర్‌బజార్‌లో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు శ్రీమంత దేపై దారుణంగా దాడి చేసి తలపై గాయపర్చారు. 18న దక్షిణ త్రిపురలోని బర్పథారిలో సమావేశానికి వెళ్లి తిరిగి వస్తున్న ఐదుగురు సీపీఐ(ఎం) కార్యకర్తలపై దాడి జరిగింది. అదే రోజు బలోనియాలో సీపీఐ(ఎం) ఎమ్మెల్యే సుధాందాస్, పశ్చిమ త్రిపురలోని ఎస్ఎన్ కాలనీలో మాజీ మంత్రి మాణిక్ డే సమావేశాలను అడ్డుకునేందుకు ప్రయత్నించారు. 18న కాంగ్రెస్ నేత సుశాంత చౌదరి నేతృత్వంలోని బృందం అజోయ్ కుమార్ హాజరైన సమావేశంపై దాడి జరిగింది. టిప్రా కార్యకర్త ప్రంజిత్ నమ్సుద్ర కమల్‌పూర్ దలైలో హత్యకు గురయ్యాడు. 19న పశ్చిమ త్రిపురలోని మలై నగర్‌లో సీపీఐ(ఎం) కార్యాలయాన్ని కూల్చివేశారు' అని అన్నారు. దాడులను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



త్రిముఖ పోరుకు ప్రణాళిక

ప్రతిఘటనతో ప్రయివేటీకరణ వెనుకడుగు

- 17వ మహాసభలో అన్ని అంశాలపై సాగుతున్న చర్చలు
- వివరాలు వెల్లడించిన ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్



బెంగళూరు నుంచి అచ్చిన ప్రశాంత్

మతతత్వ సరళీకరణ విధానాలు అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వానికి త్రిముఖ పోరు (రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికుల ఐక్యంగా)తో అడ్డుకట్ట వేసేందుకు సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభ ప్రణాళికను రచిస్తున్నదని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ పేర్కొన్నారు. బెంగుళూరు నగరంలోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లో రెండు రోజులుగా జరుగుతున్నాయి. మహాసభలో చర్చిస్తున్న అంశాల గురించి ఆయన మీడియాకు వివరించారు. 23 రాష్ట్రాలు, పలు కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారని తెలిపారు. సోదర సంఘాలైన బ్యాంకింగ్, బీమా, రైల్వే సంఘాలతో పాటు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు కూడా ఈ మహాసభలో పాల్గొని తమ మద్దతు తెలిపాయని వివరించారు.

దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాల వల్ల కార్మికులు, ఉద్యోగులు పడుతున్న ఇబ్బందులను ఇందులో చర్చించామని వెల్లడించారు. వాటి పరిష్కారానికి చేసిన కృషిని, పోరాటాలను సమీక్షించుకుంటున్నట్టు తెలిపారు. దేశంలో ఆర్థిక సంక్షోభం రోజురోజుకు ముదురుతున్నదన్నారు. ప్రభుత్వం అనురిస్తున్న సరళీకరణ ఆర్థిక విధానాలు దేశ ఆర్థిక వ్యవస్థను కుప్పకూల్చే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు ప్రభుత్వ రంగం సంస్థలను ప్రయివేటీకరించే ప్రయత్నాలు ముమ్మరం చేసిందని చెప్పారు. అయితే ప్రయివేటీకరణకు ఉద్యోగుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత అన్ని చోట్ల వ్యక్తమైందని గుర్తు చేశారు. ఉదాహరణకు బెంగళూరు నగరంలోనే బీఈఎంఎల్‌ను ప్రయివేటీకరించేందుకు ప్రయత్నిస్తే ఉద్యోగులు ఉమ్మడిగా ప్రతిఘటించారని తెలిపారు. అదేవిధంగా మహారాష్ట్రలో విద్యుత్‌రంగ సంస్థల ప్రయివేటీకరణకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైందన్నారు. దీంతో ప్రభుత్వం ప్రయివేటీకరణపై తాత్కాలికంగానైనా వెనుక్కు తగ్గక తప్పలేదని చెప్పారు. ఈ పోరాటాలకు మరింత పదును పెట్టాలని తమ యూనియన్ భావిస్తోందన్నారు. అదే రకంగా ఇతర రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు అనేక రకాల ఇబ్బందులూ ఉన్నాయన్నారు. వీటిన్నింటిపైనా రాబోయే రోజుల్లో పోరాటాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ఒకవైపు స్వతంత్రంగా పోరాటం సాగిస్తూనే, ఇతర కార్మిక సంఘాలతోనూ కలసి ఐక్యకార్యాచరణతో ముందుకెళ్తామని చెప్పారు. సమావేశంలో సీఐటీయూ కార్యదర్శి ఉమేష్, నాయకులు ఆర్కే రాజోపే పాల్గొన్నారు.

ఢిల్లీలో ఏప్రిల్ 5న కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీ

- జయప్రదం చేయాలని తీర్మానం ప్రవేశపెట్టిన ఏఆర్.సింధూ
- బలపర్చిన జాతీయ కార్యదర్శి చుక్కరాములు



శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి నవతెలంగాణ ప్రతినిధి

ఢిల్లీలో ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని జయప్రదం చేయాలని కోరుతూ సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో ఆ యూనియన్ జాతీయ కార్యదర్శి ఏఆర్.సింధూ తీర్మానాన్ని గురువారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..మోడీ ప్రభుత్వం వచ్చాక ప్రజాస్వామిక హక్కులపై దాడులు తీవ్రతరం అయ్యాయని చెప్పారు. మహిళలపై అణచివేత పెరిగిపోతున్నదన్నారు. మరోవైపు కమ్యూనల్... 9లో

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ విస్తరిస్తాం

- కొత్తగా మూడు డేటా సెంటర్ల ఏర్పాటుకు ప్రకటన
- దావోస్‌లో మంత్రి కేటీఆర్‌తో సమావేశం

వివరాలు 9లో..



వినియోగదారులపై భారాలు మోపడం తగదు

రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలు ఉపసంహరించుకోవాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని డిమాండ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రతి నెలా ఇంధన సర్దుబాటు చార్జీలను పెంచుకోవచ్చనీ, ఈ పెంపుదలకు రెగ్యులరేటరీ కమిషన్ అనుమతులు అవసరం లేదంటూ తెలుపుతూ డిస్ట్రిబ్యూటరీ కమిటీ (డిస్కాంలు)లకు విద్యుత్ నియంత్రణ మండలి స్వేచ్ఛ కల్పించడం పట్ల సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. విద్యుత్ వినియోగదారులపై భారాలు మోపే ఈ ఆదేశాలు తగదనీ, ఈ నిర్ణయాన్ని తీవ్రంగా ఖండించింది. తక్షణమే రెగ్యులేటరీ కమిషన్ ఆదేశాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2018 నుంచి 2022 వరకు రెగ్యులేటరీ కమిషన్ టారీఫ్ నిర్ణయించలేదని తెలిపారు. డిస్కాంలు ఎలాంటి టారీఫ్ ప్రతిపాదనలు ఇవ్వలేదని వివరించారు. ఈ నాలుగేండ్ల బాకీలు రూ.33 వేల కోట్ల వసూళ్లకు... 9లో



ప్రపంచ రికార్డు సాధించేలా కంటి వెలుగు కార్యక్రమం

సిఎస్ శాంతి కుమారి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంద రోజుల పాటు కొనసాగే కంటి వెలుగు కార్యక్రమంలో ప్రపంచరికార్డు సాధించేలా కంటి పరీక్షలు నిర్వహించనున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి తెలిపారు. హైదరాబాద్ లిబర్టీ ఏవీ కాలేజ్‌లో కంటివెలుగు కార్యక్రమనిర్వహణను సిఎస్ శాంతికుమారి బుధవారం... 9లో

తాండూరు కందికి భౌగోళిక గుర్తింపు


రుచి, సువాసన, పోషకాలతో విశిష్ట లక్షణాలు

- రైతులు, శాస్త్రవేత్తలకు మంత్రి నిరంజన్‌రెడ్డి అభినందనలు
- 31న ప్రత్యేక కార్యక్రమం



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

వికారాబాద్ జిల్లాలోని తాండూరు కందికి భౌగోళిక గుర్తింపు లభించింది. రుచి, సువాసన,పోషకాల వంటి విశిష్ట లక్షణాలు ఉన్నాయి. అక్కడి నేలల స్వభావం, భూమిలో పోషకాలు, అనుకూల వాతావరణ పరిస్థితులు, రైతులు ఆచరించే సాంప్రదాయ, ఆధునిక యాజమాన్య పద్ధతుల మూలంగా దీనికి ప్రత్యేక గుర్తింపు వచ్చింది. తాండూరు, పెద్దేముల్, యాలాల, బషీరాబాద్ మండలాల్లోని లక్ష 48 వేల ఎకరాలలో కంది సాగవుతుంది. ఇప్పటి వరకూ దేశమంతటా భౌగోళిక గుర్తింపు కోసం వివిధ రంగాల నుంచి వెయ్యి దరఖాస్తులు 432 ఉత్పత్తులకు మాత్రమే ఆ గుర్తింపు వచ్చింది. ఆజాది కా అమృత్ ఉత్సవాల్లో 75 ఉత్పత్తులు జీఐజర్నల్‌లో ప్రచురింతమయ్యాయి. ఈ ఏడాది వచ్చిన దరఖాస్తుల్లో కేవలం తొమ్మిది ఉత్పత్తులకు మాత్రమే గుర్తింపు దక్కగా అందులో తాండూరు కంది ఒకటి కావడం గమనార్హం. ఇప్పటి వరకు తెలంగాణ ప్రాంతానికి 16 ఉత్పత్తులకు గుర్తింపు దక్కగా రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఆరు ఉత్పత్తులు భౌగోళిక గుర్తింపు పొందాయి. పుట్టపాక తేలియ రుమాలు (2015), బంగినపల్లి మామిడి (2017), ఆదిలాబాద్ ఢోక్రా, వరంగల్ డురీస్(2018), నిర్మల్ పెయింటింగ్ (2019), తాండూరు కంది (2022) గుర్తింపు పొందిన ఉత్పత్తుల్లో ఉన్నాయి. అందులో మామిడి, కంది ఉద్యాన, వ్యవసాయ రంగ ఉత్పత్తులు కావడం విశేషం. పండిన పప్పు ఎక్కువ కాలం నిల్వ ఉండడం, తొందరగా ఉడకడం, మంచి రుచి, వాసన తాండూరు కంది ప్రత్యేకత ఆ ప్రాంతంలో ఉన్న సున్నపురాయి నిక్షేపాల వల్ల వచ్చే పోషక నాణ్యతలే దీనికి కారణమని పేర్కొంది. దేశంలోని ఢిల్లీ, ముంబయి, కోల్‌కతా పట్టణాల్లో తాండూరు కంది బ్రాండ్‌కు డిమాండ్ ఉన్నది. భౌగోళిక గుర్తింపు కోసం ధరఖాస్తు చేసుకున్న యాలాల రైతు ఉత్పత్తిదారుల సహకార సంఘం, తాండూరు కంది పరిశోధనా స్థానంతోపాటు ఆ ప్రాంత రైతులు, వ్యవసాయ విద్యాలయం సంచాలకులు డాక్టర్ జగదీశ్వర్, కంది పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ సుధాకర్‌ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఈ సందర్భంగా ఒక ప్రకటనలో అభినందించారు. ఈ నెల 31న కంది పరిశోధనా కేంద్రంలో తాండూరు రైతులు, శాస్త్రవేత్తల అభినందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మంత్రి పేర్కొన్నారు.



2002 గుజరాత్ అల్లర్లు మోడీదే ప్రధాన బాధ్యత

ఆనాటి ఊచకోత రాజకీయ ప్రేరేపితం

- ఒక వర్గం వారిపై హిందూత్వ శక్తుల్ని ఊసిగొల్పి..పోలీసులను ఆపారు
- అల్లర్లకు వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్ ప్రణాళిక : బ్రిటీష్ ప్రభుత్వ విచారణ బృందం నివేదిక
- నివేదికలోని ముఖ్యాంశాలతో బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం

లండన్ : 2002 గుజరాత్ అల్లర్లకు ప్రధాన బాధ్యుడు ఆనాటి రాష్ట్ర సీఎంగా ఉన్న నరేంద్రమోడీ..అని బ్రిటీష్ ప్రభుత్వ విచారణ బృందం తేల్చింది. అంతేకాదు, ఊచకోతకు, అల్లర్లకు పాల్పడిన హిందూత్వ శక్తులకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరించిందని, ఏం చేసినా పోలీసులు అడ్డుకోరనే సంకేతాలు పంపినందువల్లే దారుణాలు జరిగాయని విచారణ బృందం నిర్ధారించింది. విచారణ బృందం నివేదికలోని ముఖ్యాంశాల్ని చూపుతూ మంగళవారం బీబీసీ డాక్యుమెంటరీ ప్రసారం చేసింది. దీంతో గుజరాత్ అల్లర్ల అంశం మళ్లీ తెరపైకి వచ్చింది. 'ద మోడీ... 9లో



తగ్గేదే లే..!



- కొనసాగిన కుస్తీయోధుల ఆందోళన
- బ్రిజ్‌భూషణ్‌ను జైలుకు పంపించాలి
- రెజ్లింగ్ సమాఖ్యను ప్రక్షాళన చేయాలి
- వినేశ్, సాక్షి, భజరంగ్, రవి డిమాండ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు, బిజెపి ఎంపీ బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ పదవికి రాజీనామాతో పాటు చట్టపరంగా విచారణ ఎదుర్కొని జైలుకు వెళ్లే వరకు రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళన కొనసాగుతుందని భారత స్టార్ రెజ్లర్లు తేల్చి చెప్పారు. లైంగిక వేధింపులు, చంపేస్తామని బెదిరింపులతో పాటు నియంతృత్వ విధానాలు, ఆటగాళ్లకు అన్యాం చేసే పద్దతుల పట్ల నిరసిస్తూ భారత స్టార్ రెజ్లింగ్ క్రీడాకారులు రెండు రోజులుగా న్యూఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఆందోళన చేపట్టారు. రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడి ఆగడాలను నిరసిస్తూ గురువారం మరికొంత మంది రెజ్లర్లు ధర్నాలో కూర్చున్నారు.

జైలుకు పంపాలి

రెజ్లర్ల జీవితాలతో ఆడుకున్న బ్రిజ్‌భూషణ్ పదవి నుంచి తప్పుకుంటే సరిపోదు. చట్టప్రకారం అతడిని జైల్లో ఉంచి శిక్షించాలని రెజ్లర్ వినేశ్ ఫోగట్ డిమాండ్ చేసింది. 'మేమంతా (రెజ్లర్లు) బ్రిజ్‌భూషణ్ రాజీనామా మాత్రమే కోరటం లేదు. అతడిని చట్టప్రకారం శిక్షించాలి. పరిష్కారం కోసం ఎదురుచూస్తాం, లేదంటే శుక్రవారం బ్రిజ్ భూషణ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తాం. మహిళా రెజ్లర్లను లైంగికంగా వేధించటంతో ఉత్తరప్రదేశ్‌లో రెజ్లింగ్ క్రీడ కనుమరుగయ్యేందుకు బ్రిజ్‌భూషణ్ కారణమయ్యాడు' అని వినేశ్ ఫోగట్ తెలిపింది. లైంగిక వేధింపుల పట్ల ఇప్పటివరకు ఐదారుగురు రెజ్లర్లు ఆధారాలతో ముందుకొచ్చారు. ఆత్మ గౌరవం అత్యంత ప్రధానం. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలు తీసుకోవటం ఎంత ఆలస్యమైతే లైంగిక వేధింపులపై ముందుకొచ్చే మహిళా రెజ్లర్ల సంఖ్య రెట్టింపు అవుతుంది. అది భారత క్రీడా రంగంలో ఓ చీకటి రోజుగా మిగిలిపోతుంది. మమ్మల్ని ఇలా మౌన రోదనకు వదిలేస్తే.. భారతదేశంలో ఎక్కడా మహిళలకు రక్షణ లేదని అనుకుంటాను. అసలు మన దేశంలో ఆడపిల్లలు జన్మించకూడదని భావిస్తానని' వినేశ్ ఫోగట్ భావోద్వేగానికి లోనైంది.

భవిత కోసమే పోరాటం

'బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ నుంచి డబ్ల్యూఎఫ్ఐ అధ్యక్ష పదవికి రాజీనామా సరిపోదు. రెజ్లింగ్ సమాఖ్య పాలకవర్గం మొత్తం రద్దు కావాలి. రెజ్లింగ్ సమాఖ్య ప్రక్షాళన జరగాలి. బ్రిజ్ భూషణ్ ఒక్కడే తప్పుకుంటే, అతడిని అనుచరులకు పద వులు కట్టబెడతాడు. అందు వల్ల ఎటువంటి ఉపయోగం ఉండదు. రెజ్లింగ్ ఫెడరేషన్ వ్యవస్థ మారాలి. ఇది మహిళా రెజ్లర్ల భవిష్యత్ కోసం చేస్తున్న పోరాటం. ఇందులో ఎటువంటి రాజకీ యాలకు చోటు లేదని' మరో స్టార్ రెజ్లర్ బజరంగ్ పూని యా పేర్కొన్నాడు. టోక్యో ఒలింపిక్స్ అనంతరం రెజ్లింగ్ ఫెడరేషన్‌లో బ్రిజ్‌భూషణ్ నియంతృత్వ విధానాలపై ప్రధాని నరెంద్ర మోదికి బజరంగ్ పూనియా ఫిర్యాదు చేశారు. అయినా, పరిస్థితిలో ఎటువంటి మార్పు కనిపించలేదని పూనియా ఆవేదన వ్యక్తం చేశాడు.



తలుపులు తెరిచే ఉంచుతాడు!

ప్రపంచ జూనియర్ చాంపియన్‌షిప్స్ సందర్భంగా బ్రిజ్‌భూషణ్ వ్యవహార శైలిపై యువ రెజ్లర్ అన్షు మాలిక్ మండిపడింది. ' జూనియర్ ప్రపంచ చాంపియన్‌షిప్స్ పోటీల్లో జూనియర్ బాలికలు బస చేసిన ఫ్లోర్‌లోనే బ్రిజ్‌భూషణ్ గది ఎంచుకున్నాడు. అతడు గది తలుపులు తెరిచే ఉంచేవాడు, ప్రతి మహిళా రెజ్లర్ బ్రిజ్‌భూషణ్ ప్రవర్తనతో అసౌకర్యానికి గుర య్యారు. ప్రస్తుత రెజ్లింగ్ ఫెడరే షన్‌ను పూర్తిగా తొలగించాలి. రెజ్లింగ్ ఫెడరేషన్ వ్యవస్థలోనే సమూల మార్పులు అవసర మని' అన్షు మాలిక్ కోరింది.

ఉరివేసుకుంటా! :

రెజ్లింగ్ క్రీడాకారులను ఆరోపణలను బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ తోసిపుచ్చాడు. 'రెజ్లర్ల ఆరోపణల్లో నిజం లేదు. లైంగిక వేధింపులకు పాల్పడినట్టు తేలితే ఉరి వేసుకుంటా. ఎవరిపైనైనా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉండేది. వాళ్లు ఏకంగా నాపైనే ఆరోపణలు చేస్తున్నారు. అప్పుడు నేను ఏం చేయగలను. రెజ్లర్లతో మాట్లాడేందుకు సిద్ధంగానే ఉన్నాను. కానీ రెజ్లర్లు మాకు అందుబాటులో ఉండటం లేదు' అని బ్రిజ్‌భూషణ్ వ్యాఖ్యానించాడు.

క్రీడాశాఖ నోటీసు

రెజ్లింగ్ క్రీడాకారుల ఆందోళనను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ భారత రెజ్లింగ్ ఫెడరేషన్‌కు నోటీసులు పంపించింది. లైంగిక వేధింపులు, చంపేస్తామని బెదిరింపులు అత్యంత సీరియస్ ఆరోపణలు. ప్రస్తుత స్థితికి దారితీసిన పరిస్థితులపై 72 గంటల్లోగా పూర్తి నివేదిక అందజేయాలి. లేదంటే, 2011 నేషనల్ స్పోర్ట్స్ పాలసీ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఆందోళన చేపట్టిన రెజ్లింగ్ క్రీడాకారులతో క్రీడా మంత్రిత్వ శాఖ, శాయ్ అధికారులు చర్చలు జరిపారు. బ్రిజ్‌భూషణ్‌పై చర్యలకు స్పష్టమైన కార్యాచరణ లేకుండా హామీలతోనే సరిపెట్టడంతో రెజ్లర్లు అసంతృప్తి వ్యక్తం చేశారు.

బృందాకారత్ సంఘీభావం

'మహిళలపై లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా పోరాటం చేస్తున్నాం. ఏ మహిళ అన్యాయానికి గురైనా అండగా ఉండి పోరాడుతాం. మహిళా రెజ్లర్ల ఫిర్యాదుతో ప్రభుత్వం బ్రిజ్‌భూషణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి. దేశ గర్వపడేలా పతకాలు సాధించిన రెజ్లర్లు ఆందోళనకు దిగటం బాధాకరం. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని' సీపీఐ (ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు, మాజీ ఎంపీ బృందా కారత్ డిమాండ్ చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళన చేపట్టిన రెజ్లర్ల వద్దకు వెళ్లి ఆమె సంఘీభావం ప్రకటించారు.

గూండా చేతిలో అధికారం



- బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ చరిత్ర నేరపూరితం
- దావూద్‌తో దోస్తీ, దోపిడీ, అల్లర్లు నేపథ్యం

భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ చరిత్ర పూర్తిగా నేరపూరితం. భారతీయ జనతా పార్టీ (బిజెపి) తరపున లోక్‌సభకు ఎన్నికైన బ్రిజ్‌భూషణ్ 2011 నుంచి రెజ్లింగ్ ఫెడరేషన్‌పై పట్టు సాధించాడు. దశాబ్దకాలానికి పైగా రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడిగా నియంత పాలన సాగిస్తున్నాడు. శాయ్ అధికారులు, టాప్ పథకం గైడ్‌లైన్స్, ప్రయివేటు స్పాన్సర్లు.. ఇలా ఎవరైనా అతడు గీసిన గీత దాటేందుకు వీల్లేదు. నియంతృత్వ విధానాల పట్ల ఎవరైనా గళం విప్పితే రెజ్లింగ్ క్రీడలో ఇక వారి పాత్ర చరిత్ర లోనే ఉండిపోతుంది. జాతీయ చాంపియన్‌షిప్స్ సందర్భంగా ప్రశ్నించిన ఓ యువ రెజ్లర్‌ను వేదికపై నుంచే చెంప చెళ మనిపించాడు బ్రిజ్‌భూషణ్. మాట వినకపోతే.. ఒలింపిక్స్‌లో, వరల్డ్ చాంపియన్‌షిప్స్‌లో పత కం సాధించే రెజ్లర్‌పై నిషేధం విధించేందుకు వెనుకాడడు. అందుకు వినేశ్ ఫోగట్ సంఘట ననే నిలువెత్తు నిదర్శనం.

దావూద్‌తో దోస్తీ

బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ గతంలో ఉగ్రవాదులతో సంబం ధాలు కలిగిన ఉన్నందున టాడా చట్ట ప్రకారం అభియోగాలు ఎదుర్కొన్నాడు. అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీం అనుచరులకు ఆశ్రయం కల్పించటం, తన ఫోన్ నుంచి దావూద్‌తో అతడి అనుచరులు సంభాషించేందుకు ఏర్పాటు చేసిన ఆరోపణలు బ్రిజ్‌భూషణ్ ఎదుర్కొన్నాడు. అయోధ్యలో రామ మందిర ఉద్యమం నేపథ్యం నుంచి రాజకీయాల్లోకి ప్రవేశించిన బ్రిజ్‌భూషణ్.. బాబ్రి మసీదు కూల్చివేత కేసు 40 మంది నిందితుల్లో ఉన్నాడు. 2020లో బాబ్రి కేసును న్యాయ స్థానం కొట్టివేయటంతో నిర్దో షిగా బయటపడ్డాడు. బ్రిజ్ భూషణ్‌పై దోపిడి, హత్యా యత్నం, అల్లర్లు సృష్టించటం వంటి నేరాల కింద అభియో గాలు నమోదయ్యాయి. నేర చరిత్ర కలిగిన బ్రిజ్‌భూషణ్ రెజ్లింగ్ ఫెడరేషన్‌ను గూండాగిరీ తోనే నడిపించాడు. పదేండ్లకు పైగా బ్రిజ్‌భూషణ్ ఆగడాలను భరించిన క్రీడాకారులు.. ఇప్పుడు గళం వినిపిస్తున్నారు.

ఇవీ ఆరోపణలు

- శిక్షణ శిబిరంలో మహిళా రెజ్లర్లపై అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్, జాతీయ కోచ్‌ల లైంగిక వేధింపులు. ఇందులో జూనియర్ బాలికలు సైతం ఉన్నారు.
- నియంతృత్వ విధానాలతో రెజ్లింగ్ సమాఖ్యను నడిపించటం
- రెజ్లర్లకు ప్రయివేటు స్పాన్సర్‌షిప్‌లను దూరం చేయటం
- నాణ్యత ప్రమాణాలు లేని శిక్షణ వ్యవస్థ
- రెజ్లర్లను ఇబ్బందిపెట్టేలా షెడ్యూలింగ్
- రెజ్లింగ్ ఫెడరేషన్‌లో అధ్వాన పాలన

ముగిసిన పోరాటం
ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్



న్యూఢిల్లీ : కొత్త ఏడాదిలో భారత షట్లర్ల నిరాశజనక ప్రదర్శన కొనసాగు తోంది. ఇండియా ఓపెన్ సిరీస్‌లో భారత క్రీడాకారుల టైటిల్ వేటకు తెరపడింది. మెన్స్ సింగిల్స్‌లో లక్ష్యసేన్, మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ క్వార్టర్‌ఫైనల్‌కు ముందే పరాజయం పాలయ్యారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీ గాయంతో వాకోవర్ ఇవ్వగా.. మహిళల సింగిల్స్‌లో గాయత్రి, ట్రెసా జంట ఓటమి చెందింది. ఏడో సీడ్ లక్ష్యసేన్ 21-16, 15-21, 18-21తో డెన్మార్క్ షట్లర్ రాస్మస్ గెమ్కే చేతిలో మూడు గేముల్లో ఓటమి పాలయ్యాడు. తొలి గేమ్ నెగ్గిన లక్ష్యసేన్ చివరి రెండు గేముల్లో పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్‌లో సైనా నెహ్వాల్ వరుస గేముల్లో చేతులెత్తేసింది. మూడో సీడ్ చైనా షట్లర్ చెన్ యుఫెయ్ 21-9, 21-12తో సైనా నెహ్వాల్‌పై అలవోక విజయం నమోదు చేసింది. మెన్స్ డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్, విష్ణువర్దన్ జోడీ 14-21, 10-21తో చైనా జోడీ చేతిలో కంగుతింది. మహిళల డబుల్స్‌లో గాయత్రి పుల్లెల, ట్రెసా జాలీ 9-21, 16-21తో చైనా అమ్మాయిలకు క్వార్టర్‌ఫైనల్ బెర్త్ కోల్పోయారు. మెన్స్ డబుల్స్‌లో సాత్విక్, చిరాగ్ జోడీకి విజయావకాశాలు మెరుగ్గా కనిపించాయి. కానీ గాయంతో భారత డబుల్స్ స్టార్ వాకోవర్ ఇచ్చారు. దీంతో ఇండియా ఓపెన్‌లో భారత షట్లర్ల పోరాటానికి తెరపడింది.

హైదరాబాద్ ఐదో ఓటమి
• 9 వికెట్లతో మహారాష్ట్ర గెలుపు



పుణె : రంజీ ట్రోఫీలో హైదరాబాద్ చెత్త ప్రదర్శనకు బ్రేక్ పడలేదు. ఆరు మ్యాచుల్లో ఐదో పరాజయం మూటగట్టుకున్న హైదరాబాద్ మరోసారి మూడు రోజుల్లోనే ప్రత్యర్థికి దాసోహం అయ్యింది. తొలి ఇన్నింగ్స్‌లో 385 పరుగుల భారీ స్కోరు నమోదు చేసిన మహారాష్ట్ర.. హైదరాబాద్‌ను వరుసగా 192, 219 పరుగులకు ఆలౌట్ చేసింది. భారీ తొలి ఇన్నింగ్స్ లోటుతో ఫాలోఆన్ ఆడిన హైదరాబాద్ రెండో ఇన్నింగ్స్‌లో 200 పరుగుల మార్క్ దాటగలిగింది. సంతోశ్ (59), తన్మయ్ (43), రోహిత్ రాయుడు (37) చెప్పుకోదగిన పరుగులు చేశారు. 27 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 2.5 ఓవర్లలోనే ఛేదించిన మహారాష్ట్ర 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి చివరి మ్యాచ్‌లో ఢిల్లీతో హైదరాబాద్ ఆడనుంది.

జకోవిచ్ దూకుడు
• ఆస్ట్రేలియన్ ఓపెన్



మెల్‌బోర్న్ : టైటిల్ ఫేవరేట్ నొవాక్ జకోవిచ్ (సెర్బియా) దూకుడు పెంచాడు. మెన్స్ సింగిల్స్ రెండో రౌండ్లో నాల్గో సీడ్ జకోవిచ్ మెరుపు విజయం సాధించాడు. 6-1, 6-7(5-7), 6-2, 6-0తో ఫ్రాన్స్ చిన్నోడు ఎంజోను చిత్తు చేశాడు. వరల్డ్ నం.191 ఎంజో రెండో సెట్‌ను టైబ్రేకర్‌లో నెగ్గి సత్తా చాటినా.. సెర్బియా యోధుడి అలవోక విజయంతో మూడో రౌండ్లో అడుగుపెట్టాడు. దిమిత్రివ్ 6-3, 6-2, 6-0తో రెండో రౌండ్లో నెగ్గగా.. జర్మనీ స్టార్ అలెగ్జాండర్ జ్వెరెవ్‌కు చుక్కెదురైంది. 7-6(1-7), 4-6, 3-6, 2-6తో అమెరికా ఆటగాడి చేతిలో ఓటమి చెందాడు. మహిళల సింగిల్స్‌లో రెండో సీడ్ జెబూర్ 1-6, 7-5, 1-6తో వంద్రుసోవా చేతిలో మట్టికరిచింది. ఐదో సీడ్ సబలెంకా 6-3, 6-1తో షెల్బీ రోజర్స్‌ను ఓడించి మూడో రౌండ్‌కు చేరుకుంది.

బీఆర్ఎస్‌లో సభోత్సాహం



- ఆవిర్భావ సభతో పార్టీ శ్రేణుల్లో జోష్
- సీఎం వరాలతో పాలాభిషేకాలు, కృతజ్ఞతలు
- ఇప్పటికైనా అంతర్గత పోరు సమసినట్టేనా..?
- హామీలు అమలు చేయాలంటున్న సీపీఐ(ఎం)

నవతెలంగాణ- ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మంలో బుధవారం నిర్వహించిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆవిర్భావ సభ సక్సెస్ కావడం ఆ పార్టీ శ్రేణులకు ఉత్సాహాన్నిస్తోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావుతో పాటు కేరళ, ఢిల్లీ, పంజాబ్ సీఎంలు పినరయ్ విజయన్, అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌మాన్‌తో పాటు జాతీయ స్థాయి నేతలు అఖిలేష్‌యాదవ్, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం హాజరవడంతో ఇప్పుడే ప్రస్థానం మొదలుపెట్టిన బీఆర్ఎస్ భవితవ్యంపై ఆ పార్టీ శ్రేణుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. సభకు భారీగా జనం తరలిరావడానికి తోడు.. ఉద్యమాల గడ్డ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో మతతత్వ బీజేపీని అడుగుపెట్టనీయబోమని నేతలంతా ముక్తకంఠంతో ప్రకటించడం ప్రజాస్వామ్య శక్తులకు నూతనోత్తేజాన్ని ఇచ్చినట్టయింది. వీటికి తోడు సభలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి జిల్లాపై కురిపించిన రూ.కోట్లాది నిధుల అభివృద్ధి పనులపై హర్షాతిరేఖలు వ్యక్తమవుతున్నాయి. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుని.. మాట తప్పని నేతగా కేసీఆర్ నిలువాలనే అభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. మున్నేరుకు నిధులు కేటాయిస్తూ పాలనపరమైన ఉత్తర్వులు ఇవ్వడంపై సీఎం కేసీఆర్‌కు మంత్రి అజయ్, ఎంపీ రవిచంద్ర గురువారం హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలపడం గమనార్హం.

సీఎం వరాలు.. భిన్నస్వరాలు..

ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గతంలో ఇచ్చిన హామీల్లో కొన్నింటిని సీఎం కేసీఆర్ నిలుపుకోవడంలో విఫలమయ్యారు. కొన్ని ఇవ్వని హామీలనూ అమలు చేశారు. ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ల ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేస్తున్న సభలన్నింటిల్లోనూ కేసీఆర్ దాదాపు ఒకే రకమైన హామీలిస్తున్నారు. ఈనెల 12వ తేదీన భద్రాద్రి కొత్తగూడెం, పక్కనే ఉన్న మహబూబాబాద్‌తో పాటు బుధవారం ఖమ్మం సభలో ఇచ్చిన హామీలు కూడా దాదాపు ఒక్కటిగానే ఉన్నాయి. ముఖ్యంగా జిల్లాలోని పంచాయతీలన్నింటికీ సీఎం ప్రత్యేక నిధి నుంచి రూ.10 లక్షల చొప్పున కేటాయించడం, అదేవిధంగా మున్సిపాల్టీలు, పెద్ద పంచాయతీలకు నిధుల విషయంలోనూ స్థాయిని బట్టి రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకూ మంజూరు చేస్తాననే ప్రకటన, జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపు, కొత్తగూడెంలో ముర్రేడు వాగు అభివృద్ధికి నిధులు, ఖమ్మంలో మున్నేరుపై వంతెన నిర్మాణానికి హామీ.. ఇలా అన్నీ ఒకలాంటి హామీలు ఇస్తూ వచ్చారు. వీటిలో కొన్ని హామీలు దీర్ఘకాలంగా పునరావృతం అవుతున్నా.. ఆచరణకు మాత్రం నోచుకోవడం లేదనే విమర్శలున్నాయి. ఉదాహరణకు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం రిపీటెడ్ హామీగానే ఉంటుంది తప్ప ఆచరణలోకి రావట్లేదు. 'కుర్చీ వేసుకుని కూర్చొని మరీ జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయిస్తా...' అంటూ వరంగల్‌లో జర్నలిస్టులకు హామీ ఇచ్చి ఏండ్లు గడుస్తున్నా అమలు చేయకపోవడంపై సోషల్‌మీడియా వేదికగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అలాగే ఖమ్మంలో మున్నేరు నదీ పరిసరాల అభివృద్ధిపై హామీకి దాదాపు రెండేండ్లయింది. మున్నేరు కరకట్ట నిర్మాణానికి గతంలోనూ రూ.40 కోట్లకు పైగా నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. కానీ ఆచరణ లేదు. తిరిగి మున్నేరుపై తీగల వంతెన కోసం గురువారం రూ.180 కోట్లు కేటాయిస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ చేయడంపై బీఆర్ఎస్ శ్రేణులు హర్షం వెలిబుచ్చుతూ కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశాయి. కానీ ఏమేరకు ఆచరణలోకి వస్తుందనే దానిపై భిన్నస్వరాలు వినిపిస్తున్నాయి.

పార్టీ ఏకతాటిపైకి వచ్చినట్టేనా..?

ఇక బీఆర్ఎస్‌లో అంతర్గత పోరు విషయంలోనూ ఇలాంటి సందిగ్ధతే నెలకొంది. అయితే ఆవిర్భావ సభ దానికి చాలా వరకు పరిష్కారం చూపిందనే వాదన వినిపిస్తోంది. కానీ అది ఎంతమేరకు అనే విషయంలో మాత్రం పార్టీ శ్రేణులకు స్పష్టత రావట్లేదు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి దాదాపు పార్టీకి దూరమైనట్టేనని సభకు ఆయన గైర్హాజరుకావడం, ఆయన వర్గీయులూ రాకపోవడం ఒకింత స్పష్టతనిచ్చినట్టయింది. ఆయన వర్గానికి చెందిన కొత్తగూడెం జడ్పీ చైర్మెన్ కోరం కనకయ్య ఈ సభకు గైర్హాజరయ్యారు. పాలేరు నేతలు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి, మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విషయంలో పొరపచ్చాలు మాత్రం సమసినట్టు లేదు. మాజీ మంత్రి తుమ్మల ప్రస్తుత మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మధ్య కూడా పూర్తిస్థాయిలో విభేదాలు తొలగకపోయి ఉండొచ్చని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. మంత్రి హరీశ్‌రావు వారిద్దర్నీ ఏకతాటిపైకి తెచ్చేందుకు చేసిన ప్రయత్నాలు ఏమేరకు సఫలమయ్యాయి అనే విషయం భవిష్యత్‌కు వదిలేయాల్సిందే. జలగం వెంకట్రావుకు ఈ సభకు ఆహ్వానం అందిందనే వార్తలు వినిపించినా ఆయనా గైర్హాజరయ్యారు. ఏ ఫ్లెక్సీపైనా ఆయన ఫొటోలు లేకపోవడం చర్చకు దారితీసింది.

హామీలు స్వాగతిస్తున్నాం.. ఆచరణతోనే సార్థకత
నున్నా నాగేశ్వరరావు, సీపీఐ(ఎం) ఖమ్మం జిల్లా కార్యదర్శి

ఇచ్చిన హామీలను స్వాగతిస్తున్నాం. అవి ఆచరణలో పెడితేనే సార్థకత. జర్నలిస్టుల ఇండ్ల స్థలాలు, మున్నేరు బ్రిడ్జి, స్థానిక సంస్థలకు నిధులు ఇలాంటి అనేక సమస్యలపై సీపీఐ(ఎం) ఎప్పటి నుంచో పోరాడుతోంది. వాటిపై సీఎం హామీ ఇవ్వడం.. మున్నేరు సమస్యకు పాలనపరమైన ఉత్తర్వులు ఇవ్వడం హర్షనీయం. అలాగే జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశాన్ని నగరమే కాకుండా జిల్లా మొత్తానికి వర్తింపజేయాలి. హామీ ప్రకారం పోడు సమస్యకు పరిష్కారం చూపాలి. పోడు రైతులందరికీ పట్టాలు ఇవ్వాలి. ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలకు ఇచ్చిన హామీని నిలుపుకోవడంతో పాటు జనరల్ యూనివర్శిటీ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలి.

విద్య, వైద్య రంగానికి నిధులు పెంచాలి

- పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్న పాలకులు : ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ-ఓయూ

కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్య రంగానికి గత ఆర్థిక సంవత్సరంలో నిధులు తక్కువగా ఖర్చు చేశారని.. కనీసం ఈ బడ్జెట్‌లోనైనా కొఠారి కమిషన్ చెప్పినట్టు నిధుల కేటాయింపు పెంచాలని ఎమ్మెల్సీ, టీపీఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు అలుగుబెల్లి నర్సిరెడ్డి కోరారు. 2023 -2024 కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి 10శాతం, వైద్య రంగానికి 6శాతం నిధులు కేటాయించాలని కోరుతూ గురువారం హైదరాబాద్‌లోని ఓయూ ఆర్ట్స్ కళాశాల ఎదుట తెలంగాణ పౌరస్పందన వేదిక ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా నర్సిరెడ్డి మాట్లాడుతూ.. విద్యా రంగానికి నిధులు కేటాయించి పాఠశాల విద్యను బలోపేతం చేస్తూ, యూనివర్సిటీ విద్యను అభివృద్ధి చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైద్య రంగంలో స్కీంలు పెట్టి పేదలకు వైద్యాన్ని దూరం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు రంగాలకు నిధులు కేటాయింపులు గ్రాంట్స్ రూపంలో ఉండాలని సూచించారు. ఓయూ తెలుగు విభాగం హెడ్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లు అవుతున్నా దేశ పాలకులు నేటికీ విద్యకు సరైన శాస్త్రీయమైన పద్ధతిలో బడ్జెట్ కేటాయించకపోవడం బాధాకరం అన్నారు. దీనిపై ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు చేపట్టినా పాలకులకు పట్టడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్స్ కొండ నాగేశ్వర్, ఆమంచి నాగేశ్వర్, వంశీధర్, టీపీఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యం.రాధేశ్యామ్, రాష్ట్ర సలహాదారు ఎంకె.దత్, జిల్లా కోశాధికారి రామకృష్ణ, సభ్యులు రాములు, మస్తాన్‌రావు, కోట నాయక్, ఎస్ఎఫ్ఐ ఓయూ అధ్యక్షకార్యదర్శులు ఆంజనేయులు, రవి నాయక్, ఉపాధ్యక్షులు రామాటేంకి శ్రీను, రమ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తత అవసరం : సీఎస్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆర్థిక పరమైన సైబర్ నేరాల నియంత్రణకై పోలీస్ అధికారులు, రిజర్వ్ బ్యాంక్ అధికారులు సమన్వయంతో కృషి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి పేర్కొన్నారు. గురువారం బీఆర్కెఆర్ భవన్‌లో ఆర్థిక పరమైన సైబర్ నేరాల నియంత్రణపై ఏర్పాటైన రాష్ట్రస్థాయి సమన్వయ సమావేశం (ఎస్ఎల్‌సీసీ) సీఎస్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో నాన్ బ్యాంకింగ్ ఆర్థిక కార్యకలాపాలు, ఆర్థిక మోసాలు, రియల్ ఎస్టేట్, చిట్ ఫండ్, డిపాజిట్ల సేకరణ తదితర అంశాలలో ప్రజల నుంచి అందిన ఆర్థిక లావాదేవీల ఫిర్యాదులు, వాటిపై న్యాయ స్థానాల్లో నమోదైన కేసులను సమీక్షించారు. ఈ సమావేశంలో సీఎస్ శాంతి కుమారి మాట్లాడుతూ, నాన్ బ్యాంకింగ్ తరహా లోన్ యాప్‌ల ద్వారా మోసపూరిత కార్యకలాపాలు గణనీయంగా పెరుగుతున్నందున, ఈ నేరాలపట్ల ప్రజలను అప్రమత్తత చేయాల్సిన అవసరముందన్నారు. ఆర్థిక పరమైన నేరాలకు సంబంధించిన ఫిర్యాదులు పోలీస్ యంత్రాంగం దృష్టికి వచ్చిన వెంటనే, వాటిపై చర్యలకు తక్షణమే ఉపక్రమించాలని సీఎస్ ఆదేశించారు. సైబర్ నేరాల పట్ల అధికారులు అప్రమత్తంగా ఉండాలనీ, ఈ సైబర్ ఆధారిత నేరాల నిరోధంపై ప్రజలను చైతన్య పరచడంతోపాటు అవగాహన చేపట్టాలని శాంతి కుమారి సంబంధిత అధికారులకు సూచించారు.

అందరికీ బదిలీ అవకాశమివ్వాలి

- విద్యాశాఖ సంచాలకులకు టీఏజేఏసీ వినతి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవోను దృష్టిలో ఉంచుకుని జీరో సర్వీసు ప్రాతిపదికన ఉపాధ్యాయులందరికీ బదిలీలకు అవకాశం కల్పించాలని టీఏజేఏసీ కోరింది. ఈ మేరకు విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేనను గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్ధన్‌రెడ్డి, టీఏజేఏసీ ప్రతినిధులు, టీఎస్‌జీహెచ్ఎంఏ అధ్యక్షులు పి రాజభాను చంద్రప్రకాశ్, పీఆర్టీయూ తెలంగాణ అధ్యక్షులు ఎం చెన్నయ్య, టీటీయూ అధ్యక్షులు ఎం మణిపాల్ రెడ్డి, ఆర్‌యూపీపీటీఎస్ అధ్యక్షులు జగదీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, టీయూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి, కలిసి వినతిపత్రం సమర్పించారు. ఉపాధ్యాయుల్లో జాతీయ అవార్డు పొందిన వారికి అదనపు పాయింట్లు కేటాయించాలని సూచించారు. 317 జీవో పెండింగ్ అప్పీళ్లను పరిష్కరించాలనీ, 13 జిల్లాల స్పౌజ్ అంశాన్ని సానుకూలంగా పరిశీలించాలని కోరారు. గుండె ఆపరేషన్‌కు సంబంధించి స్టంటును వేసుకున్న ఉపాధ్యాయులను ప్రత్యేక కేటగిరిలో చేర్చాలనీ, లేదంటే అదనపు పాయింట్లు కేటాయించాలని తెలిపారు. గెజిటెడ్ హెచ్ఎం క్యాడర్‌లో లాంగ్ స్టాండింగ్ ఐదేండ్లను కొనసాగించాలని సూచిం చారు. కోర్టు తుది తీర్పునకు లోబడి పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని కోరారు. కోర్టులో ఉన్న వివిధ కేసుల తుది తీర్పునకు లోబడి విద్యాశాఖలోని అన్ని స్థాయిల్లోని పోస్టులకు పదోన్న తులను అడ్‌హక్ పద్ధతిలో ఇవ్వాలని సూచించారు. విద్యాశాఖ కార్యదర్శి, మంత్రి దృష్టికి ఈ అంశాలను తీసుకెళ్లి తగు నిర్ణయం తీసుకుంటామంటూ శ్రీదేవసేన హామీ ఇచ్చారని తెలిపారు.

పండితులకూ పదోన్నతులు కల్పించాలి

పాఠశాల విద్యాశాఖలోని అన్ని క్యాడర్లతోపాటు భాషాపండితులకూ పదోన్నతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పండిత జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు రైతుబంధు సమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గురువారం హైదరాబాద్‌లో జేఏసీ ప్రతినిధులు సి జగదీశ్‌కుమార్, ఎండీ అబ్దుల్లా, చక్రవర్తుల శ్రీనివాస్, ఎస్ నర్సిములు, కాంతికృష్ణ, గౌరీశంకర్ కలిసి వినతిపత్రం సమర్పించారు. కోర్టు కేసు సాకుతో పదోన్నతులు కల్పించకపోవడం వల్ల వేలాదిమంది భాషా పండితులు ఆందోళనలో ఉన్నారని తెలిపారు. కోర్టు తుది తీర్పునకు లోబడి పదోన్నతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన సానుకూలంగా స్పందించారని పేర్కొన్నారు.



రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రావణ కాష్టమే..

అంతర్జాతీయంగా ఆయిల్ ధరలు తగ్గితే.. దేశంలో పెంచింది : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-మునగాల

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాష్ట్రంలోనూ వస్తే రావణ కాష్టం అవుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. సూర్యాపేట జిల్లా మునగాల మండల కేంద్రంలో గురువారం కాంతారెడ్డి సంస్మరణ సభలో తమ్మినేని పాల్గొన్నారు. అనంతరం దేవరం వెంకటరెడ్డి నివాసంలో విలేకరులతో మాట్లాడారు. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతుందన్నారు. కులాలు, మతాల మధ్య ఘర్షణలను పెంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తుందని విమర్శించారు. విద్యుత్ వినియోగదారులపై నెల నెలా యూనిట్‌కు 30 పైసల చార్జీలు పెంచి భారాలు మోపాలని చూస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలక్ట్రిసిటీ చట్టం ప్రకారం విద్యుత్ చార్జీలు పెంచే అధికారం లేదన్నారు. ఇప్పటికే పెట్రోల్ డీజిల్‌పై ధరలు పెంచి ప్రజల నడ్డివిరిచిందని గుర్తుచేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్ ధరలు తక్కువగా వున్నా.. దేశంలో మాత్రం పెరుగుతూనే ఉండటం దారుణమన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు నిధుల విషయంలో వివక్షకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గవర్నర్ల వ్యవస్థ అధ్వానంగా మారిందన్నారు. గవర్నర్లు రోజు వారీ రాజకీయాల్లో జోక్యం చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. గవర్నర్ల వ్యవస్థను తొలగించాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తుందన్నారు. రాష్ట్రంలో 12లక్షల ఎకరాల పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు రైతులకు ఫిబ్రవరి నెలలో పట్టాలందిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని గుర్తు చేశారు. ధరణిలో 9లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. ఎత్తిపోతల పథకాలు నిర్లక్ష్యానికి గురౌతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎత్తిపోతల నిర్వహణ బాధ్యత ప్రభుత్వానిదేనని, ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎత్తిపోతల నిర్వహణ రైతులకు భారంగా మారిందన్నారు. ఆపరేటర్లకు వేతనాలు అందడం లేదన్నారు. జిల్లాలో అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రస్తుతం కాల్వల ద్వారా 60 శాతం మాత్రమే రైతాంగానికి సాగు నీరందుతుందని తెలిపారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మల్లు లక్ష్మీ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వరరావు, కోటా గోపి, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నాటు తుపాకీ పేలి వేటగాడు మృతి



నవతెలంగాణ-సిరికొండ

నాటు తుపాకీ పేలి వేటగాడు మృతిచెందిన ఘటన నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలం తూంపల్లి గ్రామ శివారులోని కొత్త తిరుపతి మందిరం సమీపంలోని చిన్న మైసమ్మ ప్రాంతంలో చోటుచేసుకుంది. ఎస్ఐ నర్సింలు తెలిపిన వివరాల ప్రకారం.. కామారెడ్డి జిల్లా మాచారెడ్డి మండలం సోమార్‌పేట్ గ్రామ పరిధిలోని సార్ధపూర్ తాండాకు చెందిన బానవత్ రావూజీ (36) మరో ఇద్దరు యువకులతో కలిసి తూంపల్లి సమీపంలోని దట్టమైన అటవీ ప్రాంతంలో వేటకు బుధవారం రాత్రి వెళ్లారు. ఆ సమయంలో ఆకలితో ఉన్న వారు పక్కనే ఉన్న చెట్టుకున్న కాయలను తెంపి, ఈ చెట్టు కొమ్మను నరికి నిచ్చెనగా చేసుకొని రావూజీ చెట్టు ఎక్కి కూర్చున్నాడు. రామ్‌రెడ్డిని తన తుపాకీ అందివ్వాలని చెప్పడంతో, చీకటిలో తుపాకీ అందిస్తున్న సమయంలో ట్రిగ్గర్‌కు చెట్టు కొమ్మ తట్టుకొని పేలింది. దాంతో రావుజీ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనతో భయపడిన మిగిలిన ఇద్దరూ అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. మృతునితో పాటు ఉన్న మిగిలిన ఇద్దరు బానవత్ రాంరెడ్డి, బద్దం ఆశిష్ రెడ్డిని పోలీసులు విచారించగా.. గతంలో పలుమార్లు ముగ్గురూ కలిసి వన్యప్రాణుల వేటకు వెళ్ళేవారని, బుధవారం రాత్రి కూడా వేటకు వెళ్లినట్టు తెలిపారు. కాగా మృతదేహానికి పంచనామా నిర్వహించిన పోలీసులు.. పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ విషయమై జిల్లా అటవీ అధికారి వికాస్ మీనా అటవీ అధికారులను వివరణ కోరారు. అటవీ ప్రాంతంలో ఇన్ని ఘటనలు జరుగుతున్నాయంటే, అటవీ అధికారుల పర్యవేక్షణ కొరవడిందని, ఇలాంటి ఘటనలు జరగకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు సమాచారం.

జర్నలిస్టుల రైల్వే పాసులు పునరుద్ధరించాలి

- రైల్ నిలయం ఎదుట హెచ్‌యూజే, టీడబ్ల్యూజేఎఫ్, టీబీజేఏ సంఘాల ధర్నా
- జీఎం ఏకె జైన్‌కు వినతి పత్రం అందజేత



నవతెలంగాణ బ్యూరో -హైదరాబాద్

జర్నలిస్టుల రాయితీ రైల్వేపాసులను వెంటనే పునరుద్ధరించాలని హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్(హెచ్‌యూజే) , తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్), తెలంగాణ బ్రాడ్ కాస్ట్ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీబీజేఏ) డిమాండ్ చేశాయి. వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు గురువారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట జర్నలిస్టులు ధర్నా నిర్వహించారు. కరోనా కంటే ముందు వరకు కొనసాగిన రాయితీని ఆ తరువాత కేంద్ర ప్రభుత్వం ఎత్తివేయడాన్ని ఖండించారు. కరోనా కాలం ముగిసి ఏడాది అవుతున్నా రాయితీ సౌకర్యాన్ని పునరుద్ధరించకపోవడాన్ని తప్పుబట్టారు. భారీ సంఖ్యలో పాల్గొన్న జర్నలిస్టుల నినాదాలతో రైల్ నిలయం దద్దరిల్లింది. దాదాపు రెండు గంటల పాటు జర్నలిస్టుల ధర్నా కొనసాగింది. అనంతరం జర్నలిస్టుల రైల్వేపాసులు కొనసాగించాలని కోరుతూ సౌత్ సెంట్రల్ రైల్వే జీఎం అరుణ్‌కుమార్ జైన్‌కు జర్నలిస్టు సంఘాలతో కూడిన ప్రతినిధి బృందం వినతి పత్రం సమర్పించింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టీడబ్ల్యూజేఎఫ్ ప్రధాన కార్యదర్శి బి బసవపున్నయ్య మాట్లాడుతూ రాయితీని కేంద్రం ఇపుడు కొత్తగా ఇచ్చేది కాదనీ, ఏండ్ల తరబడి కొనసాగుతున్నదేనని చెప్పారు. మీడియాను, జర్నలిస్టులను గౌరవించాలని కోరారు. అసలే వేతనాలు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్న జర్నలిస్టులకు, 50 శాతం రాయితీ లేక అనేక కష్టాలు పడుతున్నారని చెప్పారు. జర్నలిస్టుల రైల్వేపాస్‌లను కేంద్రం పునరుద్ధరించక పోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుడిగ రఘు, కార్యదర్శి ఇ.చంద్రశేఖర్ మాట్లాడుతూ జర్నలిస్టుల రైల్వే పాస్ రాయితీల విషయంలో కేంద్రం తీరు సరైంది కాదన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. హెచ్‌యూజే అధ్యక్ష, కార్యదర్శులు బి. అరుణ్‌కుమార్, బి.జగదీశ్ మాట్లాడుతూ చిన్న మధ్య తరగతి జర్నలిస్టుల విషయంలో కేంద్ర వైఖరి మార్చుకోవాలనీ, రాష్ట్ర ఎంపీలు ఈ విషయమై వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో ప్రస్తావించాలని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఎంపీలకు వినతిపత్రాలు ఇవ్వనున్నట్టు ప్రకటించారు. ఈ ధర్నా కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శులు ఎస్‌కె సలీమ, గంధ్ర నవీన్ , బి. రాజశేఖర్. రాష్ట్రకార్యవర్గ సభ్యులు పి.నాగవాణి , మేడ్చల్ జిల్లా అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, హెచ్‌యూజే నాయకులు సుభాష్ , వీరేష్ తదితరులు పాల్గొన్నారు.



మోడీ సర్కారు రైతులకిచ్చిన హామీలు అమలు చేయాల్సిందే...

- 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు : పోస్టర్ ఆవిష్కరణలో ఎస్‌కేఎం పిలుపు
- సింఘ్ బోర్డర్‌లో రైతు అమరుల స్థూపాన్ని నిర్మించాలి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

రైతు ఉద్యమ సమయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోడీ రైతులకిచ్చిన హామీలను అమలు చేయాల్సిందేనని సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్‌కేఎం) డిమాండ్‌చేసింది. వాటిని సాధించుకునేందుకు వీలుగా ఈనెల 26న జిల్లా కేంద్రాల్లో ట్రాక్టర్లు, వాహనాల ర్యాలీలు నిర్వహించాలని ఎస్‌కేఎం రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. రైతు వ్యతిరేక మూడు వ్యవసాయ చట్టాలను ఉపసంహరించుకునే నేపథ్యంలో రైతులకు నవంబర్ 21, 2021న రాతపూర్వక హామీ ఇచ్చిందని పేర్కొంది. వాటిని ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించింది. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఏఐకేఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో ఎస్‌కేఎం రాష్ట్ర నాయకులు టి. సాగర్, పశ్యపద్మ, రాయల చంద్రశేఖర్, మండల వెంకన్న, పెద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య, జక్కుల నరసింహ తదితరులు పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వామినాథన్ కమిటీ సిఫార్సుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి 50శాతం కలిపి మద్దతు ధర నిర్ణయించే చట్టం చేయాలనీ, అందుకోసం రైతు సంఘాల ప్రతినిధులతో కూడిన కమిటీని నియమించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ పంటల ధరల ప్రకారం పెట్టిన పెట్టుబడిలో 80శాతం కూడా రైతులకు రాకపోవడంతో వారు రుణగ్రస్తులవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్ల రైతు రుణాలను రద్దు చేసేందుకు పార్లమెంట్‌లో చట్టం చేయాలనీ, రుణ విమోచన చట్టం చేయాలని కోరారు.

రైతులతో చర్చించకుండానే విద్యుత్ సవరణ బిల్లు ఎలా ప్రవేశ పెడతారు?

విద్యుత్ సవరణ బిల్లును ఉపసంహరించాలని ఎస్‌కేఎం కేంద్ర ప్రభుత్వాన్ని కోరిందని వారు ఈ సందర్భంగా గుర్తు చేశారు. రైతు సంఘ నాయకులతో చర్చలు జరిపిన తర్వాతనే బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడుతామంటూ కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందన్నారు. అందుకు పూర్తిగా భిన్నంగా బీజేపీ సర్కారు బిల్లును ప్రవేశ పెట్టిందని విమర్శించారు. రాష్ట్రాలపై ఒత్తిడి తెచ్చి బిల్లు ఆమోదానికి ప్రయత్నం చేస్తున్నదన్నారు. లఖింపూర్‌ఖేరి మూకుమ్మడి హత్యాఘటనపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదన్నారు. ఉద్యమ సందర్భంగా రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలనీ, చనిపోయిన వారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని ఓ అబద్ధంలాగా మార్చిందన్నారు. సమగ్ర చట్టం తయారు చేసి రైతులందరికీ కరువులు, వరదల సందర్భంగా పంటలు నష్టపోయిన వారందరికీ పరిహారాలు చెల్లించాలని కోరారు. ప్రస్తుత చట్టం బీమా కంపెనీలకు వేల కోట్లు లాభాలు కట్టబెడుతున్నదని విమర్శించారు. రైతులందరీ బీమా ప్రీమియాన్ని కేంద్ర ప్రభుత్వమే చెల్లించాలనీ, ఆ విధంగా చట్టాన్ని మార్చాలని డిమాండ్ చేశారు. అరవై ఏండ్లు దాటిన సన్న, చిన్న, మధ్యతరగతి రైతులకు, వ్యవసాయ కూలీలకు, కౌలు రైతులకు, చేతి వృత్తిదారులకు రూ.5వేల పెన్షన్ నిర్ణయించి అమలు చేయాలన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో రైతులపై పెడుతున్న అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

సింఘ్ బోర్డర్‌లో చారిత్రాత్మక పోరాట కేంద్రం వద్ద రైతు అమరవీరుల స్థూపాన్ని నిర్మించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచాలనీ, రోజుకు రూ 600 కూలీ 200 రోజుల పని గ్యారంటీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం అర్హులైన అందరికీ హక్కు పత్రాలు ఇవ్వాలనీ, కౌలు రైతులకు రుణార్హత కార్డులు ఇవ్వాలనీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో బి. ప్రసాద్, లెల్లెల బాలకష్ణ, వస్కుల మట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రచార ఆర్భాటంగా బీఆర్ఎస్ సభ

- బీజేపీని కట్టడి చేయడం కాంగ్రెస్‌తోనే సాధ్యం
- వామపక్షాలు మాతో కలిసిరావాలి
- పొంగులేటి వస్తానంటే పార్టీలోకి ఆహ్వానిస్తాం: విలేకరుల సమావేశంలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



నవతెలంగాణ- ఖమ్మం

ఖమ్మంలో జరిగిన బీఆర్ఎస్ బహిరంగ సభ ద్వారా కేసీఆర్ దేశానికి దశ, దిశ ఎజెండా ఇస్తామని ప్రచార ఆర్భాటం చేశారని కానీ అలాంటి ఎజెండానే ఎక్కడా కన్పించలేదని మధిర శాసనసభ్యులు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క ఆరోపించారు. గురువారం ఖమ్మంలోని జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్రంలో గిరిజనులు ఎదుర్కొంటున్న పోడు భూముల సమస్య పరిష్కారం గురించి బీఆర్ఎస్ సభలో ప్రస్తావనే లేదన్నారు. తెలంగాణలో ప్రతి జిల్లాకు యూనివర్శిటీ ఉందని, కానీ ఖమ్మం జిల్లాకు లేదని, ఇవ్వాలని కోరినా ప్రకటన చేయలేదని తెలిపారు. ఇండ్ల స్థలాలు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు గురించి సభలో ఊసే ఎత్తలేదని విమర్శించారు. విభజన చట్టం హక్కుగా పొందిన బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ గురించి పోరాటం చేయాలని కోరామని, దీని గురించి మాట్లాడనే లేదని, సింగరేణి బొగ్గు గనులను ప్రయివేటీకరణ చేస్తున్న బీజేపీ చర్యలకు ఎలా అడ్డుకట్ట వేస్తారో సీఎం కేసీఆర్ స్పష్టత ఇవ్వలేదన్నారు. జాతులు, కులాలు, ప్రాంతాలు, మతాల పేరిట దేశ ప్రజలను విభజించి, విద్వేషాలను రెచ్చగొట్టి, ఘర్షణలు సృష్టించి, రక్తపాతంతో రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్న బీజేపీ నేడు దేశానికి పెనుసవాల్‌గా మారిందన్నారు. బీజేపీని కట్టడి చేయడం కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని తెలిపారు. దేశంలోని ప్రజాస్వామిక వాదులు, లౌకిక వాదులు కాంగ్రెస్ చేసే ప్రయత్నంలో భాగస్వాములు కావాలని, సాధించుకున్న లౌకిక వ్యవస్థను, సామ్యవాద విధానాలకు తూట్లు పొడుస్తున్న బీజేపీని దూరం పెట్టడానికి మనందరం ముందడుగు వేద్దామని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర ఈ నెల 30న శ్రీనగర్‌లో ముగుస్తున్నందన పెద్ద సభ నిర్వహిస్తున్నారన్నారు. భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా ఈ నెల 26 నుంచి రెండు నెలల పాటు దేశ వ్యాప్తంగా బ్లాక్ నుంచి నియోజకవర్గ స్థాయి వరకు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర మొదలవుతుందని తెలిపారు. ఈ యాత్రలో ఇంటింటికి వెళ్లి రాహుల్ గాంధీ సందేశాన్ని వినిపిస్తామని, దేశాన్ని కాపాడుకుందామని విజ్ఞప్తి చేస్తామన్నారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా కాంగ్రెస్‌తోనే వామపక్షాలు కలిసి ప్రయాణం చేస్తే బావుంటుందని విజ్ఞప్తి చేశారు. మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లోకి వస్తే తాము స్వాగతిస్తామన్నారు. సమావేశంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, టీపీసీసీ ఉపాధ్యక్షులు, మాజీ శాసన మండలి సభ్యులు పోట్ల నాగేశ్వరరావు, పాలేరు నియోజకవర్గ పీసీసీ సభ్యులు రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

టీచర్ మల్లికార్జున్‌పై దాడి కేసులో.. మరో ఏడుగురు అరెస్ట్

- వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు

నవతెలంగాణ-బోధన్

నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలో తెలుగు ఉపాధ్యాయుడు మల్లికార్జున్ విధుల్లో ఉన్నప్పుడు కొంతమంది వ్యక్తులు.. బలవంతంగా గుడిలోకి తీసుకెళ్లి బొట్టుపెట్టి అవమానించిన ఘటనలో 10 మందిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కోటగిరి పోలీస్ స్టేషన్లో మల్లికార్జున్ ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై విచారించిన ఏసీపీ కిరణ్ కుమార్ పదిమందిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసును నమోదు చేశారు. అందులో భాగంగా బుధవారం ముగ్గురు రమేష్, సాయిబాబు, వర్షిత్‌ను అరెస్టు చేయగా.. గురువారం కాపుగాండ్ల శ్రీనివాస్ అలియాస్ గాండ్ల శ్రీను, పబ్బ శేఖర్, గాండ్ల గోపి, పార్వతి మురళి, మామిడి శ్రీనివాస్ అలియాస్ శ్రీను, ఎడ్డెడి రాజు అలియాస్ డాన్, మామిడి నవీన్ తదితరులను అరెస్టు చేసినట్టు ఏసీపీ తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసులో మొత్తం 10 మందిని అరెస్టు చేసినట్టు ఏసీపీ వెల్లడించారు.



వనపర్తి పట్టణంలో కంటి వెలుగు కార్యక్రమంలో మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



సూర్యాపేట జిల్లా కేంద్ర పరిధిలోని కుడకుడలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మంత్రి జగదీశ్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, కలెక్టర్ హేమంత్‌కేశవ్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మల్ జిల్లాలో దేవాదాయ శాఖ మంత్రి ఐకే రెడ్డి (ఇంద్రకరణ్‌రెడ్డి)

సంపూర్ణ అంధత్వం నివారణనే లక్ష్యంగా "కంటి వెలుగు"

రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత కంటి పరీక్షలు

నవతెలంగాణ- విలేకరులు

నిరుపేదలకు మెరుగైన వైద్యం.. సంపూర్ణ అంధత్వం నివారణనే లక్ష్యంగా ప్రభుత్వం "కంటి వెలుగు" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. గురువారం వనపర్తి పట్టణంలోని బాలభవన్, గోపాల్‌పేట మండల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో "కంటి వెలుగు" కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ షేక్ యాస్మిన్ బాషాతో కలిసి మంత్రి ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా కంటి వెలుగు కార్యక్రమానికి మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ప్రజాప్రతినిధులు ప్రారంభించారు.

తొలి రోజు 1.60 లక్షల మందికి కంటి పరీక్షలు: వైద్యారోగ్యశాఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కంటి వెలుగు రెండో దశ కార్యక్రమంలో భాగంగా గురువారం తొలి రోజు ఒక లక్షా 60 వేల మందికి కంటి పరీక్షలను నిర్వహించారు. ఈ మేరకు వైద్యారోగ్యశాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. 1,500 క్యాంపుల నిర్వహించింది. 37 వేల మందికి రీడింగ్ గ్లాసెస్‌ను పంపిణీ చేసింది. 33వేల మందికి ప్రిస్కిప్షన్ గ్లాసెస్ అవసరమని గుర్తించింది.

కంటి పరీక్షలకు వచ్చి.. మూర్ఛతో వ్యక్తి మృతి

- కంటి వెలుగు కార్యక్రమంలో విషాదం

నవతెలంగాణ- కందనూలు

రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో అపశృతి జరిగింది. నాగర్‌కర్నూలు జిల్లా మున్సిపాలిటీ పరిధిలోని దేసిటికాల బస్తీ దవాఖానాలో గురువారం కంటి పరీక్షల కోసం వచ్చిన ఓ వ్యక్తి మూర్ఛ వ్యాధితో మృతిచెందాడు. దేసిటికాల గ్రామానికి చెందిన చాకలి మొగులయ్య(40) కంటి పరీక్షల కోసం వచ్చాడు. ఆయనకు పరీక్ష చేసిన అధికారులు అద్దాలు పంపిణీ చేసే క్రమంలో మూర్ఛ వచ్చి స్పృహ కోల్పోయాడు. వెంటనే అధికారులు 108 సాయంతో నాగర్‌కర్నూల్ జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించే ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని ప్రయత్నాల్లో సమగ్ర విధానం అవసరం

- రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రపంచానికి స్థిరమైన వృద్ధి, అన్ని ప్రయత్నాల్లో సమగ్ర విధానం అవసరమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందర రాజన్ అభిప్రాయపడ్డారు. గురువారం హైదరాబాద్‌లో జెఎన్ఏఎఫ్ఏయు నాలుగో స్నాతకోత్సవంలో ఆమె పుదుచ్చేరి నుంచి ప్రత్యక్ష ప్రసారం ద్వారా పాల్గొన్నారు. యూనివర్సిటీ పాఠ్యాంశాలను జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా మార్చినందుకు అభినందనలు తెలిపారు. ఉపాధ్యాయులు దేవుళ్ల లాంటి వారని కొనియాడారు.హైదరాబాద్ ఐఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ బీ.ఎస్.మూర్తి మాట్లాడుతూ శని, ఆదివారాల కోసం వేచి చూడనటువంటి వృత్తిని ఎంచుకోవాలని సూచించారు. ఉద్యోగం వెతికే తగిన వ్యక్తులుగా ఎదగాలని సూచించారు.

రియల్ రంగంలో హెచ్ఎమ్‌డీఏ హవా

- ల్యాండ్ పార్సిల్ విక్రయాల్లో రికార్డులు
- ప్రభుత్వానికి భారీగా ఆదాయం
- 1.21 లక్షల చదరపు గజాలు విక్రయం
- సుమారు రూ.800 కోట్ల ఆదాయమే లక్ష్యం



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రియల్ ఎస్టేట్ రంగంలో హెచ్ఎమ్‌డీఏ దూసుకుపోతోంది. ఈ రంగంలో రాణించిన దిగ్గజ కంపెనీలకు దీటుగా.. తాము ఏమీ తీసిపోలేదన్న దిశగా హెచ్ఎమ్‌డీఏ ల్యాండ్ పార్సిల్ విక్రయాల్లో రికార్డులు సృష్టిస్తోంది. మెట్రో పాలిటిన్ సిటీస్‌లో అన్నింటిని వెనక్కి నెడుతూ పరుగులు తీస్తున్న హైదరాబాద్‌లో రియల్ వ్యాపారం మూడు పువ్వులు.. ఆరుకాయలు అన్న చందంగా కొనసాగుతున్నది. ఈ తరుణంలో రియల్ ఎస్టేట్ రంగంలోకి అడుగు పెట్టిన హెచ్ఎమ్‌డీఏ హైదరాబాద్ శివారు ప్రాంతాలను టార్గెట్‌గా రియల్ వ్యాపారం చేస్తోంది. ఇటీవల హెచ్ఎమ్‌డీఏ విక్రయించిన ల్యాండ్‌లో గజం రూ.1.11లక్షల ధర పలికింది. దీన్ని బట్టి చూస్తే హెచ్ఎమ్‌డీఏ ల్యాండ్ పార్సిల్ ద్వారా ఎంత ఆదాయం సమకూర్చుతుందో ఇట్టే అర్ధం చేసుకోవచ్చు. 38 ప్రాంతాల్లో ఉన్న ల్యాండ్ పార్సిల్ ద్వారా సుమారు. రూ.800 కోట్ల ఆదాయం రాబట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు అధికారులు చెబుతున్నారు.

రాష్ట్ర రాజధాని నగర పరిసరాల్లో భూముల ధరలు ఆకాశానంటుతున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ చుట్టూ భూములకు హెచ్ఎండీఏ నిర్వహించిన ఆన్‌లైన్ వేలంలో స్థలాల కొనుగోలుకు రియల్ వ్యాపారులు పోటీపడ్డారు. ఏకంగా గజానికి రూ. 1 లక్షా 11 వేలు వెచ్చించేందుకు సైతం వెనుకాడలేదు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో 3, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాలో 4, సంగారెడ్డి జిల్లాలో 2 ల్యాండ్ పార్సిల్స్ కలిపి మొత్తం 9 చోట్ల భూములను హెచ్ఎమ్‌డీఏ విక్రయించింది. వీటి ద్వారా ప్రభుత్వానికి రూ.195 కోట్ల 24 లక్షల ఆదాయం వచ్చింది. ఈ భూములకు హెచ్ఎండీఏ నిర్ణయించిన ధర రూ.146 కోట్లు. అయితే వేలంలో కొనుగోలుదారులు పోటీపడగా రూ.195 కోట్ల ఆదాయం సమకూరింది. రంగారెడ్డి జిల్లాలో పుప్పాలగూడ, గండిపేట, కోకాపేటలో వేలం నిర్వహించారు. కోకాపేటలో 1,852 గజాల స్థలానికి ఏకంగా గజం రూ.లక్షా 11 వేలు పలికింది. మేడ్చల్ జిల్లా మూసాపేటలో 4,840 గజాలకు రూ.35 కోట్లు పలికింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంఎస్‌టీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆన్‌లైన్ వేలం పోటాపోటీగా సాగింది. మొత్తం 32,730 చదరపు గజాల్లో రంగారెడ్డి జిల్లా పరిధిలో 12,584 చదరపు గజాలు, మేడ్చల్-మల్కాజిగిరిలో 12,160 చదరపు గజాలు, సంగారెడ్డిలో 7,986 చదరపు గజాలు వేలంలో విక్రయించారు. రెండో దశ ల్యాండ్ పార్సిల్స్ విక్రయాలకు కూడా త్వరలో నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. మొత్తంగా మూడు జిల్లాల్లో ఉన్న 38 పార్సిల్స్ విక్రయాలతో సుమారు రూ. 800 కోట్ల ఆదాయం రాబట్టేందుకు హెచ్ఎమ్‌డీఏ కృషి చేస్తోంది.

ఖమ్మం సభ... ప్రగతిశీలశక్తుల కలయికకు బాట

- మంత్రి పువ్వాడ అజయ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఖమ్మంలో బీఆర్ఎస్ సభ విజయవంతమైందనీ, ఆ సభ దేశంలో ప్రగతిశీ లశక్తుల కలయికకు బాటలు వేసిందని రాష్ట్ర మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తెలిపారు. గురువారం హైదరాబాద్ బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో నిర్వహిం చిన మీడియా సమావేశంలో రైతు బంధు సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీ వద్దిరాజు రవి చంద్ర, ఎమ్మెల్యే క్రాంతి కిరణ్‌తో కలిసి మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇద్దరు గుజరాతీలు మరో గుజరాతీకి దేశ సంపదను కట్టబెట్టే ప్రయత్నాలు నడవనియ్యబోమని హెచ్చరించారు. ఆదానీకి విద్యుత్ రంగాన్ని కట్టబెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నదనీ, దీనిపై ఉద్యోగులతో కలిసి పోరాటం చేస్తామని తెలిపారు. సభ విజయవంతం కాలేదంటున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేయించుకోవాలని ఎద్దేవా చేశారు. ఖమ్మంకు నిధుల వరద పారించిన సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వద్ది రాజు రవి చంద్ర మాట్లాడుతూ ఖమ్మంలో బీజేపీకి డిపాజిట్లు కూడా రావనీ, పదికి పది స్థానాలు బీఆర్ఎస్ గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

సంపాదకీయం

"విప్లవాల" సీజన్‌లో

భారత జాతీయోద్యమాన్ని మార్క్సిస్టు దృక్పథంతో అధ్యయనం చేసిన రజనీపామీదత్ 'ఇండియాటుడే' అనే ఉద్గ్రంథం రాస్తే దానిలో పారిశ్రామిక 'విప్లవం' అని రాసిన ప్రతిచోటా దాన్ని (1930 దశకంలో) సెన్సార్ చేశారట ఆనాటి బ్రిటిష్ అధికార్లు. 'విప్లవం' అనే మాట ఎంత భీతావహంగా ఉండిందో ఆనాడు!

నేడు దావోస్ నుండి కేటీఆర్ బృందం మోసుకొస్తున్న వాటిలో

"మీది ప్రయివేటీకరణ సర్కార్, మాది నేషనలైజేషన్ ప్రభుత్వం" అని నిన్న ఖమ్మం సభలో గర్జించిన కేసీఆర్ నిజంగా ఆచరణలో ఆ మార్గంలో అడుగులేస్తే అది 'విప్లవం!' వారి చేతిలో ఉన్న ఆర్టీసీని, విద్యుత్‌ని ప్రయివేటు బాట పట్టకుండా చూస్తే అదే పదివేలు. రాష్ట్రంలో కార్మికులపై, రైతులపై దాడులు చేస్తూ, రియల్ ఎస్టేట్ దందాగాళ్ళకి వెన్నుకాస్తూ ఉంటే ప్రజలు నిజమైన విప్లవకారులెవరో వెతుక్కుంటారు.

"సెంటర్ ఫర్ ఫోర్త్ ఇండస్ట్రియల్ రివల్యూషన్" అంటే 4వ తరం పారిశ్రామిక 'విప్లవం' కూడా ఉందట. ఈలోగా 'ఇంట్లోనే' మరో పెద్దమనిషి వందేభారత్ రైలు రైల్వేల చరిత్రలో ఒక 'విప్లవం' అని ప్రవచించాడు. మరి ఇవన్నీ విప్లవాలైతే అసలు విప్లవాల సంగతేమిటని అసలైన విప్లవకారులు ఆందోళన పడాల్సిన పనిలేదు.

ఇది ఔట్ సోర్సింగ్ శకం. ఇక్కడ దేన్నయినా ఔట్‌సోర్స్ చేస్తారు. మాటలు కిరాయికి వాడుకుంటారు. మోడీ కరుణా కటాక్ష వీక్షణాల్లో తరించేందుకు, ఆయన సేవ కోసం తపించే బ్యూరోక్రాట్లు అన్ని దిక్కులా వ్యాపిస్తున్నారు. అబద్ధాలను కెలిడియోస్కోప్‌లో పెట్టి చూపే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. వందే భారత్ రైలు నూటికి నూరుశాతం స్వదేశీ టెక్నాలజీతో చేస్తున్నారట లేదా చేశారట! హతోస్మి! నేడు వారు నాటిన నూతన విద్యావిధానం మొక్కయితే, ఇంకా ముదిరి మానైతే ఇది వేదవిజ్ఞానంతో పురుడు పోసుకుందని చెప్పినా ఆశ్చర్యం లేదు. 'ఒరేయ్ మంకెన్నా! మా ఊరి మిరియాలు తాటికాయంత ఉండేవిరా!' అన్నప్పుడు నమ్మలేదా!?



ఇటీవల టెలిగ్రాఫ్ పత్రిక ప్రచురించిన వార్త చూస్తే మిరియాలు తాటికయంత ఉంటాయని నమ్మినవారు అవాక్కవక తప్పదు. జర్మనీకి చెందిన సీమెన్స్ కంపెనీ 1200 ఎలక్ట్రిక్ ఇంజన్లు సప్లయి చేసి, 35ఏండ్ల పాటు సర్వీసింగ్ సేవలు కూడా అందించేందుకు రూ.26వేల కోట్ల ఆర్డర్ పొందిందట! ఆ కంపెనీ చరిత్రలో ఇంత పెద్ద ఆర్డరు రాలేదని ఆనందంగా ఉంది. వందే భారత్ రైళ్లకు 39వేల చక్రాలు (వీల్స్) సప్లయి చేయడానికి ఒక చైనా కంపెనీ భారీ ఆర్డర్ పొందిందని గూగుల్ తల్లిని అడిగితే చెపుతుంది. ఇక్కడ మరో వింతేంటంటే... బెంగుళూరులోని మన వీల్స్ ఫ్యాక్టరీని పడావుపెట్టి, ముందే ఒక ఉక్రెయిన్ కంపెనీతో ఒప్పందం చేసుకున్నారు. రష్యాతో ఆదేశం యుద్ధంలో చిక్కుకోవడంతో తయారైన వాటిని కూడా విమానాల్లో తరలిస్తున్నారట! ఇప్పుడు చైనాకి ఆ ఆర్డర్ దక్కింది. ఈ చక్రాలు, రైలింజన్లు ఇంతకాలం మన దేశంలో 11వేల ఇంజన్లు సప్లయి చేసిన చిత్తరంజన్ లోకో మోటివ్ వర్క్సుకివ్వాలని మన"స్వదేశీ" పరిజ్ఞానులకు తడుతుందని ఎలా ఆశించగలం? ప్రస్తుత రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ సీమెన్స్‌లో మాజీ వైస్‌ప్రెసిడెంట్, జనరల్ ఎలక్ట్రిక్ ఎం.డి.గా పనిచేశారు. ఈ మాజీ ఐ.ఎ.ఎస్. అధికారి కొద్దిగా ఖాళీ దొరకంగానే బీజేపీలో చేరితే, ఆయన్ని రాజ్యసభలో కొలువుదీర్చి వెంటనే రైల్వే మంత్రిగా వెలిసేలా చేసిన మోడీ "నాయకత్వ ప్రతిభ"ను ఎంతని పొగడగలం? ఏమని పొగడగలం?

ఇదంతా ఒకెత్తు. వందే భారత్ రైలుకు రూపకర్తగా కొనియాడబడుతున్న పెద్దమనిషి పెరంబూర్‌లోని ఇంటిగ్రేటెడ్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసిఎఫ్) జి.ఎం. ఈ వందే భారత్ పెట్టెలన్నీ అక్కడే రూపొందాయి. ఈ ఐ.సి.ఎఫ్ నెహ్రూ కాలంలో పుట్టింది. ఆ కాలంలోనే ఆవిర్భవించిన చిత్తరంజన్ లోకో మోటివ్ వర్క్సు ముందు బొగ్గు ఇంజన్లు, ఆ తర్వాత డీజిల్ ఇంజన్లు, ఇప్పుడు ఎలక్ట్రిక్ ఇంజన్లు ఎప్పటికప్పుడు టెక్నాలజీ అప్‌గ్రేడ్ చేసుకుంటూ రూపొందించింది. గత 75 ఏండ్లుగా ఇంజన్లు, బోగీలు మనదేశమే తనకు తాను తయారు చేసుకుంది. ఇదీ నిజమైన స్వావలంబన. ఆత్మనిర్భర్ పేర నేడు సీమెన్స్ ఇంజన్‌లు సప్లయి చేయడమే కాదు, ఏకంగా 35ఏండ్ల పాటు సర్వీసింగ్ కూడా చేస్తారట! అంటే మన వర్క్‌షాపులు కూడా హాంపట్!

ఇదంతా 'విప్లవం' అని కొందరు చెప్పడం, కొందరు రాయడం, ఎందరో చప్పట్లు కొట్టడం! ఈ పెద్దలనేక మంది చెపుతున్నట్లు ఇవి విప్లవాలు కావు. ఆ పేరుతో ఏదో అభివృద్ధి జరిగిపోతున్నట్లు ప్రజల్ని జోకొట్టే సాధనాలు. ప్రజలు శాశ్వతంగా నిద్రావస్థలో ఉండరు. గూడు కట్టుకుని ఉంటే అది సమాధి కాదు. సీతాకోక చిలుకలు రంగురంగుల లోకాల కోసం బయటికొస్తాయి. రెక్కలు తొడిగి ఎగురుతాయి.

"మీది ప్రయివేటీకరణ సర్కార్, మాది నేషనలైజేషన్ ప్రభుత్వం" అని నిన్న ఖమ్మం సభలో గర్జించిన కేసీఆర్ నిజంగా ఆచరణలో ఆ మార్గంలో అడుగులేస్తే అది 'విప్లవం!' వారి చేతిలో ఉన్న ఆర్టీసీని, విద్యుత్‌ని ప్రయివేటు బాట పట్టకుండా చూస్తే అదే పదివేలు. రాష్ట్రంలో కార్మికులపై, రైతులపై దాడులు చేస్తూ, రియల్ ఎస్టేట్ దందాగాళ్ళకి వెన్నుకాస్తూ ఉంటే ప్రజలు నిజమైన విప్లవకారులెవరో వెతుక్కుంటారు.

బుద్ధుడు అవతారమూర్తి కాదు, చారిత్రక పురుషుడు!

బౌద్ధ సాహిత్యంలో పురాణాల ప్రసక్తిగానీ, హిందూ దేవీదేవతల పేర్లు గానీ లేవు. కానీ, రామాయణంలో బుద్ధ శబ్దం ఉంది. అంటే అది బుద్ధుడి తర్వాత కాలంలో వెలువడిన రచనగా మనం అర్థం చేసుకోవాలి. బుద్ధుడి కాలం నాటి భాష ప్రాకృత భాష. అదే అప్పటి ప్రజల భాష. ప్రాకృత అంటే ప్రకృతి. స్వభావసిద్ధంగా ఏర్పడింది అని అర్థం. ప్రాకృతానికి మరో రూపం పాలి భాష. ఈ భాషను ధమ్మ లిపిలో రాస్తారు. దేశంలో దొరికిన అతి ప్రాచీన శిలా ఫలకాలు, స్థూపాలు, బౌద్ధ సంప్రదాయానికి చెందినవి. మరీ ముఖ్యంగా అశోకుడి కాలం నాటివే ఎక్కువగా లభించాయి. ప్రాకృత భాష సంస్కరించబడి సంస్కృత భాష అయ్యింది. మొదట అది సంభాషణలకు మాత్రమే పరిమితమైన లిపిలేని ఒక మాండలిక భాష. అది ఆర్యుల వ్యవహారిక భాష. భారతదేశం వచ్చాక, ఇక్కడి నాగరి లిపిలో దాన్ని రాసుకున్నారు. దానికి దేవ శబ్దం కలిపి ఆ లిపిని దేవనాగరి లిపి అని అన్నారు. అలాగే సంస్కృతాన్ని ఏకంగా ఉన్నతీకరించుకుని దేవభాష అని అన్నారు.



డాక్టర్ దేవరాజు మహారాజు

అబద్ధాలు నిలవవు - అనడానికి ఒక మంచి ఉదాహరణ ఏమిటంటే, సంస్కృత భాషలో ఉన్న శిలాఫలకాలు దొరకలేదు. అలాంటప్పుడు సనాతనం - అంటే ఏదవుతుందీ? బౌద్ధ ధమ్మం - ధమ్మలిపి - ప్రాకృత (పాలి) భాష సనాతనమవుతాయి. చారిత్రక ప్రమాణాల మీద కదా మనం ఏ నిర్ణయమైనా తీసుకునేది? సంస్కృతం, పురాణాలు, వైదిక ధర్మం వగైరాలన్నీ సనాతనం అని ప్రచారం చేసుకోవడమే తప్పు, అందుకు ఆధారాలు లేవు. అందువల్ల సనాతన మంటే బౌద్ధ ధమ్మం, బౌద్ధ సంస్కృతి అని చెప్పుకోవాల్సి ఉంటుంది. చివరికి బుద్ధుడు చెప్పిన 'వేదన' నుండే వైదిక మత ప్రభోదకులు వేదం - అనే పదం సృష్టించుకున్నారు. మన దేశంలో పురాతన సింధూ నాగరికత బయటపడింది. హరప్పా - మొహంజోదారో శిథిలాలలో అవతారాల ఆనవాళ్ళు దొరికితే, వైదిక ధర్మమే సనాతనమైంది అని భావించే వాళ్ళం. కానీ, దొరకలేదు. దొరికే అవకాశమూ లేదు. కారణం అవన్నీ కల్పితాలు కాబట్టి! వాస్తవాలకే ఆధారాలు దొరుకుతాయి. కానీ, ఊహలకు, కల్పనలకూ దొరకవు కదా? అక్కడి అప్పటి నాగరికతకు, సభ్యతకూ ఆధారాలు దొరికాయి. శిలాఫలకాల మీద ఒక లిపికూడా దొరికింది. అయితే ఆ లిపిని ఎవరూ చదవలేకపోయారు. కానీ, అది ద్రావిడ భాషా లిపులకు దగ్గరగా ఉన్నట్టు నిపుణులు తేల్చారు.

చైనా, జపాన్, ఇండోనేషియా, థాయ్‌లాండ్ వంటి ఆసియా దేశాలలో బౌద్ధం ఇంకా ఎందుకు ఉచ్ఛస్థితిలో ఉంది? భారతదేశంలో ఎందుకు సన్నగిల్లిందీ? - అంటే ఇక్కడ బౌద్ధాన్ని వక్రీకరించి రాసుకున్న వేదాలున్నాయి. బౌద్ధారామాల్ని కొల్లగొట్టి మార్చుకున్న దేవాలయాలున్నాయి. రామాయణంలో నాస్తికుల గూర్చి, చార్వాకుల గూర్చి, బుద్ధుడి గూర్చిన ప్రసక్తి ఉందంటేనే తెలుస్తోంది కదా? వారంతా పురాణకాలానికి ముందు వారని! వారి ఆలోచనా విధానం పురాణకాలానికంటే ముందు కాలం నాటిదని!! ఒరిజనల్ ఒరిజనలే - కాపీపేస్ట్ కాపీపేస్టే! రుగ్వేదంలో స్థూపాల వర్ణన ఉందంటే, అది రాయబడక ముందే బౌద్ధ స్థూపాలు విరివిగా దేశంలో ఉన్నట్టే కదా? బౌద్ధులు విరివిగా ఉన్న దేశాలలో అష్టాంగ మార్గం - అహింస - మధ్య మార్గం - శాంతి - కొత్తదిశ వంటివి అక్కడి ప్రజల జీవితాల్లో అంతర్భాగమై పోయాయి. ఇక్కడ మన దేశంలో ఎందుకు కాలేకపోయాయి అంటే... ఇక్కడ అంతా కలుషితమై పోయింది కదా? బౌద్ధారామాలు, శిల్పాలు, స్థూపాలు విదేశీ దండయాత్రల వల్ల కొంతవరకు నాశనమైతే, ఇక్కడి బ్రాహ్మణార్యుల, వైదిక ధర్మ ప్రభోదకుల నిర్వాకం వల్ల మిగతాది నాశనమైంది. పైగా మనువాద భావజాలాన్ని బలవంతంగా జనం మెదళ్లకు ఎక్కించి, అది తరతరాలుగా కొనసాగేట్లు చేశారు. ఇంకా చేస్తూనే ఉన్నారు. బుద్ధుణ్ణి దశావతారాలలో కలుపుకున్నది ఆయన బోధనలు నిలుపుకోవడానికి కాదు, నలిపి పారేయ్యడానికి - నాశనం చేయడానికి అనేది ముందు అర్థం చేసుకోవాలి!

ఇటు హిందూ పురాణాలు, అటు బౌద్ధ సాహిత్యం క్షుణ్ణంగా అధ్యయనం చేసిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ (జాతీ భేద్ క ఉచ్ఛేద్ / Annihilations of caste వంటి పుస్తకాలు) అవతార వాదం అంతా అబద్ధం. విష్ణు దశావతారాలలో బుద్ధుడు తొమ్మిదో అవతారమని ప్రచారం చేయడంలో నిజం లేదు. ఎందుకంటే అవతార వాదమే తప్పుల తడక. ఉదాహరణకు హరివంశంలో విష్ణు పన్నెండు అవతారాలు ఎత్తాడని రాసుకుంటే, భగవత్ పురాణంలో ఇరవై రెండు అవతారాలు ఎత్తాడనీ, అందులో ఇరవై ఒకటవ అవతారం బుద్ధుడిదనీ రాసుకున్నారు. మనం ఇక్కడ అర్థం చేసుకోవాల్సింది ఏమంటే వేదాల రచన, పురాణాల రచన సుదీర్ఘకాలం పాటు సాగింది. కాలానుగుణంగా ఎవరికి తోచింది వాళ్ళు రాసుకున్నారు. అవతారాలకు నిర్దిష్టంగా ఒక సంఖ్య లేకపోవడం, అందులో బుద్ధుడి వరుస సంఖ్య మారుతూ ఉండటం అనుమానాలకు దారితీస్తుంది కదా? ఊహలకు, కల్పితాలకు ప్రామాణికత ఉండదు. కారణం, వాటికి ఏ రకమైన ఆధారాలు ఉండవు కాబట్టి!

"అవతారాలకు ఆధారాలేవీ?" అని వైదిక ధర్మ ప్రభోదకులను, ప్రవచన కారులను అడిగి చూడండి. జవాబు చెప్పలేరు సరికదా క్షణంలో తోకముడిచి పారిపోతారు. చార్వాకులు, లోకాయతులు, బౌద్ధులు, జైనులు... వీళ్ళందరూ భౌతిక వాదులు. వీరు మనుషులకు నైతికత కావాలన్నారు. దృష్టి ఈ జగత్తు మీద పెట్టమన్నారు. సమస్యల్ని పరిష్కరించుకుంటూ, మానవ సమాజాన్ని ఉద్ధరించుకోవాలన్నారు. పీడ నుండి, దుఃఖం నుండి, వేదన నుండి బయటపడే మార్గాలు అన్వేషించుకోవాలన్నారు. దీనికి పూర్తి విరుద్ధంగా వైదిక ధర్మం ఏం చెప్పిందీ? బ్రహ్మ - సత్యం అనీ, జగత్తు మిథ్య అనీ అంది. పుణ్యం, పాపం, జన్మ, పునర్జన్మ, మోక్షం వంటి మూఢనమ్మకాల్ని వ్యాప్తిచేసింది. ఎక్కడాలేని పరలోకాల గురించి ప్రచారం చేసింది. వెరసి, మనుషుల ఆత్మ విశ్వాసాన్ని దెబ్బతీసింది. హిందూ సన్యాసికి ఈ ప్రపంచంతో సంబంధం ఉండదు. కానీ, బౌద్ధ భిక్షువుకు ప్రపంచంతో తప్పక సంబంధం ఉంటుంది. వారు సామాన్య జనానికి సేవ చేస్తారు. బౌద్ధ ధమ్మం బోధిస్తారు. వీరికి స్వంత ఆస్తి అంటూ ఉండదు.

ఇకపోతే, హిందువుల దశావతారాల్లో బుద్ధుణ్ణి చేర్చుకున్నారు కదా? బుద్ధుడు హిందూమతంలో భాగమే అని అంటారు కదా? మరి బౌద్ధారామాల్ని పరిరక్షించుకోవాలని గానీ, పునరుద్ధరించుకోవాలని గానీ వైదిక సంస్థలకు, నేటి ప్రభుత్వాలకూ ఎందుకు ఉండటం లేదూ? విశాఖ పరిసర ప్రాంతాల్లో ఉన్న తొట్లకొండ, పావురాల కొండ, బొజ్జన్న కొండ, లింగాల కొండ లాంటి వన్నీ ఎందుకు నిరాదరణకు గురవుతున్నాయీ? విషయాలు తెలుసుకుని, లోతుగా అధ్యయనం చేయవల్సిన అంశమిది. ఉదాహరణకు ఇక్కడ ఒక ప్రాంతం గురించి ప్రస్తావించాను కానీ, దేశ వ్యాప్తంగా శిథిలమైపోయిన బుద్ధ విగ్రహాలు, స్థూపాలు, ఆరామాలు ఎన్నెన్నో ఉన్నాయి కదా? మరి వాటిని ఎందుకు పట్టించుకోవడం లేదూ? పునరుద్ధరించుకోవడం లేదంటే, అవి తమ వైదిక ధర్మానికి ఏమాత్రం సంబంధం లేనివి అని వారికి కచ్చితంగా తెలుసునన్న మాట! వైదిక ధర్మాన్ని నెత్తిన పెట్టుకునే ప్రభుత్వ పెద్దలవి నాటకాలు కావా? చారిత్రక అవగాహన తప్పనిసరికదా? "సనాతన" బౌద్ధ ధమ్మాన్ని రక్షించుకుందామన్న చిత్తశుద్ధి అవసరం కదా? మనువాదుల ప్రభావంలో పడి తమను తాము గుర్తించుకోవడం మరిచిపోయిన జనం, ఎప్పుడు వివేకవంతులవుతారో మరి? ఆరామాలని అరాచక కేంద్రాలని ప్రచారం చేశారు. మహాస్థూపాలను అన్యాయంగా 'లంజెదిబ్బ'లన్నారు. స్థూపాలు దిబ్బలైనాయి. విహారాలు గబ్బిలాలకు నిలయాలైనాయి. బుద్ధుడు విష్ణుమూర్తి అవతారమని ఒక మహా అబద్ధం ప్రచారం చేసినవారే ఈ దుర్మార్గాలన్నీ చేశారు.

లాభసాటి వ్యాపారాలు నడుస్తాయంటే ఈ మనువాదులు, రేపొద్దున అంబేద్కర్‌ను కూడా దేవుడిగా చేసేయ్యగల సమర్థులు! మనువాదుల మాయాజాలం మహావిచిత్రం. సాధారణ శకానికి ముందు బుద్ధుడు ఈ నేల మీద పుట్టి పెరిగి, దేశం నాలుగు చెరగులా తిరిగినవాడు. కల్పితం కాదు. మరి కల్పించుకున్న దేవుళ్ళలో బుద్ధుణ్ణి చేర్చడమేమిటీ? వాస్తవాలకూ భ్రమలకూ తేడా తెలుసుకోండి! అందువల్ల విష్ణు అవతారాలలో బుద్ధుడు కూడా ఒకడు అని చెప్పడం వందశాతం అబద్ధం!!



ఇవన్నీ ప్రత్యక్షంగా కళ్ళకు కనిపిస్తున్న విషయాలు. కొన్ని స్థూపాలు నరసింహక్షేత్రాలయ్యాయి. తిరణాల స్థానంలో మంత్రతంత్రాలు ప్రతిష్టించారు. అష్టాంగ మార్గాన్ని అష్టోత్తరాలుగా మార్చారు. పంచశీలను పాతిపెట్టారు. నిబ్బాణకు బదులు వ్రతాల్ని ప్రవేశపెట్టి, గృహిణుల్ని మానసిక బానిసలుగా మార్చారు. పదిహేను వందల ఏండ్ల పాటు శాంతియుత సుఖమయ, ఆనందకర జీవితాన్ని అందించిన బౌద్ధ జీవన శైలిని ఏరకంగా నాశనం చేశారో రఘుపతి రావు (2010) ఒక పుస్తకంలో విశదపరిచారు.

అశోకుడి కంటే ముందే 'సనాతన' సంస్కృతిలో (అంటే వారి వైదిక సంస్కృతిలో) అనేక స్థూపాలున్నాయని కొందరు తప్పుడు వ్యాఖ్యానాలు చేస్తున్నారు. సింహస్థంభ, ధ్వజస్థంభ, సూర్య స్థంభ, విజయ స్థంభ వంటి వాటి గురించి చెపుతూ - ఇవి, భూమి అనంత విశ్వం నుంచి విడివడడాన్ని (Separation of earth with infinite cosmos) సూచిస్తాయని చెపుతారు. అయితే ఇందులో సింహ స్థంభం, సూర్య స్థంభాలకు బౌద్ధుల శిల్పాలతో పోలికలున్నాయి. అబద్ధాలు ప్రచారం చేసే ఆ మందమతులు ఆ విషయం గ్రహించలేదు. ఇకపోతే అశోక స్థంభాల్ని స్ఫూర్తి (మోడల్)గా తీసుకుని తర్వాత కాలంలో కొందరు ప్రాంతీయ పరిపాలకులు కొంత భిన్నంగా స్థూపాలను నిర్మించి ఉంటారు. కాదనలేం. కార్బన్ డేటింగ్ చేయించి అవి ఏకాలంవో నిర్ధారణ చేయిస్తేగానీ అసలు విషయం బయటపడదు. ఏమైనా అశోకుడికి ముందు కాలంలో దేశంలో స్థూపాలున్న విషయం ఏ చరిత్రకారుడూ నమోదు చేయలేదు. ఆనాటి చరిత్రకారుల్ని నమ్ముదామా? లేక ఈనాటి ఈ మిడిమిడి జ్ఞానపు వైదిక హిందూ పండితుల్ని నమ్ముదామా? హేతుబద్ధంగా ఆలోచించే వారు నిజమైన ప్రమాణాల్ని మాత్రమే పరిగణనలోకి తీసుకుంటారు.

ఆనాటి వైదిక మత గురువు శంకరాచార్యకు పెద్ద గొంతు, వాదనా పటిమ ఉండి ఉంటుంది. ఉంటే మాత్రం సున్నిత మనస్కులైన బౌద్ధభిక్షువుల్ని హేళన చేసి, అవమానించి, న్యూనతా భావంతో వారు ఆత్మహత్య చేసుకునే దాకా వదిలిపెట్టేవాడు కాదు. ఉగ్రవాదం అనే పదం ఆ రోజుల్లో లేదు కానీ, అతను ఓ రకమైన ఉగ్రవాదే! మనిషిని మనిషిగా గౌరవించలేని వాడు ఎంత ఉన్నత స్థాయి వాడైనా హీనుడిగానే గుర్తింపబడాలి. ఎంత చిన్నదైనా స్వంత సృజనాత్మక శక్తి గొప్పది. అరువు తెచ్చుకున్నది అరువు తెచ్చుకున్నదే అవుతుంది. గ్రీకుల కట్టడాలు కాపీ చేసి మందిరాలు నిర్మించుకున్నట్టు - ఈజిప్టు, గ్రీకు దేవతల్ని కాపీ చేసి హిందూ దేవతల్ని ఏర్పరుచుకున్నట్టు పూర్తి ఆధారాలు దొరికాయి. లండన్‌లోని పెట్రీ మ్యూజియం ఆఫ్ ఈజిప్షియన్ ఆర్కియాలజీలో అన్ని ఆధారాలు ఉన్నాయి. కొన్ని ఆధారాలు అంతర్జాలంలో కూడా దొరుకుతాయి. ఇకపోతే... లాభసాటి వ్యాపారాలు నడుస్తాయంటే ఈ మనువాదులు, రేపొద్దున అంబేద్కర్‌ను కూడా దేవుడిగా చేసేయ్యగల సమర్థులు! మనువాదుల మాయాజాలం మహావిచిత్రం. సాధారణ శకానికి ముందు బుద్ధుడు ఈ నేల మీద పుట్టి పెరిగి, దేశం నాలుగు చెరగులా తిరిగినవాడు. కల్పితం కాదు. మరి కల్పించుకున్న దేవుళ్ళలో బుద్ధుణ్ణి చేర్చడమేమిటీ? వాస్తవాలకూ భ్రమలకూ తేడా తెలుసుకోండి! అందువల్ల విష్ణు అవతారాలలో బుద్ధుడు కూడా ఒకడు అని చెప్పడం వందశాతం అబద్ధం!!

- వ్యాసకర్త: కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు విజేత, జీవశాస్త్రవేత్త.



వందే భారత్‌లో వంద అబద్ధాలు



యం.ఎ. జబ్బార్

వందే భారత్ అంటూ, 130 కిలోమీటర్ల వేగంతో అత్యంత ఫాస్ట్‌గా గమ్యానికి చేరుస్తుందంటూ రైల్వేశాఖ ప్రకటించింది. దేశ ప్రధానమంత్రితోపాటు ఇద్దరు కేంద్ర మంత్రులు, గవర్నర్ అందరూ పండగవేళ ఆ రైలు గురించే మాట్లాడారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు నిజమైన పండగ వచ్చిందని ప్రధానమంత్రి అభివర్ణించారు. అయితే ఇక్కడ ఆలోచించాల్సిన విషయమేమిటంటే... సికింద్రాబాద్ నుంచి విజయవాడకు 905రూపాయల ఛార్జీ ఉంది. సాధారణంగా సూపర్ ఫాస్ట్, ఎక్స్ ప్రెస్ రైళ్లలో చార్జి 172రూపాయలే కాగా, అవి గమ్యస్థానానికి ఆరుగంటల్లో చేరుస్తాయి. వందే భారత్ రైలుకు సికింద్రాబాద్ నుంచి విజయవాడకు నాలుగు గంటల సమయం పడుతోంది. ఇతర రైళ్లకు, వందే భారత్‌కు తేడా కేవలం రెండు గంటలు మాత్రమే. ఆ రెండుగంటల సమయం కోసం అదనంగా 725రూపాయలా? అనే చర్చ ప్రజల్లో నడుస్తోంది. కేవలం వందే భారత్ అనేది రైలు లోపల ఇంటీరియర్ డెకరేషన్‌కు తోడు కొద్దిపాటి అదనపు వేగం మాత్రమే కలిగివుంది. అందుకే వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో విమానం స్థాయిలో సదుపాయాలు ఉన్నాయని ఊదరగొట్టినప్పటికీ ప్రయాణికుల నుంచి ఆశించినంత స్పందన కానరావడం లేదు. సికింద్రాబాద్ నుంచి విశాఖకు నడిపే సూపర్‌ఫాస్ట్ రైళ్లలో దురంతో ఎక్స్‌ప్రెస్ అతి ముఖ్యమైనది. దీనిలో ఫస్ట్ ఎసి, సెకండ్ ఎసి, థర్డ్ ఎసి కోచ్‌లు ఉంటాయి. అన్నీ స్లీపర్ బెర్తులే. దురంతోలో ఫస్ట్ ఎసి టికెట్ ధర 2,800 రూపాయలు, సెకండ్ ఎసి 2,300 రూపాయలు, థర్డ్ ఎసి 1,630రూపాయలుగా ఉంది. ఈ ఎక్స్‌ప్రెస్ కూడా గంటకు 130 కిలోమీటర్ల నుంచి 140 కిలోమీటర్ల వేగంతో వెళ్తుంది. సికింద్రాబాద్ నుంచి విజయవాడ మీదుగా విశాఖకు 10గంటల 10నిమిషాల వ్యవధిలో చేరుకుంటుంది. ఇక వందే భారత్ రైలు ఎగ్జిక్యూటివ్ క్లాస్‌లో సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు 3,170 రూపాయలుగా ఉంది. ఇందులో స్లీపర్ బెర్తులు ఉండవు. అన్నీ చైర్ సీటింగ్ మాత్రమే ఉంటాయి. సికింద్రాబాద్ నుంచి 8.30గంటల ప్రయాణంతో విశాఖకు చేరుకోవచ్చు. దురంతోతో పోల్చుకుంటే గంటా 40నిమిషాలు ముందుగా వందేభారత్‌లో ప్రయాణించవచ్చు. ఇవన్నీ చూసిన తర్వాత సగటు ప్రయాణికుడు వందేభారత్ కంటే దురంతో వైపే ఆసక్తి చూపిస్తున్నాడు. గంటన్నర వ్యత్యాసానికి అంత డబ్బు చెల్లించి, అదీ స్లిపర్ బెర్తులు లేకుండా చైర్‌లో కూర్చొని వందేభారత్‌లో వెళ్లే కంటే ఇతర సూపర్‌ఫాస్ట్ రైళ్లలో ప్రయాణించడం మేలని ప్రయాణీకులు భావిస్తున్నారు. వందేభారత్‌లో 1,128 సీటింగ్‌కు కాను 1,050 సీట్లు చైర్‌కార్ సదుపాయంతో ఉన్నాయి. మిగిలినవి ఎగ్జిక్యూటివ్ క్లాస్‌కు కేటాయించారు. వందేభారత్ రైలులో ప్యాంట్రీ కార్ లేదు. అయినా ఆహారం ఇస్తామంటూ ముందుగానే టికెట్‌తో కలిసి డబ్బులు తీసుకుంటున్నారు. ఎగ్జిక్యూటివ్ క్లాసులో ఏకంగా 400రుపాయలు వరకు చార్జీ చేస్తున్నారు. ఈ రైలులో ఆహార పదార్థాలను వేడి చేసుకునే సదుపాయం తప్పితే కనీసం కాఫీ పెట్టడానికి కూడా ఏర్పాట్లు లేవు. కానీ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు టికెట్ల రేట్లు వింటే మాత్రం గుండె గుభేల్ మంటోంది. విశాఖ నుంచి హైదరాబాద్ వెళ్లడానికి పది రోజుల ముందు బుక్ చేసుకుంటే విమానం టికెట్ 3,900 రూపాయలకే లభిస్తుంది. ప్రయాణ సమయం గంట మాత్రమే. అదే వందే భారత్ రైలులో ఎగ్జిక్యూటివ్ క్లాస్ టికెట్‌కి 3,170 రూపాయలు తీసుకుంటున్నారు. ప్రయాణ సమయం 8.30గంటలు. ఇంకో 700 రూపాయలు అదనంగా పెడితే విమానం ఎక్కి ఏకంగా ఏడు గంటల సమయం ఆదా చేసుకోవచ్చు. కాబట్టి కేంద్ర ప్రభుత్వం వందేభారత్ రైలు గూర్చి సొల్లు ప్రచారం ఆపాలి. 1988లో ప్రవేశపెట్టిన శతాబ్ది ఎక్స్‌ప్రెస్ గరిష్ట వేగం గంటకు 110 నుంచి 150 కిలోమీటర్లు. ఆ తర్వాత 2016లో గతిమాన్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. దాని గరిష్ట వేగం 110 నుంచి 160 కిలోమీటర్లు. ఇప్పుడు నూతనంగా వచ్చిన వందే భారత్ ఎక్స్ ప్రెస్‌ను కూడా 2019లోనే ప్రవేశపెట్టారు. కాకపోతే ఇది మన తెలుగు రాష్ట్రాలకు రావడానికి నాలుగేండ్లు పట్టింది.

సామాన్యుడు దీంట్లో ప్రయాణం చేయలేడు సరిగదా కనీసం ఊహించను కూడా ఊహించ లేడు. మామూలు ఎక్స్‌ప్రెస్ రేటు కంటే దీని ధర మూడు రెట్లు ఎక్కువగా ఉన్నది. రాజమండ్రి నుండి సికింద్రాబాద్‌కు గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్ బెర్త్ 325 రూపాయలు, వందే భారత్ రైలులో 1425 రూపాయలు. అందులో 350 రూపాయలు భోజన ఖర్చు. సామాన్యులెవరూ దీనిని భరించలేరు. గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణ సమయం 8 గంటల 25 నిమిషాలు. వందేభారత్‌లో 6 గంటల18 నిమిషాలు. మరి ఈ మాత్రం దానికి అంత భయంకరమైన రేటు పెట్టాలా! ఇంత సొల్లు ప్రచారం చేయాలా! ఇకపోతే స్వదేశీ పరిజ్ఞానం అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారు. సిగ్గు లేకపోతే సరి. స్వదేశీ పరిజ్ఞానాన్ని, ప్రయోగాలని పూర్తిగా పక్కన పెట్టింది కేంద్ర ప్రభుత్వం. ఆఖరికి విగ్రహాలు తయారు చేయడానికి కూడా పక్కనున్న దేశాలకి కాంట్రాక్ట్ ఇస్తున్నవారు వందేభారత్ స్వదేశీ పరిజ్ఞానమని గొప్పలు చెప్పుకుంటే ఆశ్చర్యమేముంది? అయినా ఇతర దేశాల్లో ఈజిప్టులో గంటకు 230 కిలోమీటర్లు, మొరాకోలో 320 కిలోమీటర్లు, జపాన్‌లో 374 కిలోమీటర్లు, ఫ్రాన్స్‌లో 357 కిలోమీటర్లు, స్పెయిన్‌లో 400 కిలోమీటర్లు, చైనాలో 420 కిలోమీటర్ల వేగంతో వెళుతున్న రైళ్ళను ఉపయోగిస్తుంటే మనం గంటకు 300 కిలోమీటర్ల వేగాన్నైనా ఎప్పటికి చేరుకుంటాం? ఒకవేళ చేరుకుంటే సామాన్యుడు ప్రయాణించగలడా?

సెల్: 9177264832

ఉపాధిహామీ ఉసురుతీస్తున్న కేంద్రం

దేశంలో గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు స్వాతంత్ర్యానంతరం చట్ట ప్రకారం పనికి హామీ కల్పించిన ఏకైక చట్టం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం. దీని ద్వారా దేశంలోని సుమారు 50కోట్ల మందికి పని హక్కు కల్పించాల్సి ఉన్నప్పటికీ నేటికి 33 కోట్ల మందికి కూడా పని ఇవ్వలేని స్థితి ఉంది. గ్రామీణ ప్రాంతాలతో పాటు పట్టణ పేదలకు విస్తరించాల్సి ఉండగా క్రమంగా కుదించబడు తున్నది. ముఖ్యంగా బీజేపీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత ఎనిమిది సంవత్సరాల్లో ఒకటి రెండు సంవత్సరాలు మినహా ఈ పథకానికి నిధులను భారీగా తగ్గిస్తూ వచ్చింది. దీనివల్ల పని దినాలు తగ్గాయి. చేసిన పనికి నెల నుండి మూడు నెలల వరకు బిల్లులు పెండింగ్‌లో ఉంటున్నాయి. మతతత్వ రాజకీయాల చాటున కార్పొరేట్ అనుకూల విధానాలను వేగంగా అమలు చేస్తున్న బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని మెరుగు చేయడం కాదు, కుదించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

ఉపాధి హామీ చట్టం నేపథ్యం

2005 ఆగస్టు 23న దేశ పార్లమెంట్ చారిత్రాత్మకమైన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఆమోదించింది. ఈ చట్టం వచ్చిన రెండు నేపథ్యాలను కావాలనే పాలక పార్టీలు, ప్రధాన మీడియా విస్మరిస్తుంటాయి. అందులో ఒకటి, నాటి ప్రజల జీవన పరిస్థితులు. రెండు, రాజకీయ పరిణామాలు. స్వాతంత్ర్యానంతరం పాలకవర్గాలు అమలు చేసిన ఆర్థిక విధానాలు అంతిమంగా ఒకవైపు కొద్దిమంది దగ్గర సంపద పోగుబడడానికి, మరోవైపు పేదరికం, నిరుద్యోగం, దారిద్ర్యం పెరిగిపోవడానికి కారణ మయ్యాయి. ఈ పరిస్థితుల నుండి పాలకులు బయటపడడానికి ఎద్దులు, బండ్లు, ధోవతి, బియ్యం, సహకార రుణాల లాంటి సంక్షేమ పథకాలను అమలు చేశారు. ఈ పథకాలన్నీ తాత్కాలిక ఉపశమనాలే కావడంవల్ల ప్రజల జీవన విధానాన్ని మార్చలేకపోయాయి. ఈ పరిస్థితుల్లో 1991లో పి.వి.నరసింహారావు నాయకత్వంలో ఏర్పడిన కాంగ్రెసు సంకీర్ణ ప్రభుత్వం నూతన ఆర్థిక విధానాల పేరుతో ప్రయివేటీకరణ, ప్రపంచీకరణ విధానాలను అమలు చేసింది. దీంతో ప్రజలను పెనం నుండి పొయ్యిలోకి తోసినట్లయింది. ముఖ్యంగా గ్రామీణ పేదల పరిస్థితి దయనీయంగా మారింది. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రజల హక్కుగా ఉపాధి హామీ చట్టం రావలసి వచ్చింది.

బయటకు ఎన్ని మాటలు చెప్పినా పాలక వర్గ పార్టీలన్నింటికీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం ఇష్టం లేదు. కారణం తమ వెనుక ఉన్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు. పేదలకు పని హక్కుగా ఉండకూడదనేది ప్రపంచీకరణ విధానం. శాశ్వత ఉద్యోగాలను తొలగించే విధానాలను అమలు చేస్తున్న పాలక పార్టీలు గ్రామీణ పేదలకు పని హక్కును చిత్తశుద్ధితో అమలు చేస్తారని ఊహించలేం. అంతేకాదు, ఉపాధి హామీ వల్ల వస్తున్న సామాజిక మార్పులు కూడా వీరు అంగీకరించడంలేదు.



రెండవ నేపథ్యం, రాజకీయ పరిణామాలు. ఆర్థిక విధానాల దుష్ఫలితాలు రాజకీయ, సామాజిక రంగాల్లో మార్పులకు దారితీస్తాయి. పాలక పార్టీల్లో ఎవరికీ పూర్తి మెజారిటీ రాని పరిస్థితి ఏర్పడింది. ప్రజా సమస్యలపై నిత్యం పనిచేసిన వామపక్షాల బలం చట్టసభల్లో గణనీయంగా పెరిగింది. 2004లో వామపక్షాల మద్దతు లేకుండా కేంద్రంలో ప్రభుత్వం ఏర్పడే పరిస్థితి లేదు. వామపక్షాల మద్దతుతో ఏర్పడిన యూపీఏ-1 సంకీర్ణ ప్రభుత్వం కనీస ఉమ్మడి ప్రణాళిక ఆధారంగా పరిపాలించాల్సి వచ్చింది. అందులో గ్రామీణ ఉపాధి హామీ చట్టంతో పాటు అనేక కీలకమైన అంశాలు ఉన్నాయి.

ఉపాధి చట్టం ఉద్దేశ్యం- అమలు

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టంలో ముఖ్యంగా రెండు లక్ష్యాలు కీలకమైనవి. ఒకటి గ్రామీణ పేదలకు ప్రతి ఆర్థిక సంవత్సరం కనీసం వంద రోజుల పనిని చట్టం ప్రకారం కల్పించడం, పేదల జీవితాలకు కనీస భద్రతను ఇవ్వడం. రెండు, ప్రజల జీవన ప్రమాణాలను పెంచడానికి అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పించడం. చట్ట ప్రకారం అర్హులందరికి పనులు కల్పించి, అందుకవసరమైన నిధులను కేటాయించి ఉంటే గ్రామీణ ప్రజల జీవితాల్లో పెద్ద మార్పు వచ్చి ఉండేది. అయితే పాలక పార్టీలకు ఈ చట్టాన్ని అమలు చేయడం ఇష్టంలేదు కాబట్టే చట్టం అమలులోకి వచ్చిన 17 సంవత్సరాల తర్వాత కూడా పనికి అర్హత ఉన్న వారిలో కేవలం 35 కుటుంబాలకు కూడా వంద రోజుల పని కల్పించబడడంలేదు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనం కూలీలకు ఇవ్వాలంటే... ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత కూలీల సంఖ్యకు అనుగుణంగా రూ.ఒక లక్ష 20వేల కోట్లు కేటాయించాలి. కాని ఈ సంవత్సరం రూ.73 వేల కోట్లు మాత్రమే కేటాయించారు. ఇందులో గత సంవత్సరం బకాయిలు రూ.8 వేల కోట్లు ఉన్నాయి. అంటే కేవలం రూ.65 వేల కోట్లు. ఈ చట్టం అమలుకు అవసరమైన నిధుల్లో సగం కూడా కేటాయించ కుండా ప్రభుత్వం తన వర్గబుద్ధిని చాటుకుంది. కష్టజీవులకు చట్టప్రకారం నిధులు ఇవ్వడానికి ఇష్టపడలేదు. తన మిత్రులైన కార్పొరేట్ కంపెనీలకు మాత్రం ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో బ్యాంకు అప్పుల రద్దు, ప్రత్యక్ష, కార్పొరేట్ పన్నుల తగ్గింపు, వివిధ రాయితీల కింద సుమారు రూ.లక్షన్నర కోట్లు కట్టబెట్టింది. బీజేపీ అధికారంలోకి రాకముందు 2013-14లో వంద రోజులు పూర్తి చేసిన కార్మికుల సంఖ్య 4,70,000 ఉండగా, 2014-15లో 2,50,000, 2015-16 నాటికి 1,70,000 మందికి తగ్గిపోయింది. ప్రస్తుతం 2,10,000 ఉంది. సగటు కూలీ పనిదినాల సంఖ్య 2013-14లో 46 రోజులు ఉండగా, 2014-15లో 39 రోజులకు తగ్గింది. ప్రస్తుతం 33రోజులు మాత్రమే పనులు కల్పిస్తున్నారు. కేరళలో సీపీఐ(ఎం) నాయకత్వం లోని వామపక్ష ప్రభుత్వం మాత్రమే ఉపాధి కూలీలతో పాటు, వ్యవసాయ కూలీలకు రోజు కూలీ రూ.600 అమలు చేస్తున్నది. దేశంలో గ్రామీణ పేదలతో పాటు, పట్టణ పేదలకు కూడా ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం కేరళ. ఈ మధ్యనే రాజస్థాన్ ఈ దిశగా చర్యలు తీసుకుంది. వ్యవసాయ రంగంలోకి వచ్చిన ఆధునిక యంత్రాలు గ్రామీణ ప్రజల వ్యవసాయ పనిదినాలను తగ్గించి వేస్తున్నాయి. కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ లెక్కల ప్రకారం గత పది సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా ఈ సంవత్సరం 15 రాష్ట్రాల్లో 57.8శాతం మంది మహిళలు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఇందులో కేరళ, తమిళనాడు అగ్రభాగాన ఉన్నాయి. బీజేపీ పాలిత రాష్ట్రాలు ముఖ్యంగా ప్రధాని స్వంత రాష్ట్రం గుజరాత్‌లోగాని, ఉత్తరప్రదేశ్‌లోగాని తామ ప్రభుత్వం నిర్ణయించిన కనీస వేతనం, 100రోజుల పని దినాలు, ఎందుకు అమలు కావడంలేదు? పట్టణ పేదలకు పని ఎందుకు కల్పించడంలేదు?

పాలక పార్టీల స్వభావం

బయటకు ఎన్ని మాటలు చెప్పినా పాలక వర్గ పార్టీలన్నింటికీ ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయడం ఇష్టం లేదు. కారణం తమ వెనుక ఉన్న పెట్టుబడిదారీ, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలు. పేదలకు పని హక్కుగా ఉండకూడదనేది ప్రపంచీకరణ విధానం. శాశ్వత ఉద్యోగాలను తొలగించే విధానాలను అమలు చేస్తున్న పాలక పార్టీలు గ్రామీణ పేదలకు పని హక్కును చిత్తశుద్ధితో అమలు చేస్తారని ఊహించలేం. అంతేకాదు, ఉపాధి హామీ వల్ల వస్తున్న సామాజిక మార్పులు కూడా వీరు అంగీకరించడంలేదు. అందుకే ఈ చట్టం పట్ల ఈ వర్గాలు అనేక దుష్ప్రచారాలు చేస్తున్నారు. వీరి స్వభావానికి అను గుణంగా ప్రభుత్వాలు ఈ నిధులను ఇతర పనులకు మళ్లించడం, యంత్రాలతో పనులు చేయించడం, అవినీతిని పరోక్షంగా ప్రోత్సహించడం జరుగుతున్నది. చట్ట ప్రకారం పేదలు తమ పనిహక్కును కోల్పోవడం అంటే వారు జీవించే హక్కును కోల్పోవడమే. దేశ స్వాతంత్ర్య అమృతోత్సవాలు జరుపుకుంటున్న రోజుల్లో గ్రామీణ ప్రజల వినియోగ వ్యయం 8.8శాతం తగ్గింది. ఆహారంపై చేసే సగటు వ్యయం భారీగా తగ్గిపోయింది. దీని ప్రభావం గర్భిణీ స్త్రీలు, పిల్లలపై స్పష్టంగా ఉంది. పేదల్లో 68శాతం మంది గర్భిణీ స్త్రీలు రక్తహీనతతో, 42శాతం పిల్లలు పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. కార్మిక చట్టాలను, రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్రప్రభుత్వం వ్యవసాయ కూలీల ఉపాధి హామీ చట్టం ఉసురు తీస్తున్నది. కార్మిక, కర్షకుల ఐక్యత ద్వారానే ఈ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించ గలం. అందుకే విశాల ఐక్యత, విశాల ఉద్యమాలే పరిష్కారం.

- వి. రాంభూపాల్

బీఆర్ఎస్ సభా జయప్రదంపై హర్షం

రాజ్యసభ ఎంపీ వద్దిరాజు కృతజ్ఞతలు



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభను చరిత్రలో నిలిచిపోయేలా.. అంచనాలకు మించి తరలి వచ్చి సక్సెస్ చేసిన పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజాప్రతినిధులకు రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు. సభ లోపల ఎంత మంది జనం ఉన్నారో.. బయట కూడా అంతే మంది ఉన్నారని.. బయట ఉన్న జనాలకు ఏర్పాట్లు చేయలేకపోయామన్నారు. ఈ సభ ద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ పార్టీకి తిరుగులేదని నిరూపితమైందని అన్నారు. సభకు నాయకులంతా కలిసి కట్టుగా పని చేయడం వల్లనే, సభ దిగ్విజయం అయిందని అన్నారు. ఇదే సమన్వయంతో నాయకులంతా రాబోయో ఎన్నికల్లో పని చేసి పదికి పది అసెంబ్లీ స్థానాలను బీఆర్ఎస్ ఖాతాలో వేసుకుంటామని వద్దిరాజు రవిచంద్ర తెలిపారు. బీఆర్ఎస్ దేశంలో ప్రబల రాజకీయ శక్తిగా అవతరించడానికి ఖమ్మం సభ దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సభ నిర్వహణకు అవకాశం ఇచ్చిన సీఎం కేసీఆర్‌కు ఎంపీ రవిచంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు చిత్తారు నాగమ్మ

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని, జిల్లా కార్యదర్శి నున్నా

నవతెలంగాణ-వైరాటౌన్

నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్టు చిత్తారు నాగమ్మ ఆశయ సాధన కోసం కృషి చేయాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు పిలుపు ఇచ్చారు. గురువారం వైరా మున్సిపాలిటీ పరిధిలోని గండగలపాడు గ్రామంలో సిపిఐ (ఎం) మహిళా శాఖ సీనియర్ సభ్యురాలు, ఐద్వా నాయకురాలు చిత్తారు నాగమ్మ సంస్మరణ సభ మచ్చా మణి అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు అమరజీవి కామ్రేడ్ చిత్తారు నాగమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం మాట్లాడుతూ జీవితాంతం పార్టీ ఇచ్చిన కార్యక్రమానికి నికరంగా నిలబడి నిబద్ధతతో తుదిశ్వాస విడిచే వరకూ వరకు పని చేసిన ఆదర్శ కమ్యూనిస్టు చిత్తారు నాగమ్మ అన్నారు. జీవితాంతం నిబద్ధతతో పనిచేసే గొప్పతనం కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి ఉందన్నారు.బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న నిరంకుశ ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా విస్తృతంగా ప్రజా ఉద్యమాలను నిర్మించడమే చిత్తారు నాగమ్మకు మనం ఇచ్చే నిజమైన నివాళులని అలాంటి ముఖ్య కర్తవ్యం మనందరి ముందుందని అన్నారు. జిల్లా కార్యదర్శి



నున్నా నాగేశ్వరావు మాట్లాడుతూ దోపిడీ, అసమానతలు లేని సమాజ నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తున్న కమ్యూనిస్టులను ప్రజలు బలపరచాలని, కమ్యూనిస్టుల అవసరం పెరుగుతున్న తరుణంలో చిత్తారు నాగమ్మ అనారోగ్యంతో మరణించడం చాలా దురదృష్టకరమని, పార్టీకి తీవ్ర నష్టమని అన్నారు. నేడు విలువలు లేని రాజకీయాలు నడుస్తున్నాయని, రాజకీయం అంటే అధికారం, పదవులని భావిస్తున్న తరుణంలో ఎర్రజెండా సైనికురాలిగా చిత్తారు నాగమ్మ జీవితకాలం పని చేశారని, వారి ఆశయాల సాధన కోసం మనం అందరం ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, భుక్యా వీరభద్రం, చింతలచెరువు కోటేశ్వరరావు, మాచర్ల భారతి, వైరా పట్టణ, రూరల్, ఏన్కూర్ మండలం కార్యదర్శులు సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, దొంతెబోయిన నాగేశ్వరావు, సీనియర్ నాయకులు మల్లెంపాటి వీరభద్రరావు, కారేపల్లి సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వరరావు, దొంగల తిరపతిరావు, మెరుగు రమణ, మల్లెంపాటి రామారావు, గుమ్మా నరసింహారావు, గుడిమెట్ల రజిత, హరి వెంకటేశ్వరావు, గుడిమెట్ల మోహనరావు, పైడిపల్లి సాంబశివరావు, వాసిరెడ్డి విద్యాసాగర్ రావు, దేవబత్తిని నరసింహారావు, జడ్పిటిసి కోఆప్షన్ లాల్ మహమ్మద్, వైరా మార్కెట్ చైర్మన్ రత్నం, బిఆర్ఎస్ వైరా మండల అధ్యక్షులు భాణాల వెంకటేశ్వరావు, సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య, కొణిదన కోటేశ్వరరావు, పారుపల్లి కష్ణారావు, బాజోజి రమణ, ఇమ్మడి సుధీర్, చిత్తారు సింహాద్రి, పుచ్చకాయల కష్ణయ్య, చిలకల రామనరసయ్య, తుషాకుల లింగయ్య ఇమ్మడి రామారావు, ఇమ్మడి వీరభద్రం, చిత్తారు నాగమ్మ కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు పాల్గొన్నారు.

పేదల పొట్ట కొడుతున్న పాలకులు

వ్యకాస జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు

నవతెలంగాణ - బోనకల్

పాలకులు పేదల పొట్ట కొట్టి పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు విమర్శించారు. మండల కేంద్రంలోని వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల భవనంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల స్థాయి విస్తృత సమావేశం ఆ సంఘం మండల అధ్యక్షుడు ఉమ్మనేని రవి అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు పొట్టకూటి కోసం గ్రామాలు వదిలి ఉపాధి కోసం ఇతర గ్రామాలకు వెళ్తున్నారన్నారు. అనేకమంది వ్యవసాయ కార్మికులు తమ తమ గ్రామాలలో పనులు లేక ఆటోలలో, ట్రాక్టర్లలో, టాటా ఏసీలలో కిలోమీటర్ల దూరం పనుల కోసం వెళ్తున్నారన్నారు. పనులు లేక సుదూర ప్రాంతాలకు వెళుతున్న వ్యవసాయ కార్మికులకు వెంటనే ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని



డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పండుతుందని విమర్శించారు. దీనివలన అనేక మంది వ్యవసాయ కార్మికులకు ఉపాధి లేకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకం ద్వారా కొలతల ప్రకారం కూలి కాకుండా రోజు వారి కూలీ 800 చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. పాలకుల అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇటీవల ఖమ్మంలో జరిగిన వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలలో పాలకుల అనుసరిస్తున్న విధానాలపై, వ్యవసాయ కార్మికుల ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించినట్లు ఆయన తెలిపారు. అనేక తీర్మానాలు చేసినట్లు తెలిపారు. వ్యవసాయ కార్మికుల కోసం భవిష్యత్తులో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటాల నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, ఆ సంఘం మండల ప్రధాన కార్యదర్శి బంధం శ్రీనివాసరావు, నాయకులు గుగులోతు శారద, కర్లకుంట దేవమణి, ఆళ్ల పుల్లమ్మ, దూబా భద్రాచలం, నోముల పుల్లయ్య, కొండ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



బిఆర్ఎస్ సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు

సక్సెస్ చేసిన అందరికీ కృతజ్ఞతలు

బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య

నవతెలంగాణ-చింతకాని

ఖమ్మంలో బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు ప్రజలు బ్రహ్మరథం పట్టారని బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పెంట్యాల పుల్లయ్య పేర్కొన్నారు. గురువారం గాంధీనగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటువంటి గొప్ప బహిరంగ సభలో ఖమ్మంలో నిర్వహించే అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి, బిఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రజలంతా ముఖ్యమంత్రి కేసీఆర్ వైపే ఉన్నారని బిఆర్ఎస్ ఆవిర్భావ సభ ద్వారా స్పష్టమైందన్నారు లక్షలాదిగా ప్రజలంతా తరలివచ్చి ఆవిర్భావ సభ విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు .అదేవిధంగా ముఖ్యమంత్రి కేసీఆర్ మున్సిపాలిటీలతో పాటు ప్రతి గ్రామ పంచాయతీకి రూ పది లక్షల కేటాయించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సమావేశంలో జడ్పిటిసి కిషోర్, వైస్ ఎంపీపీ గురజాల హనుమంతరావు, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు కన్నబోయిన కుటుంబరావు, గాంధీనగర్ సర్పంచ్ కాలనీ లలిత, నాగిలిగొండ సర్పంచ్ చాట్ల సురేష్, రైతు సమన్వయ సమితి జిల్లా కమిటీ సభ్యులు మంతెన రమేష్, మండల కమిటీ సభ్యులు గద్దం శ్రీను, బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి బొడ్డు వెంకట రామారావు, యువజన విభాగం మండల అధ్యక్షుడు పిన్నెల్లి శ్రీనివాస్, నాయకులు వేముల నరసయ్య, షేక్ ఖాసిం, పప్పుల రామారావు, తునికిపాటి లక్ష్మణ్, బూరుగడ్డ లక్ష్మీనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

వ్యవసాయరంగాన్ని కాపాడుకోవాలి

తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు

నవతెలంగాణ-చింతకాని

శ్రీలంక, పాకిస్తాన్ దేశాలలో వచ్చిన ఆహార సంక్షోభాన్ని పరిగణలోకి తీసుకొని భారతదేశంలో వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవాలని, విదేశీ సంస్థల యొక్క ఒత్తిళ్లకు భారత వ్యవసాయ రంగాన్ని బలిచేయొద్దని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో నాగులవంచ వంకాయలపాటి రామయ్య ఫంక్షన్ హాల్‌లో రైతు సంఘం మండల కార్యదర్శి తోటకూర వెంకట నరసయ్య అధ్యక్షతన జరిగిన చింతకాని, బోనకల్ మండల రైతుల అవగాహన సదస్సులో బొంతు రాంబాబు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయం పేరుతో శ్రీలంకలో, వరదలు మూలంగా పాకిస్తాన్లో ఆహార పంటలు ఉత్పత్తులు తగ్గి ప్రజలకు ఆహారం అందుబాటులో లేక ప్రజల చనిపోయే దుస్థితి ఏర్పడిందని, భారత దేశంలో పాలకులు విదేశీ బహుళ జాతి కంపెనీలకు రైతులు చేతులలో ఉన్న



సాగు భూములు, వ్యవసాయ ఉత్పత్తులను అప్పగించే ప్రయత్నం చేస్తున్నారని, దీనివలన భారతదేశంలో కూడా ఆహార సంక్షోభం తప్పదన్నారు. వ్యవసాయ రంగంలో కార్పొరేట్ శక్తుల చొరబాటుకు వ్యతిరేకంగా రైతులు సంఘటితంగా పోరాడాలని కోరారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానని వాగ్దానం చేసి ఎరువులు, పెట్రోలు, డీజిల్ ధరలు పెంచి వ్యవసాయం గిట్టుబాటు కాకుండా చేసి రైతుల రుణ భారాన్ని రెట్టింపు చేసిందని, 2013లో భారతదేశంలో రైతు కుటుంబం సగటు అప్పు 47 వేల రూపాయలు ఉంటే 2020 నాటికి 74 వేలకు పెరిగిందని, అప్పులు రెట్టింపు అయినవి తప్ప ఆదాయాలు పడిపోయాయని అన్నారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ఇన్సూరెన్స్ పథకం కార్పొరేట్ కంపెనీలు పైసలు దోచుకునేందుకు ఉపయోగపడుతుందని, 32వేల కోట్లు ఇన్సూరెన్స్ కంపెనీలు వసూలు చేసి రైతులకు పంట బీమా తిరిగి చెల్లించడం లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంతో సహా 28 రాష్ట్రాలలో విదేశీ పెట్టుబడులు వ్యవసాయ సేవా రంగంలో ప్రవేశిస్తున్నాయని, వ్యవసాయంలోని మిగులును విదేశీ కంపెనీలు తీసుకెళుతున్నాయని, అప్పులు రైతులకు మిగులుస్తున్నాయని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పంటల బీమా పథకం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియూ నాయకులు మడుపల్లి గోపాలరావు, బోనకల్ మండల కార్యదర్శి తుళ్లూరు రమేష్, అధ్యక్షులు కొమ్మినేని నాగేశ్వరరావు, గుడ్దూరి ఉమా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు వత్సవాయి జానకి రాములు, మాదిని రవి, రాచబంటి రాము, కొల్లి నారాయణ తదితరులు పాల్గొన్నారు.



గొర్రెముచ్చు ఆనందరావు మృతికి పోతినేని నివాళి

నవతెలంగాణ-వైరాటౌన్

వైరా మండలం వల్లాపురం గ్రామంలో సిపిఐ(ఎం) సానుభూతిపరులు, సిఐటియు సీనియర్ నాయకులు కామ్రేడ్ గొర్రెముచ్చు ఆనందరావు (55) గురువారం గుండెపోటుతో మరణించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మరణవార్త తెలిసిన వెంటనే సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబులు గొర్రెముచ్చు ఆనందరావు భౌతికకాయాన్ని సందర్శించి ఎర్రజెండా కప్పి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వీరితోపాటు సిపిఐ(ఎం) మండల కార్యదర్శి తోట నాగేశ్వరరావు, మండల కార్యదర్శివర్గ సభ్యులు బాజోజు రమణ, వల్లాపురం గ్రామం సర్పంచ్ గొర్రెముచ్చు శారమ్మ నివాళులు అర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గొర్రెముచ్చు యాకోబు, గొర్రెముచ్చు నవీన్, గొర్రెముచ్చు జైపాల్, గొర్రెముచ్చు కనకయ్య, గొర్రెముచ్చు జీవరత్నం, బుర్రి ఇస్సాక్ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల చిత్రాలతో క్యాలెండర్ తీయడం అభినందనీయం

నవతెలంగాణ- ఖమ్మం

మహనీయుల జీవిత చరితలు నేటి యువతకు తెలిసే విధంగా వారి చిత్రపటాలతో క్యాలెండర్ తీయడం అభినందనీయమని, మహనీయుల జీవిత చరిత్ర నేటి యువత తెలుసుకోవాలని మహిళా ప్రాంగణం జిల్లా అధికారి వేల్పుల విజేత, 58వ కార్పొరేటర్ దోరేపల్లి శ్వేత, రాష్ట్ర నాయకులు నున్నా నాగేశ్వరరావు, 49వ కార్పొరేటర్ దుద్దుకూరు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గురువారం ఖమ్మంలోని మంచికంటి ఫంక్షన్‌హాల్‌లో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మద్దాల ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన డివైఎఫ్ఐ 2023 క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజ సేవలో యువత ముందుండాలని, అట్లాంటి సేవలో డివైఎఫ్ఐ ముందుంటుందన్నారు. భారతదేశ ముందుకు పోవాలంటే యువత సక్రమమైన



మార్గంలో ఉండాలని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్ మాట్లాడుతూ ఉద్యమాల్లో ముందుంటున్న డివైఎఫ్ఐకి క్యాలెండర్ యాడ్స్ ఇచ్చి సహకరిస్తున్న వారందరికీ కూడా డివైఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున ధన్యావాదాలు తెలిపారు. మీరు ఇచ్చిన స్ఫూర్తితో మరిన్ని ఉద్యమాలు చేసి యువతను సక్రమమైన మార్గంలో పెట్టేందుకు మరిన్ని కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ప్రముఖ వైద్యులు అనుదీప్, దూదేకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి షేక్ బాషా, రైతు సంఘం జిల్లా నాయకులు బండి రమేష్, టైనీటాట్స్ స్కూల్ చైర్మన్ భాస్కర్, చక్రి స్కూల్ చైర్మన్ చక్రధర్, బివికే జనరల్ మేనేజర్ వై శ్రీనివాసరావు, కార్పొరేటర్ బుర్రి వెంకట్ కుమార్, కైట్స్ అకాడమీ చైర్మన్ తిరుపతి, చంద్రశేఖర్, తార హాస్పిటల్స్ పురుషోత్తమ రెడ్డి, స్వామి, స్వచ్ఛ టీవీ గోపాలకృష్ణ, షేక్ అఫ్జల్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శులు చింతల రమేష్, శీలం వీరబాబు, కనపర్తి గిరి, గుమ్మ ముత్తరావు, జిల్లా ఉపాధ్యక్షులు భూక్య ఉపేందర్ నాయక్, పఠాన్ రోషిని ఖాన్, సత్తెనపల్లి నరేష్, కూరపాటి శ్రీను, జిల్లా కమిటీ సభ్యులు సురేష్, పొన్నం మురళి, జక్కంపూడి కృష్ణ, భయ్యా బాలాజీ, శభాష్ రెడ్డి, సునీల్, రావులపాటి నాగరాజు, తరంగి పాపారావు, ఎర్ర సాయి, శ్రీను, రెహమాన్, షైక్ షరీఫ్, అల్లుడు దుర్గ, బింగి రమేష్, భాస్కర్, వర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులు నిజమైన ప్రజా సేవకులు

పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య

నవతెలంగాణ- ఖమ్మం



గ్రామీణ వైద్యులే నిజమైన ప్రజాసేవకులని, ఇంటిదగ్గర తక్షణ వైద్య సదుపాయం వారి వల్లే మనకు లభిస్తుందని పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య తెలిపారు. గురువారం ఖమ్మంలోని ఎస్సార్ కన్వర్షన్ హాల్లో తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం 9వ వార్షికోత్సవ సమావేశం సంఘం అధ్యక్షులు షేక్ హసన్ అధ్యక్షతన జరిగింది . ఈ సమావేశానికి వనజీవి రామయ్య, ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కార్యాలయ ఇన్చార్జి తుంబురు దయాకర్ రెడ్డి, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు అఫ్జల్ హాసన్ మాట్లాడుతూ నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ పేదరికం అనుభవిస్తున్న గ్రామీణ వైద్యులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. అనంతరం నూతన సంవత్సరం క్యాలెండర్లను ఆవిష్కరించారు . ఈ కార్యక్రమంలో తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం వ్యవస్థాపకులు షేక్. నజీరుద్దీన్, డాక్టర్లు భరత్ బాబు, ఎండి .అన్వర్, వై.ప్రసాదరావు, వీరేందర్ చెట్టి , నైమా సుల్తానా, ఓమిని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, క్యూర్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ వై. పాషా, అభయ హాస్పిటల్ సిఇఓ కరీమ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాలను కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు

నవతెలంగాణ-ఖమ్మం

ఖమ్మంలో బుధవారం జరిగిన బిఆర్ఎస్ సభలో ముఖ్యమంత్రి కెసిఆర్ జిల్లాకు ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేస్తామని ప్రకటించడాన్ని ఎస్ఎఫ్ఐ స్వాగతిస్తుందని, కానీ ఈ జిల్లా సుదీర్ఘ కల అయిన యూనివర్శిటీని ప్రకటించకపోవడం దుర్మార్గం అని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు అన్నారు. గురువారం ఖమ్మంలోని సుందరయ్య భవన్లో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో అయన మాట్లాడుతూ ఖమ్మం జిల్లాలో ఉన్నత విద్యను సుమారు 60 వేల మంది చదువుతున్నారని, వీరికి యూనివర్శిటీలో ఏ అవసరాలు ఉన్నా వరంగల్ కాకతీయ యూనివర్శిటికీ వందల కిలోమీటరు పాటు ప్రయాణం చేస్తూ వందల రూపాయలు వెచ్చించి వెళ్లి వస్తుందన్నారు. అశ్వారావుపేట, భద్రాచలం చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాలకూ చెందిన



విద్యార్థులు పరిస్థితి అత్యంత ఇబ్బంది కరంగా ఉందన్నారు. యూనివర్శిటీ జిల్లాలో ఏర్పాటు చేస్తే ఉన్నత విద్య మరింత మందికి అందుబాటులో ఉంటుందన్నారు. జిల్లా అధ్యక్షులు తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ ఈ జిల్లా విద్యాభివృద్ధికి యూనివర్శిటీ కీలకం అని యూనివర్శిటి కోసం అందరితో ఐక్యపోరాటాలు చేస్తామని చెప్పారు. ప్రకటించిన ఇంజనీరింగ్ కళాశాల ప్రక్రియ ప్రారంభించి అందుబాటులోకి తెవాలన్నారు. సమావేశంలో నగర కార్యదర్శి తరుణ్, నాయకులు సాయి, కొండలరావు, సాయి రాజేష్, హనుమంతరావు, వీరశేఖర్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసభ్యకర వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి గురించి అవమానకరంగా మాట్లాడిన వ్యక్తిపై ఖమ్మంరూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయింది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని గూడురుపాడు గ్రామానికి చెందిన వెంకట్రావ్ ఈనెల 18వ తేదీ రాత్రి ఎమ్మెల్యే ఫొటోతో ఉన్న క్యాలండర్‌ను చించివేసి,ఎమ్మెల్యేని దూషిస్తూ, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా అవమానకరంగా మాట్లాడారని బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ ఉదయ్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

వైరాకు ఆర్టీసీ ప్రజా రవాణా చైతన్య రథం

నవతెలంగాణ-వైరాటౌన్



ప్రజలకు ఆర్టీసి అందిస్తున్న విస్తత సేవల గురించి అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న టిఎస్ ఆర్టీసీ ప్రజా రవాణా చైతన్య రథం యాత్ర గురువారం వైరా పట్టణానికి చేరుకున్నది. ఈ సందర్భంగా మధిర డిపో మేనేజర్ ఎస్.దేవదానం ఆదేశానుసారం వైరా బస్టాండులో ఆర్టీసి కళాకారులు సాంస్కతిక కార్యక్రమాలు నిర్వహించారు. వీటితో పాటు ప్రజా రవాణా వ్యవస్థలో ఆర్టీసి ఎంతో కీలకంగా పనిచేస్తుందని ఆర్టీసీ కళా బందం ప్రజలకు తెలియజేసారు. ప్రైవేటు వాహనాలలో ప్రయాణం ప్రమాదకరం అని, ఆర్టీసి బస్సులలో ప్రయాణం సురక్షితం, శుభప్రధం అని సూచించారు. ఆర్టీసి అనేక రకాల రాయితీలను ప్రజలకు కల్పిస్తుందని వారు గుర్తు చేశారు. కార్యక్రమంలో వైరా బస్టాండ్ స్టేషన్ మేనేజర్ జి.ఆర్. రెడ్డి, సిబ్బంది, ఆర్టీసి సాంస్కతిక కళాకారులు పాల్గొన్నారు.

చెట్టు మీద పడి వ్యక్తి మృతి

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

చెట్టును నరుకుతుండగా ప్రమాదవశాత్తు అదే చెట్టు మీద నుండి పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని మద్దులపల్లిలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన భూక్య శంకర్(38) మద్దులపల్లిలో చెట్టును నరుకుతుండగా ప్రమాదవశాత్తు అదే చెట్టు మీదపడి శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

గుర్తుతెలియని మృతదేహానికి అంత్యక్రియలు

నవతెలంగాణ - బోనకల్

మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి వద్ద బిక్షాటన చేస్తూ గుర్తుతెలియని వ్యక్తి రెండు రోజుల క్రితం అపస్మారక స్థితిలో పడి ఉండగా అటుగా వెళుతున్న కొందరు 108 కి ఫోన్ చేయగా సదరు వ్యక్తిని మధిర ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి ప్రధమ చికిత్స అందిస్తుండగా 14 న తెల్లవారుజామున మృతి చెందాడు. మధిర ప్రభుత్వ వైద్యులు బోనకల్ పోలీస్‌స్టేషన్‌కి సమాచారం అందించారు. మూడు రోజులైనా ఎవరూ రాకపోవడంతో బోనకల్ ఎస్సై తేజావత్ కవిత ఆధ్వర్యంలో గురువారం మధిర రెస్క్యూ టీం నిస్సిహరిని, రామారావు, పగిడిపల్లి మోషే కలిసి ఎస్సై కవిత, కొందరు దాతల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

క్రీడాకారులు శిక్షణతో, క్రీడాస్ఫూర్తితో మెలగాలి

ఎస్‌బీఐ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వరప్రసాద్

నవతెలంగాణ- ఖమ్మం

క్రీడాకారులు శిక్షణతో, క్రీడాస్ఫూర్తితో మెలగాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఖమ్మం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ వరప్రసాద్ అన్నారు. గురువారం ఖమ్మంలోని న్యూవిరా పాఠశాలలో నాలుగు రోజుల పాటు జరిగే ఇంట్రామ్యూరల్ వార్షిక క్రీడా మహోత్సవాలు ప్రారంభించారు. అనేక క్రీడాంశాలలో పాల్గొని విద్యార్థులు తమ శక్తి సామర్థ్యాలను, ప్రతిభాపాటవాలను ప్రదర్శిస్తున్నారు. పాఠశాల చైర్మన్ ఐవి.రమణారావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన దేహంలోనే, ఆరోగ్యకరమైన మంచి ఆలోచనలుంటాయని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలనీ, ప్రయత్నాన్ని మానవద్దని, హితబోధ చేశారు. పాఠశాల డైరెక్టర్ డాక్టర్ పి. భూమేశ్వరావు మాట్లాడుతూ క్రీడలు ఐక్యతకు చిహ్నమని, విద్యార్థులు తమ శక్తికొలది గెలపటానికి ప్రయత్నించాలని, ఒక వేళ ఓడినా మనస్ఫూర్తిగా విజేతలకు అభినందనలు తెలిపి క్రీడాస్ఫూర్తిని చాటుకోవాలని అన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వి.భరత్ కుమార్, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బిఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతం పట్ల హర్షం

పార్టీ జిల్లా అధ్యక్షులు తాత మధుకు సన్మానం

నవతెలంగాణ- ఖమ్మం

నలుగురు ముఖ్యమంత్రులతో చరిత్రలో నిలిచిపోయే విధంగా ఖమ్మం గుమ్మాన బిఆర్ఎస్ బహిరంగ సభ విజయవంతం పట్ల యువజన విభాగం అధ్యక్షులు చింతనిప్పు కృష్ణ చైతన్య హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ దిశా నిర్దేశం ప్రకారం బహిరంగ సభ ఇన్చార్జ్ మంత్రి తన్నీరు హరీష్ రావు, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సూచనలు సలహాల మేరకు నియోజకవర్గ శాసనసభ్యులు, ఇన్చార్జిలను సమన్వయ పరుస్తూ, బహిరంగ సభ విజయవంతం చేసిన బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్‌ని యువజన విభాగం అధ్యక్షుడు చింతనిప్పు కృష్ణ చైతన్య జిల్లా పార్టీ కార్యాలయంలో శాలువాతో సన్మానించి, అభినందనలు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, పార్టీ జిల్లా నాయకులు ఆర్‌జెసి కృష్ణ, యువజన విభాగం ఖమ్మం నగర ఉపాధ్యక్షులు బలుసు మురళీకృష్ణ, నగర అధ్యక్షులు పగడాల నాగరాజు, కమర్తపు మురళి, బెల్లం వేణు పాల్గొన్నారు.

విద్యుద్ఘాతంతో పూరిల్లు దగ్ధం

నవతెలంగాణ- వేంసూరు

షార్ట్‌సర్క్యూట్తో పూరిల్లు దగ్ధమైన సంఘటన మండల పరిధిలోని అడసర్లపాడు గ్రామంలో గురువారం రాత్రి జరిగింది. బండి కనకారావు నివాసంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ మూలంగా మంటలు రావడంతో తాటి ఆకులకు అంటుకునే క్రమంలో స్థానికులు ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వటంతో హుటాహుటినా చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేసి సుమారు మూడు లక్షల విలువ కల వస్తువులను రక్షించారు. సుమారు 60 వేల వరకు నష్టం వాటిల్లుతుందని తెలిపారు. ఫైర్ సిబ్బంది డ్రైవర్ బాబురావు ఎస్ఎఫ్ఓఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎల్ఎఫ్‌జి కృష్ణ ప్రసాద్, ఎం.గోపిలను గ్రామస్తులు అభినందించారు

అమెరికాలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభం

నవతెలంగాణ- ఖమ్మం

అమెరికాలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ 300వ గ్లోబల్ షోరూంను ప్రారంభించామని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ఖమ్మం బ్రాంచ్ మార్కెటింగ్ జూనియర్ మేనేజర్ ఫయాజ్ తెలిపారు. వేగంగా కొనసాగుతున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ విస్తరణ కార్యకలాపాలు అమెరికాలోని డల్లాస్లో తమ గ్లోబల్ షోరూము ప్రారంభించారని చెప్పారు. 10 దేశాలలో 300 షోరూమ్‌లతో, బలమైన రిటైల్ నెట్వర్క్‌తో, ప్రపంచ వ్యాప్తంగా 6వ అతిపెద్ద జ్యువెలరీ రిటైలర్‌గా ప్రఖ్యాతిగాంచిన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ గ్లోబల్ షోరూమని తెలిపారు.

ఓసీలను సందర్శించిన సింగరేణి జీఎం

నవతెలంగాణ-సత్తుపల్లి

సత్తుపల్లి జేవీఆర్, కిష్టారం ఓసీలను సింగరేణి (ఈఅండ్ఎం) జీఎం గోపాలకృష్ణమూర్తి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మూర్తి అధికారులతో మాట్లాడుతూ ఆటో లూబ్రికేషన్ సిస్టం ద్వారా బొగ్గు రావాణా చేయాలని సూచించారు. కార్యక్రమంలో కిష్టారం ఓసీ పీవో నరసింహారావు, ఏజీఎం రఘురామిరెడ్డి, పీఈ లక్ష్మణమూర్తి, ఎస్‌వోఎం బంగారు శ్రీనివాస్, ఎస్ఈ వి.కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి ప్రదాతలకు కృతజ్ఞతలు : సర్పంచ్

నవతెలంగాణ-కల్లూరు



తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో శరవేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, సత్తుపల్లి నియోజకవర్గాన్ని తనదైన శైలిలో అకుంఠిత దీక్ష పట్టుదలతో, అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తున్న సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్యలకు కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ లక్కినేని నీరజ రఘు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆమె గ్రామపంచాయతీలో మాట్లాడుతూ మేజర్ పంచాయతీగా కల్లూరును అభివృద్ధి పదంలో నడిపించడానికి సత్తుపల్లి శాసనసభ్యులు సండ్రా వెంకట వీరయ్య కృషి చేశారని, వారి ఆశీస్సులతోనే మన పంచాయతీకి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ద్వారా 10 కోట్ల రూపాయలు మంజూరు చేయించారని వారన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ డాక్టర్ లక్కినేని రఘు, కార్యదర్శి కృష్ణారావు, వార్డు మెంబర్లు, మాజీ జెడ్పిటిసి మేకల కృష్ణ, టిఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

నవతెలంగాణ-తిరుమలాయపాలెం

తిప్పారెడ్డిగూడెం సబ్ స్టేషన్ పరిధిలోని తిప్పారెడ్డిగూడెం, రాకాసితండా గ్రామాలకు శుక్రవారం ఉదయం 09.45 గంటల నుండి సాయంత్రం 05:30గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని, సబ్ స్టేషన్‌లో మరమ్మత్తుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగనుందని విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ ఓ ప్రకటనలో తెలిపారు

రేపు విద్యుత్ సమస్యలపై ముఖాముఖి

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో విద్యుత్ వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై శనివారం ఖమ్మంలోని డీపీఆర్సీ భవన్ లో ముఖాముఖి నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర విద్యుత్తు నియంత్రణ మండలి చైర్మన్ టి. రంగారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10:30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని సూచించారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేదలకు ఆర్థికసాయం

నవతెలంగాణ-వైరా

వైరా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిరుపేద పండ్ల వ్యాపారి వీరమ్మకు 10 వేలు రూపాయల విలువగల తోపుడు బండిని, గుండె జబ్బుతో బాధ పడుతున్న నిరుపేద అర్చక బ్రాహ్మణుడు వాసుదేవర శాస్త్రికి దాతలు 12 వేల రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కాపా మురళీకృష్ణ, నంబూరి రామారావు, చింతనిప్పు వెంకటయ్య, నంబూరి మధు, లగడపాటి ప్రభాకర్, మిట్టపల్లి సత్యం బాబు, ఏపూరి రాజారావు . పెనుగొండ ఉపేంద్ర రావు చింతల పుడి వెంకటేశ్వర రావు, కొల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు పైన కేబుల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు లైన్ క్లియర్

సీఎం కేసీఆర్ హామీ మేరకు రూ.180 కోట్లు మంజూరు

దుర్గం చెరువు తరహాలో నిర్మించేందుకు అంచనాలు సిద్ధం

నిధుల విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఫలించిన మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కృషి


GOVERNMENT OF TELANGANA
ABSTRACT
TRANSPORT, ROADS & BUILDINGS (R.II) DEPARTMENT

నవతెలంగాణ - ఖమ్మం కార్పొరేషన్

ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా ఖమ్మం నగరం విస్తరించిన తరుణంలో ప్రజా రవాణా ఇబ్బందులు కలుగకుండా ఉండాలనే నగరంలో నయబజార్ వద్ద మున్నేరుపై బ్రిటిష్ కాలం నాటి వంతెనకు ప్రత్యామ్నాయంగా రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ కృషి మేరకు నూతన తీగల వంతెన నిర్మించేందుకు ప్రభుత్వం పరిపాలన ఉత్తర్వులు జారీ చేసింది. గత సంవత్సరాల ఆగస్టు నెలలో ఇక్కడ నూతన బ్రిడ్జి నిర్మించాలనే ఉద్దేశంతో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు. తరచూ ట్రాఫిక్ జామ్‌లు, రోడ్డు వెడల్పు తక్కువ ఉన్న కారణంగా ప్రమాదాలు, వర్షాకాలంలో వరద ఉధృతికి మున్నేరు బ్రిడ్జి ప్రమాదకరమా మారడం ఇలా ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ఘటనల దృష్ట్యా నూతన బ్రిడ్జి నిర్మించాలని మంత్రి పువ్వాడ ప్రతిపాదించారు. ఖమ్మంలో జరిగిన బహిరంగ సభకు విచ్చేసిన సీఎం కేసీఆర్ మంత్రి పువ్వాడ విజ్ఞప్తిని గుర్తు చేసుకుని, మున్నేరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. ప్రకటించిందే తడువుగా మంత్రి స్వయంగా దగ్గరుండి పరిపాలనా ఉత్తర్వులు మంజూరు చేయించారు. సుదీర్ఘ కాలంగా ప్రజల చిరకాల స్వప్నంగా ఉన్న మున్నెరుపై కేబుల్ బ్రిడ్జి నిర్మాణంలో లైన్ క్లియర్ కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మొత్తం బ్రిడ్జి 420 మీటర్ల పొడవు ఉండగా 300 మీటర్లు కేబుల్‌పై నిలువగా 120 మీటర్లు ఆర్ సీసీ పై ఉండనుంది. నిర్మాణం పూర్తి అయితే ప్రజా రవాణాకు ఎలాంటి ఇబ్బందులు ఉండవని, రాకపోకలు సాఫీగా సాగనున్నాయి. హైదరాబాద్ దుర్గం చెరువుపై నిర్మించిన కేబుల్ బ్రిడ్జి తరహాలో ఖమ్మం మున్నేరుపై రూ.180 కోట్లతో కేబుల్ బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడం పట్ల రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు వద్దిరాజ రవిచంద్ర, మంత్రి పువ్వాడ ఇరువురు కలిసి సీఎం కేసీఆర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి నగర ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు,

దేశ హితం కోసమే 'బీఆర్ఎస్' : ఎంఎల్ఏ సండ్ర

నవతెలంగాణ- సత్తుపల్లి



దేశ హితం కోసమే ముఖ్యమంత్రి భారత రాష్ట్ర సమితిని ఏర్పాటు చేయడం జరిగిందని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య స్పష్టం చేశారు. గురువారం కౌన్సిలర్ వీరపనేని రాధికాబాబీ గృహంలో సండ్ర విలేకర్లతో మాట్లాడారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా బీఆర్ఎస్‌ను స్థాపించడం జరిగింది తప్ప స్వప్రయోజనాల కోసం కాదని సండ్ర అన్నారు. అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడిగా దేశవ్యాప్తంగా ముందుకెళ్తున్న నాయకుడు కేసీఆర్ అన్నారు. ఖమ్మం సభ విజయవంతంపై కేసీఆర్ ప్రత్యేకంగా ఫోన్‌చేసి అభినందించడం జరిగిందన్నారు. జిల్లాపై కూడా సమగ్ర ప్రణాళికను ఖరారు చేస్తున్న ముఖ్యమంత్రికి ఈ సందర్భంగా సండ్ర ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, డీసీసీబీ డైరెక్టరు చల్లగుండ్ల కృష్ణయ్య, నాయకులు ఎస్కే రఫీ, వీరపనేని బాబీ, అమరవరపు కృష్ణారావు, గఫార్, రవీంద్రరెడ్డి, కౌన్సిలర్లు అద్దంకి అనిల్‌కుమార్, దేవరపల్లి ప్రవీణ్‌కుమార్, దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభ విజయవంతంపై కృతజ్ఞతలు

ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాత మధుసూదన్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతూ బీఆర్ఎస్ సభకు పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజానీకానికి ఎమ్మెల్సీ, పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ జిల్లా కార్యాలయం లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభ నిర్వహణ బాధ్యతలు అడుగడుగున పర్యవేక్షిస్తూ అన్నీ తానై జిల్లా నాయకులను ముందుకు నడిపించిన రాష్ట్ర మంత్రులు తన్నీరు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్, రాష్ట్ర రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపీ నామ నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యులు పార్థసారథి రెడ్డిష, వద్దిరాజు రవిచంద్రకు జిల్లా పార్టీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు చెప్పారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మద్దతు తెలుపుతూ స్వచ్ఛందంగా తరలివచ్చి బాసటగా నిలిచిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజానీకానికి కృతజ్ఞతలు తెలిపారు. తమ నియోజకవర్గ ప్రజలను సమీకరించిన ఎమ్మెల్యేలు రేగా కాంతారావు, సండ్ర వెంకట వీరయ్య, వనమా వెంకటేశ్వర్లు, కందాల ఉపేందర్ రెడ్డి, మెచ్చ నాగేశ్వరరావు, రాములు నాయక్, హరిప్రియ నాయక్, శ్రీ జడ్పీ చైర్మన్ కమల్ రాజుకు పేరుపేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సభను విజయవంతం చేసేందుకు దోహదపడ్డ రాష్ట్రస్థాయి చైర్మన్ లకు, జడ్పీటీసీలకు, ఎంపీటీసీలకు కార్పొరేషన్ చైర్మన్ లకు, సర్పంచులకు, కార్పొరేటర్లకు, వార్డు మెంబర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. సభా ప్రాంగణంలో వాలంటరీగా సేవలందించిన యువజన విభాగం నాయకులు, మైనార్టీ నాయకులు, వివిధ పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు జిల్లా పార్టీ తరపున కృతజ్ఞతలు తెలిపారు. మీడియా సమావేశంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర మేయర్ నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ గారి వ్యక్తిగత సహాయకులు రవి కిరణ్ , మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ లక్ష్మీ ప్రసన్న, రూరల్ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణు, పార్టీ సీనియర్ నాయకులు ఆర్ జె సి కృష్ణ, కార్పొరేటర్ కమర్తపు మురళి, తెలంగాణ ఉద్యమకారులు ఉప్పల వెంకటరమణ, శేషు, గ్రంథాలయ మాజీ చైర్మన్ ఖమర్ పాల్గొన్నారు.

సమీకృత కార్యాలయం నుంచే విధులు

జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో శాఖలకు కేటాయించిన కార్యాలయాల్లో విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో శాఖల కార్యాలయాలను గురువారం కలెక్టర్ సందర్శించారు. అధికారులు, సిబ్బంది విధులను పరిశీలించారు. పూర్తిస్థాయిలో సమీకృత జిల్లా కార్యాలయ భవన సముదాయంలో విధులు నిర్వర్తించేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విధులకు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించేలా పర్యవేక్షించాలన్నారు. జిల్లా ఖజానా కార్యాయంలో స్ట్రాంగ్ రూమ్ ను పరిశీలించారు. ఖజానా శాఖ అధికారులకు సూచనలు చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ఎన్. మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష, జిల్లా ఖజానా శాఖ అధికారి సత్యనారాయణ, కలెక్టరేట్ పరిపాలన అధికారి మదన్ గోపాల్, సహాయ కోశాధికారి విజయకుమార్, రవీందర్ తదితరులు ఉన్నారు.

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యం : కలెక్టర్

నవ తెలంగాణ-చింతకాని

సంపూర్ణ అంధత్వ నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం కలెక్టర్ చింతకాని మండలం వందనం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను కలెక్టర్ తనిఖీ చేశారు. శిబిరంలో ఏర్పాట్లను పరిశీలించారు. నిర్వహిస్తున్న రిజిష్టర్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు సక్రమంగా నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రేషన్ ప్రోపర్‌గా లేదని వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. మాలతీపై అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 55 బృందాలను ఏర్పాటుచేసి, 100 రోజుల్లో ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు చేపట్టేలా కార్యాచరణ చేసినట్లు తెలిపారు. కంటి వెలుగు అనగానే కంటి చూపు పరీక్ష అనే తేలిక భావం ఉంటుందని, కానీ ప్రతి మనిషికి కంటి చూపు ఎంత అవసరం అనే విషయాన్ని గుర్తించాలని ఆయన తెలిపారు. నివారించదగ్గ అంధత్వాన్ని మనం పరీక్షలు చేసుకొని వెంటనే నివారించుకోవాలని ఆయన అన్నారు. శిబిర నిర్వహణ విషయమై ముందస్తుగా విస్తృత ప్రచారం చేయాలని, ప్రజల సమీకరణ చర్యలు పకడ్బందీగా చేయాలని అన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు, అధికారులు సమిష్టిగా పని చేసి ప్రజలను భాగస్వామ్యం చేయాలని ఆయన తెలిపారు. వందనం గ్రామ సర్పంచ్ కొరిపల్లి సునీత ,పంచాయతీ కార్యదర్శి మహేష్‌లను కంటి వెలుగు ఏర్పాట్లు బాగా చేసారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.మాలతీ, మండల వైద్యాధికారి డా. వెంకటేశ్వర్లు, వందనం సర్పంచ్ సునీత, పంచాయతీ కార్యదర్శులు మహేష్, కొండపల్లి అనిల్ కుమార్,చారి, రాధాకృష్ణ , ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగొండ : రాష్ట్ర ప్రభుత్వం రెండో దశ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ముదిగొండ, అమ్మపేట పంచాయతీలలో జడ్పిటిసి పసుపులేటి దుర్గ, ముదిగొండ సర్పంచ్ ముందరపు లక్ష్మివెంకన్న గురువారం లాంఛనీయంగా ప్రారంభించారు. కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణ, వైస్ ఎంపీపీ మంకెన దామోదర్, ఎంపీడీవో డి.శ్రీనివాసరావు, ఎంపీఓ పి.సూర్యనారాయణ, ముదిగొండ, వల్లభి పిహెచ్సి వైద్యాధికారులు ఏ.అరుణాదేవి, కే.ధర్మేందర్, సిహెచ్ఓ గుండాల దుంగమల్లేశ్వరి, అమ్మపేట గ్రామసర్పంచ్ వడ్డెల్లి భూబేశ్వరి వీరరాఘవులు, పంచాయతీ కార్యదర్శులు పి.సంపత్, పద్మజ, వైద్య, ఆశ సిబ్బంది, అంగన్వాడీలు పాల్గొన్నారు.

వైరా : ఖమ్మంలో కంటి వెలుగు రెండవ విడత ప్రోగ్రాంను ముఖ్యమంత్రి కెసిఆర్ ఘనంగా ప్రారంభించగా గురువారం వైరా నియోజకవర్గ కేంద్రం వైరాలో ఎమ్మెల్యే లావుడ్యా రాములు నాయక్ ఎస్టీ కాలనీలోని రైతు వేదికలో ప్రారంభించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, జడ్‌పిటిసి నంబూరి కనకదుర్గ, జడ్‌పికో ఆప్షన్ సభ్యులు షేక్ లాల్ అహమ్మద్, మునిసిపల్ కౌన్సిలర్స్ వైరా మండల విద్యాధికారి ఉదయ్ లక్ష్మి, మునిసిపల్ కమిషనర్ అనిత, నెఫ్రాల్జి మాధురి సిహెచ్‌ఓ ధనలక్ష్మి, వైద్య సిబ్బంది బిఆర్ఎస్ వైరా మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు, డార్న శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తాటిపూడిలో జాయింట్ కలెక్టర్ స్నేహ లత మొగిలి కంటి వెలుగు ప్రాజెక్ట్ అధికారి కోటి రత్నం, ఎంపిడిఓ రమాదేవి, నెఫ్రాల్జి యు శ్యామ్ బాబు, సర్పంచ్ భట్టా భద్రయ్య, ఉపసర్పంచ్ సత్యానందం, విజయ లక్ష్మి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బోనకల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కంకణాల సౌభాగ్యం, జడ్పిటిసి మోదుగు సుధీర్‌బాబు, ఎంపీడీవో బడేపూడి వేణుమాధవ్ కోరారు. రామాపురం, గార్లపాడు గ్రామాలలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ, జడ్పిటిసి కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు తొండపు వేణు, దారెల్లి నరసమ్మ ఎంపీటీసీ ముక్కపాటి అప్పారావు పంచాయతీ కార్యదర్శులు కళ్యాణ సౌమ్య, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సత్తుపల్లి : దేశంలోనే కాదు, ప్రపంచంలోనే అతిపెద్ద సంక్షేమ పథకం కంటి వెలుగని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. గురువారం సత్తుపల్లిలోని అంబేద్కర్‌నగర్ కమ్యూనిటీ హాలులో ఎమ్మెల్యే సండ్ర కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా దృష్టి లోపంతో బాధపడే వారు కంటి వెలుగు శిబిరాల వద్ద కళ్లను స్క్రీనింగ్ చేయించుకొని ఆయా కళ్లకు సరిపడా కళ్లజోళ్లను ఉచితంగా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో శిక్షణ కలెక్టర్ రాధికా గుప్త, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మెన్ కొత్తూరు ఉమామహేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మెన్ కూసంపూడి మహేశ్, కమిషనర్ కోడూరు సుజాత, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుండ్ల కృష్ణయ్య, కౌన్సిలర్లు వీరపనేని రాధికా బాబీ, దూదిపాల రాంబాబు, మేకల భవాని నరసింహా రావు, పట్టణ బీఆర్ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్కే రఫీ, మల్లూరు అంకమరాజు వీరపనేని బాబీ పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్ : యం.వెంకటాయపాలెం గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ బెల్లం ఉమ, జడ్పీటీసీ యండపల్లి వరప్రసాద్ గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సంధ్యారాణి, ఎంపీటీసీ నంద్ర ప్రసాద్, మండల వైద్యాధికారి శ్రీదేవి, ఉపసర్పంచ్ ఉపేందర్, గ్రామస్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎర్రుపాలెం : రెండో విడత కంటి వెలుగు ప్రారంభోత్స వంలో భాగంగా ఎర్రుపాలెం మండల పరిధిలోని గోసవీడు, కండ్రిక గ్రామాలలో ఎంపీపీ దేవరకొండ శిరీష, జడ్పిటిసి శీలం కవిత, ఖమ్మం డిసిసిబి డైరెక్టర్ ఐలూరు వెంకటేశ్వర రెడ్డి, తాసిల్దార్ తిరుమల చారి, మండల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. మొత్తం 357 మందిని పరీక్షించగా 89 మందికి ఉచితంగా కళ్ళ అద్దాలను పంపిణీ చేసినట్లు తెలిపారు. 25 మందిని కంటి ఆపరేషన్ కొరకు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి సిఫార్సు చేసినట్లు వైద్యాధికారులు సురేష్, వీరబాబు, ప్రదీప్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి వేణు మనోహర్, ములుగుమాడు సొసైటీ అధ్యక్షుడు శెట్టిపల్లి మదన్మోహన్ రెడ్డి, సర్పంచులు కొత్తపల్లి విద్యాసాగర్, నాగమణి, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కొణిజర్ల : రెండోవ విడత కంటివెలుగు ఏర్పాటు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని ప్రాథమిక ప్రభుత్వ ఆరోగ్య ఆస్పత్రితోపాటు పెద్దగోపతి, తనికెళ్ళ గ్రామాల్లో ఉన్న ఉపకేంద్రాలలో గురువారం ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని మండల పరిషత్ అధ్యక్షులు గోసు మదు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాసరావు, స్థానిక సర్పంచులు చల్లా మోహన్ రావు, సూరంపల్లి రామారావు, స్థానిక ఎంపీటీసీ సభ్యులు గుండ్ల కోటేశ్వరరావు,కొనకంచి స్వర్ణలత, గోపవరం సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరి రమేష్, సుడా డైరెక్టర్ బండారుకష్ణ, స్పెషల్ ఆఫీసర్ పరంధామ రెడ్డి,ఎంపీడీవో రమాదేవి, ఈవోఆర్డి ప్రభాకర్ రెడ్డి,డాక్టర్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి : దేశమంతా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వైపు చూస్తుందని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. గురువారం కారేపల్లి మండలం అప్పాయిగూడెం లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.కంటి పరీక్షలు నిర్వహించిన వారికి ఎమ్మెల్యే కళ్లజోళ్లను పంపిణి చేశారు. ఈసందర్భంగా సర్పంచ్ అజ్మీర అరుణ అధ్యక్షతన జరిగన సభలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ మాలోత్ శకుంతల, వైస్ఎంపీపీ రావూరి శ్రీనివాసరావు, టీఆర్ఎస్ మండల అధ్యక్షప్రధానకార్యదర్శులు పెద్దబోయిన ఉమాశంకర్, ఇస్లావత్ బన్సీలాల్, మాజీ ప్రధాన కార్యదర్శి అజ్మీర వీరన్న, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీవో రాజారావు, వైద్యాధికారులు సురేష్, రంజిత్, సంత ఆలయం చైర్మన్ మల్లెల నాగేశ్వరరావు, దిశ కమిటీ సభ్యులు బానోత్ కుమార్, సొసైటీ డైరక్టర్లు అడ్డగోడ ఐలయ్య, డేగల ఉపేందర్, వాంకుడోత్ నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం కార్పొరేషన్ : తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమాన్ని గురువారం ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని స్థానిక 26వ డివిజన్ లో గాంధీ పార్కు నందు కంటి వెలుగు కార్యక్రమాన్ని నగర మేయర్ పునుకోల్లు నీరజ, మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి కలిసి రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహార అండ్ ముక్తార్, అడిషనల్ డి ఎం హెచ్వో రాంబాబు, డిఈలు స్వరూప రాణి, నవ్య జ్యోతి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు,

వేంసూరు : తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన కంటి వెలుగు పథకాన్ని ప్రజలు ఉపయోగించుకుని వెలుగులు నింపాలని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు ఎంపీడీవో ఎన్ వీరేశం అన్నారు గురువారం మండల కేంద్రంలోని స్థానిక పంచాయతీ కార్యాలయం భీమవరం రాయుడుపాలెం గ్రామాలలో కంటి వెలుగు శిబిరాలను ప్రారంభించారు కార్యక్రమంలో స్థానిక సర్పంచులు ఎండి ఫైజుద్దీన్ మౌనిక రాంబాబు వెంకటేశ్వరరావు కార్యదర్శులు మమత వెంకటకష్ణ సి హెచ్ ఓ వెంకటనారాయణ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తల్లాడ : అందరి కళ్ళల్లో వెలుగులు నింపడమే కంటి వెలుగు కార్యక్రమ లక్ష్యం అని సత్తుపల్లి ఎమ్మెల్యే అన్నారు, తల్లాడ మండలం పాత పెనంపాక రైతు వేదికలో సర్పంచ్ ఆధ్వర్యంలో గురువారం కంటి వెలుగు కార్యక్రమాన్ని సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, జడ్పిటిసి డి ప్రమీల, బి.ఆర్.ఎస్ మండల అధ్యక్షులు మోహన్ రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షులు డి వెంకట్ లాల్ , ఎంపీడీవో బి రవీందర్ రెడ్డి, పీహెచ్ వైద్యులు రత్న మనోహర్ కంటి వైద్య శిబిరం డాక్టర్ రితుజ హెల్త్ సూపర్వైజర్ పెద్ద పుల్లయ్, దగ్గుల శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి : మండలం అగ్రహారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం 2వ విడుత కంటి వెలుగు కార్యక్రమాన్ని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి బానోత్ శ్రీనివాస్ నాయక్, డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపిడిఓ కరుణాకర్ రెడ్డి, కూసుమంచి, అగ్రహారం, పోచారం,గ్రామ సర్పంచ్లు చెన్నా మోహన్, శశికళ, ఆంజనేయులు, ఆడిషన్ డైరెక్టర్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్ రవీంద్రనాయక్, పాల్గొన్నారు.

కల్లూరు : రాష్ట్ర ప్రభుత్వంఅందరికీ కంటి పరీక్షలు నిర్వహించి కళ్ళను కాపాడాలని లక్ష్యంతో కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసిందని ఎంపీపీ బీరవల్లి రఘు, జెడ్పిటిసి కట్ట అజయ్ కుమార్ అన్నారు. కల్లూరు మేజర్ పంచాయతీలో ఏర్పాటు చేసిన కంటివైద్య శిబిరాన్ని వారు ప్రారంభించారు. పేరువంచ గ్రామంలో ఆర్డిఓ సిహెచ్ సూర్యనారాయణ, గ్రామ సర్పంచ్ అంకిరెడ్డి. అనూష రెడ్డి ప్రారంభించారు. చెన్నూరు గ్రామంలో గ్రామ సర్పంచ్ పాలెపు లక్ష్మీకాంతమ్మ పాలె పు.రామారావు, ప్రారంభించారు. కార్యక్రమంలో రైతు సమితి మండల కన్వీనర్ లక్కినేని రఘు, జడ్పీ కోఆప్షన్ సభ్యులు ఎండి ఇస్మాయిల్, తాసిల్దార్ బాబ్జి ప్రసాద్, ఎండిఓ రవికుమార్, వైద్యులు నవ్య కాంత్,లావణ్య, కొండూరు కిరణ్ కుమార్, మాదిరాజు లక్ష్మణ్‌రావు, ఈవో కృష్ణారావు, గ్రామాల పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది పాల్గొన్నారు.

మధిర : తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగు రెండో విడత కార్యక్రమంలో భాగంగా మధిర మండలం దేందుకురు, మాటూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత,మధిర శాసనసభ్యులు భట్టి విక్రమార్క మల్లు గురువారం పరిశీలించారు. అక్కడ జరుగుతున్న కార్యక్రమాలు వైద్య సదుపాయాలు అందుతున్న తీరును డాక్టర్లను, రోగులను ఆయన అడిగి తెలుసుకున్నారు.

దేశవ్యాప్తంగా విస్తరణ దిశగా బీఆర్ఎస్

సీఎం వరాలపై నగర ప్రజాప్రతినిధుల హర్షం

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



బీఆర్ఎస్ ఆవిర్భావ సభ విజయవంతం కావడంపై ఆ పార్టీ నగర ప్రజాప్రతినిధులు హర్షం వెలిబుచ్చారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివద్ధిని భారతదేశ వ్యాప్తంగా విస్తరించే దిశగా భారత రాష్ట్ర సమితి(బీఆర్ఎస్) అడుగులు వేస్తుందని పేర్కొన్నారు. నగరాన్ని మరింతగా అభివద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు నిధులు కేటాయించడంపై కృతజ్ఞతలు తెలిపారు. వీడీవోస్ కాలనీలోని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, జిల్లా నాయకులు ఆర్జేసీ కష్ణా, ఏఎంసీ చైర్మన్ లక్ష్మీ ప్రసన్న మాట్లాడారు. ఖమ్మంలో నిర్వహించిన బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, జాతీయ నేతలు, రైతు ప్రతినిధులు హాజరుకావడం ఖమ్మం చరిత్రలో మరిచిపోలేనిదని, నేడు దేశ వ్యాప్తంగా ఖమ్మంపై చర్చ జరుగుతుందన్నారు. ఇది దేశ స్థితిగతులను మార్చిన సభ అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నేతత్వంలో దేశ వ్యాప్త సంక్షేమం అందుతుందని, రానున్న రోజుల్లో ఢిల్లీ పీఠంపై గులాబీ జెండా ఎగురుతుందని ధీమా వ్యక్తం చేశారు. మంత్రులు పువ్వాడ అజయ్ కుమార్, హరీష్‌రావు నేతృత్వంలో సభ విజయవంతం అయిందని, ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ఇదే స్ఫూర్తితో పార్టీ పిలుపు మేరకు ఖమ్మంలో ఏ సభలు పెట్టినా మంత్రి పువ్వాడ నాయకత్వంలో విజయవంతం చేస్తామని స్పష్టం చేశారు. దేశంలో రైతు సర్కారే లక్ష్యంగా బీఆర్ఎస్ పనిచేస్తుందని అన్నారు. బిజెపి నిరంకుశ పాలనను ఎదుర్కోవడం ఒక భారత రాష్ట్ర సమితి, సీఎం కేసీఆర్ తో మాత్రమే సాధ్యమన్నారు. జిల్లాలోని 589 గ్రామాలకు ఒక్కో గ్రామానికి రూ.10 లక్షలు, ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌కు రూ.50 కోట్లు, మున్సిపాలిటీలకు రూ.30 కోట్లు మంజూరు చేయడం పట్ల ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

తీగల వంతెన మంజూరుపై కేసీఆర్ కు క్షీరాభిషేకం

ఖమ్మం నగరాభివృద్ధిలో భాగంగా మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విజ్ఞప్తి మేరకు మున్నేరుపై తీగల వంతెన నిర్మాణం కోసం రూ. 180 కోట్లు మంజూరు చేస్తూ పరిపాలన ఉత్తర్వులు జారీ చేయడం పట్ల బీఆర్ఎస్ నగర కమిటీ అధ్వర్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాపర్తి శరత్, జ్యోతిరెడ్డి అయ్యపరెడ్డి, నాయకులు తోట రామారావు, పొన్నం వెంకటేశ్వర్లు, శంషుద్దీన్, ఆశ్రీఫ్, కిషోర్ బాబు, పాల్వంచ కృష్ణ, ఇస్సాక్, షకీన, భాస్కర్ రావు, శోభారాణి, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగుపై దృష్టి

- **అధికారులకు కలెక్టర్ వి.పి. గౌతమ్ ఆదేశాలు**
- **సమీకృత భవన ప్రారంభ విజయవంతంపై అభినందనలు**

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి



కంటి వెలుగును విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో అధికారులతో గురువారం కలెక్టర్ సమీక్షించారు. ప్రత్యేక అధికారులు కంటి వెలుగు కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. నమోదు నుండి పరీక్ష పూర్తయ్యే వరకు క్యూ, వేచివుండు ఏర్పాట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మెప్మా స్వయం సహాయక బందాలు ప్రజల సమీకరణ విషయంలో ఉదయం, మధ్యాహ్నం పూటలుగా కార్యాచరణ చేయాలన్నారు. జిల్లాలో గురువారం 55 శిబిరాలు నిర్వహించి 5,615 మందికి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఒక్కో శిబిరంలో రోజుకు కనీసం 150 మందికి పరీక్షలు చేసేలా జన సమీకరణ చేయాలన్నారు. కంటి వెలుగుపై ఆడియో సందేశంతో విస్తత ప్రచారం చేయాలన్నారు. శిబిరాల్లో రోజువారి కళ్ళద్దాల పంపిణీని తెలియపర్చి, వారికి కావాల్సిన ఇండెంట్ ను ముందస్తుగా సమర్పించాలన్నారు.

ప్రారంభోత్సవం విజయవంతంపై అభినందనలు

సమీకత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ప్రారంభోత్సవం విజయవంతానికి కషి చెసిన అధికారులను కలెక్టర్ అభినందించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి అన్ని శాఖలు ఒకే గొడుగు కింద పనిచేస్తున్నట్లు చెప్పారు. ఒకరికొకరు సహకరిస్తూ బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు. ఇంకనూ తరలింపు చేపట్టని కార్యాలయాలు వెంటనే ప్రక్రియ పూర్తి చేయాలని, నేటి నుండి కార్యాలయాలు క్రొత్త ప్రాంగణంలో నిర్వహించాలని ఆదేశించారు. సమయపాలన పాటించాలని, వంద శాతం సిబ్బంది హాజరును జిల్లా అధికారులు పర్యవేక్షణ చేయాలని అన్నారు. కాలపరిమితి దాటిన ఫైళ్లు, ఫర్నిచర్ ఖండం చేయాలని ఆయన తెలిపారు. కేటాయించిన స్థలంలోనే వాహనాల పార్కింగ్ చేయాలని అన్నారు. సముదాయంలో ఏర్పాటు చేసిన క్రేచే ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సముదాయంలో అన్ని రకాల వసతులు కల్పించినట్లు తెలిపారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, డిఆర్వో ఎన్. శిరీష, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యంలో ప్లాస్టిక్ కల్తీ

- **బియ్యం తినవద్దని మైక్ ప్రచారం చేయించిన సర్పంచ్**

నవతెలంగాణ-వైరా

మండలంలోని చౌక దుకాణాలకు ప్లాస్టిక్ బియ్యం కల్తీ అయిన బియ్యం వచ్చాయని గృహిణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితం వైరాలోని 6,7 వార్డులకు సంబంధించిన చౌక దుకాణానికి ప్లాస్టిక్ బియ్యం వచ్చినట్లు కొంత మంది తెలిపారు. ఇటువంటి వదంతులు సహజమేనని తేలికగా కొట్టి పారేశారు. కానీ విప్పల మడక చౌక దుకాణంలో పేద కుటుంబ మహిళలు బియ్యంపై అనుమానం వ్యక్తం చేయటమే గాక బియ్యం నీళ్లలో పోస్తే ఎంత సేపటికీ కొన్ని బియ్యం అడుగుకు చేరలేదు. కొంచెం రంగు తక్కువగా ఉన్న బియ్యాన్ని వేరిచేసి తిని చూడగా బబుల్గం నమిలితే సాగినట్లు సాగటంతో అనుమానం వచ్చి సర్పంచ్ తుమ్మల జాన్ పాపయ్య ఇంటికి తీసుకెళ్లారు. ఆయన కొన్ని బియ్యం తిని చూడగా మామూలు బియ్యంలా కాక సాగుతున్నట్లు నిర్ధారించుకుని గ్రామంలోని డీలరుకు ఫోన్ చేసాడు. అంతే గాక కొన్ని బియ్యాన్ని తీసుకుని వైరా తాసీల్దార్ కార్యాలయానికి వచ్చి తాసీల్దార్ ఎస్ అరుణకు తెలిపారు. తాసీల్దార్ వెంటనే సంబంధిత ఎంఎల్ఎస్ పాయింట్ డిటికి ఫోన్ చేయగా పోషక విలువలు ఉన్న బియ్యం అంతే ఉంటాయని చెప్పినట్లు తాసీల్దార్ సర్పంచ్‌కు తెలిపారు. ఆ సమయంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు సర్పంచ్ వద్ద ఉన్న శాంపిల్ బియ్యాన్ని తీసుకుని రేపు వీటి విషయమై పరిశీలిస్తామని చెప్పినట్లు జాన్ పాపయ్య నవతెలంగాణకు తెలిపారు. ఒకడుగు ముందుకేసి ఆ బియ్యాన్ని ఎవరూ వండుకుని తినవద్దనీ గ్రామంలో మైక్ ప్రచారం చేయించాడు. అధికారులు కల్తీ ప్లాస్టిక్ బియ్యం పై విచారణ జరపాలని మహిళలు డిమాండ్ చేస్తున్నారు.

బెంగళూరులో పిండిప్రోలు వాసి మృతి

నవతెలంగాణ-తిరుమలాయపాలెం



బెంగళూరులో జరిగిన రోడ్డు ప్రమాదంలో పిండిప్రోలు వాసి మృతి చెందిన సంఘటన గురువారం ఉదయం జరిగింది. పిండిప్రోలు గ్రామానికి చెందిన ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎమ్మెల్సీ తాత మధుసూదన్ సోదరుడైన తాత విశ్వేశ్వరరావు, నాగమణి దంపతుల ఏకైక కుమారుడైన తాత నిఖిల్ (27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గురువారం ఉదయం తన నివాసం నుండి విధులకు కారులో బయలుదేరి వెళుతుండగా మార్గమధ్యంలో టిప్పర్ అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో నిఖిల్ అక్కడికక్కడే మృతిచెందాడు.

ముప్పవరపు ఫౌండేషన్ నుంచి రెండు లక్షల ఆర్థికసాయం

నవతెలంగాణ - ఎర్రుపాలెం

గత కొన్ని నెలలు నుండి కిడ్నీ సమస్యతో బాధపడుతున్న ఎర్రుపాలెం మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కూరపాటి నవకాంత్ కిడ్నీ మార్పిడికి ఆర్థిక సహాయం కొరకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి మేరకు ముప్పవరపు ఫౌండేషన్ నుంచి దాత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు కుమారుడు హర్ష వర్ధన్ రెండు లక్షల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు కుమారుడికి, ముప్పవరపు ఫౌండేషన్‌కి రుణపడి ఉంటామని కూరపాటి నవకాంత్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

టాలెంట్ టెస్ట్ పోటీలో మడుపల్లి విద్యార్థిని ప్రతిభ

నవ తెలంగాణ- మధిర

తెలంగాణ సోషల్ స్టడీస్ ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల పదవ తరగతి విద్యార్థులకు జరిగిన సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ నందు మండల స్థాయిలో మరియు జిల్లాస్థాయిలో అగ్రస్థానంలో నిలచి గురువారం రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీలో పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మడుపల్లి విద్యార్థిని కూరపాటి వైష్ణవి 85 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం పొందింది. వైష్ణవిని ప్రధానోపాధ్యాయులు కోలా పద్మావతి అభినందించారు. ఈ అభినందన కార్యక్రమంలో ఉపాధ్యాయులు తోట నరసింహారావు, వంకాయలపాటి వెంకటేశ్వరరావు, బూసా కోటేశ్వర రావు, కోనా బాబురావు, పైడిపల్లి కిషోర్, శీలం రామిరెడ్డి, యెహోషువ, తోట జ్యోతిర్మయి, రాణి, చైతన్య, చిట్టిబాబు మరియు పాఠశాల సిబ్బంది గౌస్, ప్రకాశరావు గ్రామ పెద్దలు ఉన్నారు.

రామున్ని దర్శించుకున్న నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్

నవతెలంగాణ-భద్రాచలం

నేషనల్ హ్యూమన్ రైట్స్ కమిషన్ న్యూఢిల్లీ మదన గోపాల్ గురువారం భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారి దర్శనానికి వచ్చిన ఆయనకు దేవస్థానం అర్చకులు శ్రీనివాస్ ఘనంగా స్వాగతం పలికారు. ముందుగా అర్చక స్వాములు బలపీఠం వద్ద పూజలు చేసిన అనంతరం స్వామివారి గర్భగుడిలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ తాయారు అమ్మవారిని, ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అర్చక స్వాములు స్వామివారి పట్టు వస్త్రాలు, తీర్థ ప్రసాదాలు అందించి స్వామి వారి విశిష్టత తెలిపి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం ఐటీడీఏలోని హౌసింగ్ గెస్ట్ హౌస్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్, ప్రాజెక్టు అధికారి గౌతమ్ పొట్రు ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి జిల్లా, ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయనకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చీఫ్ కన్జర్వేటర్ ఫారెస్ట్ ఫారెస్ట్ బీమా నాయక్, డీఎఫ్ఓ రంజిత్ నాయక్, ఏటిడిఓ నర్సింగరావు, ఆర్ఐ నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



యూసుఫ్ కప్ విజేత బూర్గంపాడు జట్టు

నవతెలంగాణ-బూర్గంపాడు

మండల కేంద్రంలో జరుగుతున్న యూసుఫ్ మెమోరియల్ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ గురువారం హోరాహోరీగా సాగింది. ఫైనల్లో బూర్గంపాడు, పాల్వంచ జట్లు తలపడగా మొదట బ్యాటింగ్ చేసిన శ్రీరామ్ ఎలెవన్ పాల్వంచ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 92 పరుగులు చేసింది. 93 పరుగుల విజయ లక్ష్యం తో బరిలోకి దిగిన మని ఎలెవన్ బూర్గం పాడు జట్టు 14.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి విజయం సాధించి ట్రోఫీ గెలుచు కుంది. బూర్గంపాడు జట్టులోని బ్యాట్మాన్ ప్రేమ్ 22 పరుగులు చేసి బౌలింగ్ లో 2 వికెట్లు తీసి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గెలుచు కున్నాడు. ఈ సందర్భంగా జరిగిన బహుమతి ప్రదానోత్సవం కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత మాట్లాడుతూ క్రీడలు అనేవి యువతలో దాగివున్న నైపుణ్యాన్ని వెలికి తీసి వారి ప్రతిభను ప్రపంచ నలు మూలలు చాటిచెప్పడానికి దోహదప డతాయని ఆమె తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నీ స్పాన్సర్ ఐటిసి టిఎన్టీయూసి ప్రెసిడెంట్ కనకమేడల హరిప్రసాద్, బొల్లి రామా రావులు క్యాష్ ప్రైజ్ విజేతలకు అందజేశారు. అలాగే ట్రోఫీ స్పాన్సర్స్ దేగల రాజు యాదవ్ విజేతలకు ట్రోఫీలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి జక్కం సర్వేశ్వరరావు, సొసైటీ డైరెక్టర్ బొల్లు రవి, టిఎన్టియుసి ప్రధాన కార్యదర్శి రామ్ కోటిరెడ్డి, హై స్కూల్ హెచ్.ఎం. జాన్సన్, పాత్రికేయులు జక్కిరెడ్డి మల్లా రెడ్డి, ఆర్గనైజింగ్ కమిటీ సోహైల్ పాషా, సర్వే శ్వరావు, గోనెల నాని పాల్గొన్నారు.

మహిళా హక్కుల కోసం పోరాటం చేయాలి

పీఓడబ్ల్యు రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

నవతెలంగాణ-బూర్గంపాడు

మోడీ ప్రభుత్వ హయాంలో దేశంలో మహిళలపై దాడులు పెరిగిపోయాయని, స్త్రీలను వంటింటికే పరిమితం చేసి పిల్లలను కనే యంత్రాలుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, పురుషాధిక్యత, హిందుత్వ బ్రాహ్మ నీయ చర్యలకు వ్యతిరేకంగా మహిళలు పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు పెద్దగోని ఆదిలక్ష్మి పిలుపునిచ్చారు. బూర్గంపాడు మండలం లోని కృష్ణసాగర్ క్రాస్ రోడ్ వద్ద గురువారం జరిగిన జనరల్ బాడీ సమా వేశంలో రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ చేశారు. మహబూబాబాద్ లో ఈనెల 28,29లలో జరగనున్న రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకులు సున్నం భూలక్ష్మి, పొడిమి రాధ, కొమరం భద్రమ్మ పాల్గొన్నారు.

గర్భిణులకు సామూహిక సీమంతాలు

ములకలపల్లి : మండల పరిధిలోని పొగళ్లపల్లి పంచాయతీలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం గర్భిణులకు సామూహిక సీమంతాలతో పాటుచిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్వైజర్ మాధవి, ఏఎన్ఎం ఈశ్వరి, అంగన్వాడీ టీచర్లు, వార్డు సభ్యురాలు వెంకటనర్సమ్మ, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పరిశీలన

ములకలపల్లి : విద్యార్థులలో నైపుణ్యాలు సాధించడంలో వెనుకబడి ఉండటం దురదృష్టకరమని జిల్లా ఎకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజు శేఖర్, జిల్లా సమ్మిళిత విద్యా కోఆర్డినేటర్ సైదులు తెలిపారు. తొలి మెట్టు పర్యవేక్షణలో భాగంగా గురువారం ఎంపీయూపీఎస్ సీతారాంపురం, పూసుగూడెం, వడ్డురామవరం, పాతూరు పాఠశాలలను సందర్శించిన వీరు విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలు సామర్థ్యాలు సాధించడంలో ఉపాధ్యాయుల కృషి ఆశించిన స్థాయిలో లేదని దీనికై మరికొంత శ్రద్ధ పెట్టి విద్యార్థులలో కనీస సామర్థ్యాలు పెంపొందించవలసిన అవసరం ఉన్నదని తెలిపారు. ఉపాధ్యాయులు కాల నిర్ణయ పట్టిక ఆధారంగా, వారి రాసుకున్న పాఠ్యప్రణాళిక ఆధారంగా పాఠాలు బోధించాలని తద్వారా విద్యార్థులలో ఆశించిన సామర్థ్యాలు వస్తాయని సూచించారు. పూసుగూడెం, ఒడ్డురామవరం ఎంపీపీఎస్ పాఠశాలల్లో మన ఊరు మన బడి లో భాగంగా జరుగుతున్న పనులను కూడా పరిశీలించారు. పూసుగూడెంలో నోడల్ అధికారి యోగితా వేణి మధ్యాన్న భోజనం పరిశీలించారు.

పెయింటింగ్ వర్కర్ కు జనసేన నిత్యావసరాలు పంపిణీ

ములకలపల్లి : మండలంలో భగత్ సింగ్ నగర్ కు చెందిన తాళ్ల శ్రీను పెయింటింగ్ వర్క్ చేస్తున్న సమయంలో బిల్డింగ్ పైనుంచి జారి పడి తన ఎడమ చేయి విరిగింది. ఈ విషయం తెలుసుకున్న జనసేన పార్టీ జిల్లా మండల నాయకులు తాళ్ల శ్రీను పరామర్శించారు. మండల అధ్యక్షుడు తాటికొండ ప్రవీణ్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

వాసవి క్లబ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

నవతెలంగాణ-భద్రాచలం

వాసవి క్లబ్ భద్రాచలం కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి నిత్యన్నదానం సత్రంలో జరిగింది. ఈ సమావేశంలో వాసవి క్లబ్ భద్రాచలం 2023 వ సంవత్సరానికి నూతన కార్య వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా రెపాక శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నాళ్ల సాయిచంద్, కోశాధికారిగా శ్రీరామ్ సునీల్‌ను ఏకగ్రీవంగా నియమించారు. ఈ సమావేశంలో అంతర్జాతీయ వాసవి క్లబ్స్ సమన్వయకర్త, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు చారుగుళ్ల శ్రీనివాస్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రధాన కార్యదర్శి, క్లబ్ మాజీ అధ్యక్షులు కంభంపాటి సురేష్ కుమార్, జిల్లా మాజీ డిప్యూటీ గవర్నర్లు చింతల వినోద్ కుమార్, చారుగుళ్ల వెంకట నాగభూషణం, మాజీ అధ్యక్షులు చారుగుండ్ల రామక్రిష్ణ పాల్గొన్నారు.

ఇటీవల మృతి చెందిన ఉపాధ్యాయునికి ఘన నివాళి

నవతెలంగాణ- టేకులపల్లి

మండలంలో ఎంపీపీఎస్ చింతలంక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న ఉపాధ్యాయుడు లావుడ్యా తారా సింగ్ మృతి చెందగా చిత్రపటానికి పూలమాల వేసి టిఎస్‌యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఘన నివాళులు అర్పించారు. స్థానిక తొమ్మిదవ మైలు తండా నందు టీఎస్ యుటిఎఫ్ టేకులపల్లి మండల అధ్యక్షురాలు మంగతాయి అధ్యక్షతన సంతాప సభ గురువారం నిర్వహించారు. సంతాప సభలో టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి రాజు, జిల్లా అధ్యక్షులు భూక్య కిషోర్ సింగ్ లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వరలక్ష్మి, హతిరాం, తావుర్యా, టేకులపల్లి మండల శాఖ నర్సింహారావు, మంగతాయి, బాలు నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు ఎదగాలంటే చదువే మార్గం

రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ గుగులోతు శంకర్ నాయక్

నవతెలంగాణ-పాల్వంచ

విద్యార్థినీ, విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి చదువే మూలాధారమని, తమ చదువుకు సృజనాత్మకత జోడించి మంచి నాణ్యమైన విద్యను అందుకున్నప్పుడే ఉన్నత శిఖరాలు చేరుకోగలరని రాష్ట్ర సమాచార హక్కు కమిషనర్ గుగులోతు శంకర్ నాయక్ తెలిపారు. గురువారం పాల్వంచలోని బొల్లోరు గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులతో ముఖాముఖి సమావేశంలో పాల్గొన్న ఆయన నేటి పిల్లలను వారి తల్లిదండ్రులు ఎన్నో కష్టాలకు ఓర్చి చదివిస్తున్నారని ఇటువంటి పరిస్థితులలో పిల్లలు సెల్ ఫోన్ల వంటి తాత్కాలిక ఆనందాలకు లొంగకుండా జీవితంలో ఎన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించి శాశ్వత ఆనందాన్ని పొందాలని చెప్పారు. దీనికోసం నిరంతరం కృషిచేసి, అబ్దుల్ కలాం వంటి మహానుభావుల ప్రేరణతో లక్ష్యాలు చేరుకోవాలని కోరారు. ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు కూడా నిరంతరం విద్యార్థులను ఉత్తేజపరిస్తూ వారికి నాణ్యమైన విద్యను అందిస్తూ భవిష్యత్తును తీర్చిదిద్దాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అకడమిక్ మానిటరింగ్ అధికారి ఏ. నాగరాజశేఖర్, సమ్మేళిత విద్యా కోఆర్డినేటర్ ఎస్కే సైదులు, మండల విద్యాశాఖ అధికారి జై శ్రీరామ్ మూర్తి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆదినారాయణ, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు, రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును దిగ్విజయంగా పూర్తి చేయాలి









జిల్లా కలెక్టర్ అనుదీప్

బూర్గంపాడు : తొలి రోజు అంతటి ఉత్సాహంతో వంద రోజులు కంటి వెలుగు కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ వైద్యాధికారులను ఆదేశించారు. గురువారం బూర్గంపాడు మండలం పినపాక పట్టినగర్ గ్రామంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ఆక స్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా క్యాంపు నిర్వహణకు చేసిన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కంటి సమ స్యలు పరిష్కారానికి ఒక బృహతర మంచి కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఆయన అన్నారు. నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కంటి వెలుగు కార్యక్రమాలు పకడ్బందీగా నిర్వహించాలని ఆయన అన్నారు. నిర్దేశించిన సమయం ప్రకారం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభించి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించాలని ఆయన చెప్పారు. ప్రజలు కంటి వెలుగు ఉచిత కంటి పరీక్షా కేంద్రంలో 18 సంవత్సరాలు పైబడిన వారందరూ పరీక్షలు నిర్వహించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ డాక్టర్ శిరీషా, తహశీల్దార్ బి. భగవాన్ రెడ్డి, ఎంపీడీవో వివేక్ రామ్, ఎంపీఓ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

కన్నుల పండుగగా కంటి వెలుగు : ఎమ్మెల్యే హరిప్రియ

ఇల్లందు : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన తెలంగాణ–కంటి వెలుగు పథకం రెండో విడత కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ స్త్రీ శక్తి భవనంలో ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ వెంకటేశ్వరరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలోని 6, 7 వార్డ్ లో 5 రోజులపాటు కార్యక్రమం ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రజలందరికీ దృష్టి లోపాలను నివారించి, అందత్వ రహిత తెలంగాణ నిర్మాణంలో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టారని అన్నారు. అనంతరం వైద్యులు నిర్వహిస్తున్న కంటి పరీక్ష విధానాన్ని వీక్షించి వారి నుంచి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు చేసుకున్న వారికి కంటి అద్దాలను ఎమ్మెల్యే అందించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగల్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీ పాషా, మున్సిపల్ కమిషనర్ అంకుషావలి, తాసిల్దార్ కృష్ణవేణి డాక్టర్ కవిత, కౌన్సిలర్లు తోటలలిత, సామల మాధవి రవితేజ పాల్గొన్నారు.

కంటి వెలుగు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

జెడ్పి సీఈవో విద్య లత

చంద్రుగొండ : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈఓ విద్యాలత సూచించారు. గురువారం చంద్రుగొండ రైతు వేదికలో రెండో విడత కంటి వెలుగు మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు బానోత్ పార్వతి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి కొనకళ్ల వెంకటరెడ్డి, జడ్పి కోఆప్షన్ సభ్యులు సయ్యద్ రసూల్, వైస్ ఎంపీపీ నరుకుల్ల సత్యనారాయణ, స్పెషల్ ఆఫీసర్ సంజీవరావు, తహసీల్దార్ వరస రవికుమార్ ఎంపీడీవో అన్నపూర్ణ, ఎంపిఓ తులసీరామ్, మెడికల్ ఆఫీసర్ కనకం తనుజ, బిఆర్ఎస్ పార్టీ మండల సెక్రెటరీ ఉప్పతల ఏడుకొండలు, మండల ఉపాధ్యక్షులు భూపతి శ్రీనివాసరావు, మండల నాయకులు పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

విప్ రేగా కాంతారావు

మణుగూరు : కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసనసభ్యులు రేగా కాంతారావు అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని కోటకట్ట ఏరియాలో గల హరిజనవాడలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెండో విడత కంటి వెలుగు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో దృష్టి లోపాలను, అంధత్వాన్ని నివారించేందుకు కంటి వెలుగు పథకం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ నాగరాజు, మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, జడ్పిటిసి పోషం నరసింహారావు, ఎంపీపీ కారం విజయ్ కుమారీ, పిఎసిఎస్ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు ముత్యం బాబు .పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అడపా అప్పారావు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

కంటి పరీక్ష శిబిరాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

భద్రాచలం : శాసనసభ్యులు పొదెం వీరయ్య భద్రాచలం పట్టణం జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన కంటి వెలుగు పథకం కంటి పరీక్ష శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కంటి పరీక్షలు చేయు విధానాన్ని స్వయంగా పరిశీలించి పరీక్ష చేయించు కున్నటువంటి లబ్ధిదారులకు కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి, డాక్టర్ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

ఆళ్ళపల్లి (గుండాల) : మండల కేంద్రంలోని ఏపీఆర్ పాఠశాల ఆవరణలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ ముక్తి సత్యం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నాగదివ్య, ఎంపీడీవో ఎస్.వి.సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి వలీ హజరత్, ఎస్సై కిన్నెర రాజశేఖర్, సర్పంచ్ కోరం సీతారాములు, ఉప సర్పంచ్ మానాల ఉపేందర్, వైద్యాధికారి మనీష్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించుకోవడం గొప్ప విషయం - ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి

ఆళ్ళపల్లి : భారతదేశంలో ఏ రాష్ట్రంలో లేని కంటి వెలుగు కార్యక్రమాన్ని మన రాష్ట్రంలో విజయవంతంగా రెండవ విడత ప్రారంభించుకోవడం గొప్ప విషయమని స్థానిక ఎంపీపీ కోండ్రు మంజు భార్గవి, జెడ్పీటీసీ కొమరం హనుమంతరావు అన్నారు. ఈ మేరకు మండల పరిధిలోని రాయిపాడు గ్రామం రామ చంద్రయ్య గుంపు ప్రాథమిక పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ మొహమ్మద్ సాదియా సుల్తానా, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారులు అర్వపల్లి రేవంత్, సంఘమిత్ర, మండల ప్రత్యేక అధికారి ఎం.వెంకటేశ్వర రెడ్డి, వైస్ ఎంపీపీ రేసు ఎల్లయ్య సర్పంచ్ ఊకె ఈశ్వరి, సెక్రటరీ రమేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాయం నరసింహారావు, ఎంపీఓ వీరభద్రయ్య, ఏఎస్ఐ వెంకట్ రెడ్డి, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, అంగన్వాడి కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగు గొప్ప సంకల్పం : ఎమ్మెల్యే వనమా

పాల్వంచ : కంటి వైద్యం చేయించలేని లక్షలాదిమంది పేద ప్రజలకు చూపు ప్రసాదించాలనే గొప్ప సంకల్పంతో రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు వనమా వెంకటేశ్వరరావు అన్నారు. రాష్ట్రంలో రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని పాత పాల్వంచలోని హైస్కూల్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని వనమా ప్రారంభించారు. స్వయంగా తాను కూడా కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఒకసారి ఈ కార్యక్రమం నిర్విఘ్నంగా సాగిందని మరల ఇప్పుడు రెండోసారి కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రజలు 100 రోజులపాటు జరిగే కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వనమా అన్నారు. ఈ కార్యక్రమంలో కంటి వెలుగు రాష్ట్ర నోడల్ అధికారి రవికుమార్, డిఎంహెచ్ ఓజెవి ఎల్.శిరీష, డాక్టర్ నామా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, తహసిల్దార్ రంగా సిడిపిఓ కనకదుర్గ, పట్టణ ఎస్సై నరేష్, మున్సిపల్ ఏఈ రాజేష్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు మంతపురి రాజు గౌడ్, పెద్దమ్మ గుడి మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్ కనగాల నారాయణరావు, టిఆర్ఎస్ నాయకులు కొత్వాల సత్యనారాయణ పాల్గొన్నారు.

కంటి చూపు జీవితానికే వెలుగు : ఎమ్మెల్యే మెచ్చా

నవతెలంగాణ-అశ్వారావుపేట

కంటి చూపు జీవితానికే వెలుగును ఇస్తుందని, ప్రస్తుతం ఆధునిక జీవనంలో కంటిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్థానిక ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు సూచించారు. కంటి వెలుగు రెండో దశ కార్యక్రమాన్ని ఆయన గురువారం అశ్వారావుపేట రైతు శిక్షణ కేంద్రంలో లాంచనీయంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి జల్లిపల్లి శ్రీరామమూర్తి, జెడ్పీటీసీ చిన్నంశెట్టి వరలక్ష్మి, తహశీల్దార్ చల్లా ప్రసాద్, కంటి వెలుగు మండల ప్రత్యేక అధికారి,అశ్వారావుపేట వైద్యాధికారి డాక్టర్ రాందాస్,గ ుమ్మడవల్లి పి.హెచ్.సి వైద్యాధికారి డాక్టర్ మధులిక, అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుమ్మడవల్లి కంటి వెలుగు కేంద్రాల పర్యవేక్షకులు డాక్టర్ మాధురి, డాక్టర్ నీలిమ, డాక్టర్ వెంకటేశ్వర్లు, నాయకులు మందపాటి రాజమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం

ములకలపల్లి : మండలంలోని రామచంద్రాపురం గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి వెలుగు కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సున్నం నాగమణి, ఎంపీపీ మట్ల నాగమణిలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ బాలు, ఎంపీడీవో చిన్న నాగేశ్వరావు, ఎంపీఓ. డి లక్ష్మయ్య, డాక్టర్ సాయి కళ్యాణ్ , క్యాంపు డాక్టర్ పద్మ కుమార్, కంటి డాక్టర్ సాయి కృష్ణ, డేటా ఎంట్రీ ఆఫీసర్ రమేష్ బాబు, ఎంపీటీసీ కొర్రి భద్రయ్య, సర్పంచ్ సున్నం సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.









ఎటువంటి లోటు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలి

సన్నాహక సమావేశంలో జీఎం

నవతెలంగాణ-మణుగూరు

సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించే గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను ఎటువంటి లోటు రాకుండా తగిన ఏర్పాట్లు చేయాలని ఏరియా జనరల్ మేనేజర్ జి వెంకటేశ్వరరెడ్డి అన్నారు.గురువారం సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజర్ కార్యాలయ సమావేశ మందిరంలో గణతంత్ర దినోత్సవం 2023 వేడుకల నిర్వహణ పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ పతాకావిష్కరణ, ఉత్తమ ఉద్యోగుల సన్మాన కార్యక్రమంతో పాటు స్థానిక పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించే సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించడానికి అధిక సంఖ్యలో సింగరేణియులు వారి కుటుంబ సభ్యులు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో లలిత్‌కుమార్, నర్సిరెడ్డి, నాగేశ్వరరావు, రమేశ్, మెడికల్ సూపరిండెంట్ శేషగిరి, సీనియర్ సెక్యూరిటీ అధికారి అబ్దుల్ షబ్బీరుద్దీన్, సీనియర్ పర్సనల్ అధికారులు సింగు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ అనుదీప్‌కి శుభాకాంక్షలు

గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్

నవతెలంగాణ-పాల్వంచ

నూతన కలెక్టరేట్ భవనాల సముదాయంలోనికి విధి నిర్వహణలో ప్రవేశించిన సందర్భంగా జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్‌ను అభ్యుదయ కళాసేవ సమితి జిల్లా అధ్యక్షులు కవి సినీ గీత రచయిత గాయకులు సమాజసేవకులు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తన మిత్ర బృందంతో కలిసి పూల బోకేలు అందించి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

తెలంగాణకు ద్రోహం.. భారాస ఆవిర్భావం

కాంగ్రెస్ నాయకులు చెన్నకేశవరావు

నవతెలంగాణ-అశ్వారావుపేట

స్థానికత పేరుతో ఉద్యమం చేపట్టి, తెలుగు ప్రజలను విడదీసి గద్దినెక్కిన కేసీఆర్ జాతీయ స్థాయి రాజకీయాలు కోసం భారాస ఏర్పాటు చేయడం తెలంగాణకు ద్రోహం చేయడమే అని కాంగ్రెస్ అశ్వారావుపేట నియోజక వర్గం సీనియర్ నాయకులు మొగుళ్ళపు చెన్నకేశవరావు అన్నారు. అశ్వారావుపేటలో గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో పదవి చేపట్టిన కేసీఆర్ నేడు కల్లబొల్లి కథలు చెపుతున్నారని ఎద్దేవా చేసారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల ఇళ్లల్లో రాత్రి పోలీసులు జొరబడి వారిని స్టేషన్లకు తరలించడం ప్రజాస్వామిక వ్యవస్థలో నీతిమాలిన పని అన్నారు. ఇలాంటి దుర్మార్గపు చర్యలు అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి లు వేముల భారతి, సత్యవరపు తిరుమల, సుంకవల్లి వీరభద్రరావు, బూసి పాండురంగ, బండారు మహేష్, తగరం రాజేష్, జల్లిపల్లి దేవరాజ్, పార్టీ అభిమానులు పాల్గొన్నారు

విద్యుత్ శాఖ అధికారులకు సిఐటియు డైరీ పంపిణీ

నవతెలంగాణ-భద్రాచలం

భద్రాచలం డివిజన్ డి.ఈ జీవన్ కుమార్‌కి టిఎస్‌యూఈఈ సీఐటీయూ డైరీ, క్యాలెండర్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నాయకులు, భద్రాచలం డివిజన్ నాయకులు, సీఐటీయూ సభ్యులు పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు కూలి బంధు ప్రవేశపెట్టాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాసరావు

నవతెలంగాణ-పినపాక

దేశ జనాభాలో 65 శాతంగా ఉన్న వ్యవసాయ కార్మికులను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని, కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని బీఆర్ఎస్ ప్రభుత్వాలకి వ్యవసాయ కార్మికులు తగిన గుణపాఠం చెప్పే రోజులు దగ్గర పడ్డాయని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాసరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ సమావేశం ఈ.బయ్యారం క్రాస్ రోడ్ లో గల జీవీఆర్ ఫంక్షన్ హాల్ లో గురువారం సంఘం అధ్యక్షురాలు కబ్బాకు సరళ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోడు భూములకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను నెరవేర్చి సర్వే చేసిన విధంగా ప్రతి ఒక్క పోడు రైతుకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పోడు పట్టాల విషయంలో రైతులకు అన్యాయం జరిగితే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఎన్నో వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీలను ఏ ఒక్కటి అమలు చేయకపోవడం శోచనీయం అన్నారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నిమ్మల వెంకన్న మండల కమిటీ సభ్యులు తోలం పరమయ్య, కురసం లక్ష్మయ్య పూనెం దేవమ్మ తదితరులు పాల్గొన్నారు.

సొసైటీ కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకురావాలి

డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కొత్వాల

నవతెలంగాణ-పాల్వంచ

రైతులు వరి ధాన్యాన్ని త్వరితగిన సొసైటీ కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని, త్వరలోనే ధాన్యం సేకరణను నిలిపివేయనున్నారని డీసీఎంఎస్ వైస్ చైర్మన్ పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. సొసైటీ కార్యాలయంలో గురువారం పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధరకు సొసైటీ ద్వారా సేకరణ జరుపుతున్నదన్నారు. ఈ సమావేశంలో సొసైటీ వైస్ చైర్మన్ కాంపెల్లి కనకేష్, డైరెక్టర్లు బుడగం రామ మోహన్ రావు, కనగాల నారాయణరావు, సామా జనార్ధన్ రెడ్డి, యర్రంశెట్టి మధుసూదన్ రావు, జరబన సీతారాంబాబు పాల్గొన్నారు.



కాట్ సెకండ్ లెవెల్ రిజల్ట్ లో శ్రీ చైతన్య విద్యార్థులు విజయకాండ

నవ తెలంగాణ-పాల్వంచ

పాల్వంచ పట్టణానికి చెందిన కాంట్రాక్టర్స్ కాలనీ యందు గల శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు కాట్ రెండవ లెవెల్ రిజల్ట్ లో విజయఢంకా మోగించారు. 2022–23 విద్యాసంవత్సరానికి గాను జరిగిన కాట్ రెండవ లెవల్ నందు 37 మంది విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనపరిచారు. ఇందులో నలుగురు విద్యార్థులు నగదు బహుమతులు మరియు 33 మంది విద్యార్థులు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లు సాధించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ కో–ఆర్డినేటర్ కృష్ణ రావు, ప్రిన్సిపాల్ ఇస్మాయిల్, డీన్ నాగేశ్వర రావు పాల్గొన్నారు.

ఏడు మార్కులు కలిపి మెయిన్స్ కి అనుమతించాలి

జిల్లా వర్కింగ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అబిద్

యువజన కాంగ్రెస్ కలెక్టరేట్ ఎదుట ధర్నా

నవతెలంగాణ-పాల్వంచ

పోలీస్ నియామకాలలో హైకోర్టు తీర్పు ప్రకారం మల్టిపుల్ ప్రశ్నలకు ఏడు మార్కులు కలిపి మెయిన్స్‌కి అనుమతించాలని జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ అబిద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పాల్వంచలోని జిల్లా కలెక్టరేట్ ఎదురుగా యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి డిఆర్ఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రన్నింగ్ అర్హత పొంది లాంగ్ జంప్ లో అనార్హులైనా వారిని కూడా మెయిన్స్ కి అనుమతించాలన్నారు. పోలీస్ విభాగంలో రాష్ట్ర ప్రభుత్వం పెట్టిన తప్పుడు నియామకాల వల్ల ఎంతో మంది అభ్యర్థుల జీవితాలు రోడ్డు మీద పడే అవకాశం ఉంది, ఈ తప్పుడు నియామకాల వల్ల అభ్యర్థులలో కొందరు ఆత్మహత్య చేసుకోవడం కూడా జరిగిందన్నారు. కావున వారి కుటుంబాన్నికి ప్రభుత్వం వెంటనే కోటి రూపాయల ఎక్స్‌గ్రేసియా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పినపాక నియోజకవర్గం అధ్యక్షులు పోతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, కొత్తగూడెం నియోజకవర్గం ఉపాధ్యక్షులు అనుదీప్, నియోజకవర్గం జనరల్ సెక్రెటరీ బానోత్ కోటేష్ నాయక్, జిల్లా సెక్రెటరీ తేజవత్ శ్రీను పాల్గొన్నారు.

నూతన జేకే ఉపరితల ప్రాజెక్ట్ పనులు పరిశీలించిన జీఎం

నవతెలంగాణ-ఇల్లందు

ఏరియాలో నూతన జే.కే ఉపరితల ప్రాజెక్ట్ విస్తరణ పనులను జనరల్ మేనేజర్ ఎం. షాలెం రాజు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు ఓబి రవాణాకు మహబూబాబాద్ రోడ్ వద్ద నిర్మిస్తున్న ఓవర్ బ్రిడ్జి, బుగ్గ వాగు వద్ద నిర్మిస్తున్నటువంటి వంతెన, కారేపల్లి రోడ్ వద్ద నిర్మిస్తున్న అండర్ బ్రిడ్జ్ పనులను పరిశీలించి వాటిని త్వరితగతన పూర్తి చేయాలని కాంట్రాక్టర్స్ కు తగు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం మల్లారపు మల్లయ్య, ఏరియా సివిల్ అధికారి డాక్టర్. ఆదినారాయణ, ఏరియా సర్వే అధికారి బాలాజీ నాయుడు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరి ధన్యవాదాలు

బీఆర్ఎస్ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

ఈ నెల 18న ఖమ్మం గుమ్మంలో జరిగిన బీఆర్ఎస్ పార్టీ తొలి ఆవిర్భావ భారీ బహిరంగ సభ విజయవంతానికి కృషి చేసిన మండల నాయకులకు, పార్టీ ప్రజా ప్రతినిధులకు సభకు తరలి వచ్చిన పార్టీ కార్యకర్తలకు మండల బీఆర్ఎస్ పార్టీ మండల కమిటీ తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్న పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి తెలిపారు. గురువారం లక్ష్మీనగరం మండల పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థి గెలుపే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రేసు లక్ష్మీ, మండల కార్యదర్శి కణితి రాముడు, అధికారప్రతినిధి యండి జానీపాషా, పర్ణశాల ఎంపిటిసి సభ్యులు తెల్లం భీమరాజు, పిఏసిఎస్ డైరక్టర్ పిసోడి వెంకటేష్, ప్రచార కమిటీ అధ్యక్షులు దామెర్ల శ్రీనివాస్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మోత్కూరి శ్రీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించిన ఐజీ ఎస్.చంద్రశేఖర్ రెడ్డి

ఎస్పీ కార్యాలయంలో సమీక్షా సమావేశం

నవతెలంగాణ-కొత్తగూడెం

జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని మల్టీ జోన్-1 ఐజిపి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి సందర్శించారు. గురువారం కొత్తగూడెం జిల్లాలో పర్యటించారు. ముందుగా ఎస్పీ కార్యాలయానికి చేరుకున్న ఐజిపి ని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.జి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. అనంతరం జిల్లా సాయుధ దళ పోలీసుల చేత గౌరవ వందనాన్ని స్వీకరించారు. తదుపరి ఎస్పీ కార్యాలయాన్ని పరిశీలించి కాన్ఫరెన్స్ హాల్ నందు సిఐలు, ఆ పై స్థాయి అధికారులందరితో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలోని స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. నిషేధిత మావోయిస్టుల కదలికలపై నిరంతరం సమాచారం సేకరిస్తూ ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని కోరారు. అనంతరం పాల్వంచ నవభారత్ నందు నూతనంగా నిర్మించబడుతున్న జిల్లా పోలీస్ కార్యాలయ పనులను పరిశీలించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ టి.సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ అక్షాంశ్ యాదవ్, కొత్తగూడెం డిఎస్పీ వెంకటేశ్వర బాబు, ఇల్లందు డిఎస్పీ రమణమూర్తి, మణుగూరు డిఎస్పీ రాఘవేంద్రరావు, పాల్వంచ డిఎస్పీ సత్యనారాయణ, డీసీఆర్బీ డిఎస్పీ నందీరామ్, ఏఆర్ డిఎస్పీ విజయ్ బాబు, సిఐలు పాల్గొన్నారు.

కెసిఆర్ హామీలు నమ్మి పరిస్థితి లేదు

టిడిపి పాల్వంచ అధ్యక్షులు లక్ష్మీపతి

నవతెలంగాణ-పాల్వంచ

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ ఇచ్చిన హామీలను నమ్మే పరిస్థితి లేదని 9 సంవత్సరాలుగా అనేక హామీలు ఇచ్చి ఇంతవరకు నెరవేర్చలేదని పాల్వంచ పట్టణ టిడిపి అధ్యక్షులు కళ్యాణం లక్ష్మీపతి ఆరోపించారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఖమ్మంలో బిఆర్ఎస్ సభ కోసం జనం ఘోస పడ్డారన్నారు. ఖమ్మంలో జరిగిన బహిరంగ సభలో జర్నలిస్టులకు ఇల్లు పట్టాలు ఇస్తానని మరల వాగ్దానం చేయటం విడ్డూరంగా ఉందన్నారు. ఇంటింటికి మిషన్ భగీరథ నీరు హామీ నెరవేరలేదన్నారు.



అభివృద్ధి పేరుతో అమాయకులను బలి చేస్తారా..

-నష్టపరిహారం ఇవ్వకుండా కోరెగడ్డతో పాటు నిర్వాసితులను కూడా జల సమాధి చేస్తారా..

-3 గంటలపాటు జలదీక్ష చేపట్టిన నిర్వాసిత రైతులు

నవతెలంగాణ-చర్ల

అభివృద్ధి పేరిట అమాయకులను నీట ముంచి బలి చేస్తారా అని కోరెగడ్డ నిర్వాసితుల పోరాట కమిటీ అధ్యక్షులు కొండా చరణ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గురువారం మండలంలోని రాష్ట్ర ప్రభుత్వం సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ నిర్మాణంలో బాగంగా నిర్మిస్తున్న కరకట్ట పనులు నిలిపివేయాలని ఈ ప్రాజెక్ట్ నిర్మాణం కారంగా నిర్వాసితులు అవుతున్న రైతు కూలీలకు నష్టపరిహారం ఇవ్వాలని కోరేగడ్డ నిర్వాసితుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో గోదావరిలో నిర్వాసితులు 3 గంటల పాటు జలదీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హాజరైన కేఎన్పీకే అధ్యక్షుడు కొండా చరణ్ మాట్లాడుతూ వేల మంది రైతులు, రైతు కూలీలు ఈ ప్రాజెక్ట్ నిర్మాణంలో వారి జీవనోపాధిని కోల్పోతుంటే రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. ఇదేనా పేదలు, రైతులు, కూలీల పట్ల బీఆర్ఎస్ ప్రభుత్వానికి వున్న ప్రేమ అని ప్రశ్నించారు. చక చక ప్రాజెక్ట్ పనులు చేసుకుంటున్నారు కానీ నిర్వాసితుల గోడునీ మాత్రం ఇసుమంత అయినా పట్టించుకోక పోవడం సిగ్గుచేటు అని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నిర్వాసితులకు నష్టపరిహారం ఇవ్వకపోతే వీరికి గోదాట్లో దూకి చావడం తప్ప మరో గత్యతరం లేదని అన్నారు. నష్టపరిహారం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం నిర్వాసితులను ఆదుకుంటుందా లేక బ్రతుకు దెరువు అయిన కోరెగడ్డను ముంచినట్లు వీళ్ళనీ కూడా ప్రాజెక్ట్ నిర్మాణంలో ముంచుతారా అనేది రాష్ట్ర ప్రభుత్వం తేల్చుకోవాలని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ప్రతీ కుటుంబానికి రూ.8 లక్షల నష్టరిహారాన్ని ఇవ్వాలన్నారు. ప్రభుత్వమే జీవనోపాధిని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాసితులు సరెం.సావిత్రి, ఇర్పా మంగవేని శ్యామల.సత్యవతి, సోడి అనాసుర్య, రాంబాబు, కోర్సా సూరమ్మ, పాయల మంగవేని, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టాఫ్ నర్స్ జ్యోష్న వైద్య సేవలు మరువలేనివి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

వైద్య శాఖలో ఏఎన్ఎమ్‌గా ఎజన్సీ ప్రాంతంలో ఆమె పేద ప్రజలకు అందించిన వైద్య సేవలు మరువలేనివి అని మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తి కొనియాడారు. నర్సాపురం వైద్యశాలలో స్టాఫ్ నర్సుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన జ్యోష్న భౌతిక కకాయాన్ని తూరుబాక గ్రామంలో ఆమె ఇంటికి వెళ్లి ఘనంగా నివాళులు అర్పించడంతో పాటు వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. నివాళులు అర్పించిన వారిలో పిఎసిఎస్ డైరెక్టర్ బొల్లి వెంకట్రావు, బిసి సెల్ మండల కార్యదర్శి బి శేఖర్, నాయకులు కుమ్మరికుంట్ల సూర్యతదితరులు ఉన్నారు. దుమ్ముగూడెం వైద్యాధికారి బాలాజీ నాయక్, నర్సాపురం వైద్య సిబ్బంది మాధవి, భారతి, హేమలత, శ్రీదేవి, కందుల వీరభద్రంతో పాటు పలువురు వైద్య సిబ్బంది సందర్శించి నివాళులు అర్పించారు.

అనారోగ్యంతో ఇంటర్ విద్యార్థి మృతి: మండలంలోని నారాయణరావుపేట గ్రామానికి చెందిన కుర్సం జంపన్న (17) వరగంల్‌లో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. జంపన్న ఇటీవల అనారోగ్యం పాలు కావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్ తరలించి వైద్య అందిస్తుండగా బుదవారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. జంపన్న మృత దేహాన్ని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు అన్నె సత్యనారాయణమూర్తితో పాటు మండల కార్యదర్శి కణితి రాముడు, సహాయకార్యదర్శి ఆదినారాయణ, స్థానిక సర్పంచ్ కల్లూరి రజని, నాయకులు శ్రీనివాస్, పిలకా నాగేందర్‌రెడ్డి సందర్శించి నివాళులు అర్పించడంతో పాటు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు.



కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి : మెచ్చా నాగేశ్వరరావు

నవతెలంగాణ-దమ్మపేట

మండల కేంద్రంలో సెయింట్ మేరీ స్కూల్ వద్ద రెండోవ విడత కంటి వెలుగు కార్యక్రమాన్ని స్థానిక ప్రజా ప్రతినిదులు నాయకులతో కలిసి ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు కంటి వెలుగు కార్యక్రమంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. అవసరమైన వారందరికీ కళ్లద్దాలు ఇస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ సోయం ప్రసాద్, వైస్ ఎంపీపీ దారా మల్లికార్జున్ రావు, సర్పంచ్ ఉయ్యాల చిన్న వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ దారా యుగంధర్, చిన్నశెట్టి సత్యనారయణ, పగడాల రాంబాబు పాల్గొన్నారు.

కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలి



బూర్గంపాడు : కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జెడ్పిటిసి కామిరెడ్డి శ్రీలత అన్నారు. లక్ష్మీపురం, అంజనాపురంలో గ్రామాలలో ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పొడియం ముత్యాలమ్మ, లక్ష్మీపురం సర్పంచ్ సోంపక నాగమణి, అంజనాపురం సర్పంచ్ భూక్యా భారతి, తహశీల్దార్ బి. భగవాన్ రెడ్డి, ఎంపిడిఓ. వివేకారామ్, ఎంపిఓ సునీల్, వైద్యులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

- జిల్లా భద్రాద్రి కలెక్టర్ అనుదీప్

- ప్రజావాణి ఫిర్యాదులు పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-కొత్తగూడెం

ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని జిల్లా కలెక్టర్ అనుదీప్ అన్నారు. గురువారం ఐడిఓసిలో రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జనవరి 2022 మాసం నుండి డిసెంబర్ 2022 మాసం వరకు ప్రజావాణిలో రెవెన్యూ శాఖకు సంబంధించి 1764 ఫిర్యాదులు వచ్చాయని వాటిలో 1629 పరిష్కరించగా 135 ఫిర్యాదులు పెండింగ్ ఉన్నాయని వాటిని కూడా పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణి ఫిర్యాదులు మానవతా దృక్పథంతో పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహించొద్దని మనం ప్రజా సేవలో ఉన్నామన్న విషయం మరువొద్దని అన్నారు. మీ సేవా నిర్వాహకులతో తహసీల్దార్లు సమావేశం నిర్వహించి మాడ్యూల్స్ పై అవగాహన కల్పించాలని చెప్పారు. భూ సంబంధించిన సమస్యలు నిరుపేదలకు ఎలా తెలుస్తుందని, ధరణిలో ఏ విధంగా దరఖాస్తు చేయాలో అవగాహన ఉండాలని చెప్పారు. తప్పులు చేస్తే మీ సేవా నిర్వహకులకు నోటీస్ జారీ చేయాలని తహశీల్దార్లకు సూచించారు. మీ సేవా కేంద్రాలలో ధరణి సేవలపై ఫ్లెక్సీ లు ఏర్పాటు చేయాలని చెప్పారు. నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపునకు రెండు వారాల్లో లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని తహసిల్దారులను ఆదేశించారు. ప్రాజెక్టులు వారిగా భూ సేకరణ పెండింగ్ పై సమగ్ర నివేదిక అందచేయాలని చెప్పారు. భూ సేకరణ ప్రక్రియ ఫిబ్రవరి 1వ తేదీ వరకు పరిష్కరించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డిఆర్ఓ అశోక్ చక్రవర్తి, పిఆర్ ఈఈ సుధాకర్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ తానాజీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి కుసుమ కుమారి, డిఆర్వో అశోక్ చక్రవర్తి, అన్ని మండలాల తహసీల్దార్లు, ఈడీఎం విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

బిజెపి వ్యతిరేక శక్తులతో కలిసి ముందుకు వెళ్తాం..

- కమ్యూనిస్టులు లేకుండా దేశానికి భవిష్యత్తు ఉందా..

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

నవతెలంగాణ-చండ్రుగొండ

బీజేపీ వ్యతిరేక శక్తులతో కలిసి ప్రజా సమస్యలపై ముందుకు వెళ్తామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. గురువారం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మండల కార్యదర్శి వంకాయలపాటి శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. వారి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులు ఓదార్చి సంతాప సానుభూతిని తెలియజేశారు. అనంతరం స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కార్యదర్శి ఐలూరి రామ్ రెడ్డి అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ శ్రీనివాసరావు ఈ ప్రాంతంలో గుర్తింపు పొందిన నాయకుడని అన్నారు. పోడభూముల సమస్యల మీద పోరాటం చేసి 5000 ఎకరాల భూమిని సాధించారన్నారు. ఆయనపై ఫారెస్ట్, పోలీస్ వారు 25 కేసులు పెట్టిన వెనుకంజా వేయలేదన్నారు. కమ్యూనిస్టు సిద్ధాంతానికి సావే లేదన్నారు. కమ్యూనిస్టుల కు భవిష్యత్తు ఉందా లేదా అన్నది కాదు కమ్యూనిస్టులు లేకుండా దేశానికి భవిష్యత్తు ఉందా అని ఆయన అన్నారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బిజెపి వ్యతిరేక శక్తులతో కలిసి వెళ్తామన్నారు. కమ్యూనిస్టు పార్టీలు అధికారంలో ఉన్న దేశాల్లో, రాష్ట్రాల్లో మాత్రమే ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుతున్నాయన్నారు. బిజెపి విధానాలను బీఆర్ఎస్ వ్యతిరేకిస్తుంది కాబట్టే ఖమ్మం బీఆర్ఎస్ బహిరంగ సభలో పాల్గొన్నామన్నారు. పోడు సమస్య, కాంటాక్ట్ కార్మికులను రెగ్యులరైజ్, జర్నలిస్టు జిల్లా స్థలాలు, ఖాళీ స్థలం ఉన్నవారికి ఇల్లు నిర్మాణానికి ఐదు లక్షల ఇవ్వాలని, ఖాళీ స్థలం ఉన్నవారికి పట్టా ఇవ్వాలని, అనేక రకాల సమస్యలపై ఖమ్మం బహిరంగ సభలో సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం ఇవ్వడం జరిగిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం పెన్షన్లు, సాగునీటి సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. తెలంగాణ అభివృద్ధి చెందుతుందన్నారు. బిజెపిని నివారించడానికి కలిసి పనిచేసిన ప్రజా సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వంపై పోరాడుతామని అన్నారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కాసాని ఐలయ్య, జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య, జిల్లా కమిటీ సభ్యులు కొండపల్లి శ్రీధర్, అన్నవరపు సత్యనారాయణ, జూలూరుపాడు మండల కార్యదర్శి యాస నరేష్, మండల కమిటీ సభ్యులు పెద్దిన్ని వేణు, గాలి రామారావు, రాయి రాజా విప్పర్ల పెద్ద వెంకటేశ్వర్లు, రామడుగు వెంకటాచారి, శాఖా కార్యదర్శులు చల్లపల్లి రాజా పొట్టేటి శ్రీనివాస్ రెడ్డి, దాసరి సీతారాములు, నాగుల మీరా, అబ్దుల్ రెహ్మాన్ ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కెసిఆర్ ముందు చూపుతోనే కంటి వెలుగు

కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ప్రారంభించిన ఎంపిపి

నవతెలంగాణ-దుమ్ముగూడెం

పర్ణశాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కంటి వెలుగు వైద్య శిబిరాన్ని ఎంపిపి రేసు లక్ష్మీ చేతుల మీదుగా ప్రారంభించారు. కొత్తపల్లిలో కంటి వైద్య శిబిరాన్ని సర్పంచ్ గుండి వెంకటేష్ ప్రారంభించగా బట్టిగూడెంలో సర్పంచ్ సరియం సీతారామయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ ఎం చంద్రమౌళి, కంటి వెలుగు నోడల్ అధికారి సులోచన, చిన్నబండిరేవు సర్పంచ్ కారం జయ, ఉపసర్పంచ్ బైరబోయిన ఉమేష్‌యాదవ్, పర్ణశాల ఎంపిటిసి సభ్యులు తెల్లం భీమరాజు, వైద్యులు రేణుకారెడ్డి, శ్రీకాంత్ , నిషితారావు తో పాటు కంటి వెలుగు సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



తెలంగాణ సాకారంతోనే రాష్ట్రంలో విద్యుత్ వెలుగులు

- టిఎస్ఈఆర్‌సి చైర్మన్ శ్రీ రంగారావు

- గిరిజన ప్రాంతాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు.

-గిరిజనుల అభ్యున్నతే లక్ష్యం మాజీ మంత్రి జలగం ప్రసాద్ రావు

నవతెలంగాణ-అశ్వారావుపేట

తెలంగాణ రాష్ట్ర సాకారం వల్ల సీఎం కేసీఆర్ విద్యుత్ కు అధిక ప్రాధాన్యత ఇచ్చి రూ.3800 కోట్ల వ్యయం చేసి అంధకారం లేని, రైతుల ఆత్మహత్యలు లేని రాష్ట్రంగా తీర్చారని రాష్ట్ర విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్ తన్నీరు శ్రీ రంగారావు అన్నారు. జలగం వెంగళరావు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వ్యవసాయం నిమిత్తం వ్యక్తిగత కరెంటు మోటార్లు, పంపు సెట్లు, స్టార్టర్లు, పైపులను 44 మంది గిరిజన రైతులకు ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావుతో కలిసి గురువారం పంపిణీ చేశారు. గిరిజన రైతులు సీసం నాగేశ్వరరావు, సీసం రాంబాబులు విద్యుత్ మోటార్లు స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. అనంతరం మాజీ మంత్రి జలగం ప్రసాదరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో శ్రీ రంగారావు మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ సమస్య ఉండేదని, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత విద్యుత్ సమస్యలను అధిగమించి ప్రస్తుతం మిగులు విద్యుత్ ఉత్పత్తికి చేరుకున్నామన్నారు. రూ.40 కోట్లు వ్యయంతో భద్రాద్రి, యాద్రాద్రి విద్యుత్ ప్లాంట్లు నిర్మించుకుంటున్నామన్నారు. సాగునీటి ప్రాజెక్టులు నిర్మించుకుని, వాటి ద్వారా విద్యుత్ ను కూడా ఆదా చేస్తున్నామని రైతులకు వివరించారు. రైతులకు ఉచిత విద్యుత్, విద్యుత్ లేని గంగారం, తిమ్మాపురం, గిరిజనులకు ఇటీవల విద్యుత్, సరఫరా చేయటం వల్ల వారి ఆనందాలకు అవధులు లేవన్నారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత జలగం వెంగళరావు మంచి పరిపాలనాధ్యక్షుడు, నీతి నిజాయితీ కలిగిన వ్యక్తి పేరున ట్రస్టు ఏర్పాటు చేసి గిరిజనులకు సేవ కార్యక్రమాలు చేపటటం పట్ల జలగం ప్రసాదరావును అభినందించారు.

ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు మాట్లాడుతూ రైతులను ఆదుకోవాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ఉచిత విద్యుత్, రూ.250 కోట్లతో రైతుబంధు, రైతు భీమా వంటి పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ఇప్పటి వరుకు జెవిఆర్ ట్రస్టు 700 విద్యుత్ మోటార్లు ను పంపిణీ చేశారని, దీనికి తనవంతు సహకారం అందిస్తున్నానని వివరించారు. గాండ్లగూడెం - కావడిగుండ్ల రోడ్డు మరో 3కిల్లో మీటర్లు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే వివరించారు.

మాజీ మంత్రి, ట్రస్టు నిర్వహకులు జలగం ప్రసాదరావు మాట్లాడుతూ గిరిజన రైతులు ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే తమ లక్ష్యమన్నారు. వృధాగా పోతున్న వాగులు, వంకలు జలాలను రైతులకు వినియోగంలోకి తేచ్చేందుకు తమ ట్రస్టు ప్రయత్నం చేస్తుందని, విద్యుత్ నియంత్రణ మండలి ద్వార విద్యుత్ లైన్ లు అనుమతులు కల్పించాలని జలగం కోరారు. దీనికి స్పందించిన కమీషన్ చైర్మన్ శ్రీ రంగారావు వచ్చే ఫిబ్రవరి నెలలో వరంగల్లో బోర్డు డైరెక్టర్లు తో సమావేశం ఉందని, దానికి మీరు దరఖాస్తు చేసుకోవాలని జలగం కు సూచించారు. ఈ ప్రాంతంలో విద్యుత్ స్టాఫ్ కొరత ఉందని ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గిరిజన విద్యార్థులు 10వ తరగతి చదివితే నర్సింగ్ శిక్షణకు తన ట్రస్టు రూ.20 వేలు భరిస్తుందని, మిగిలిన రూ.10 వేలు వ్యక్తిగతంగా విద్యార్థులు భరించాలన్నారు. అనంతరం శ్రీరంగారావు, ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరావు, బండారు కృష్ణయ్య నాగరాజులను ఘనంగా సన్మానించారు.

ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు బండారు కృష్ణయ్య, నాగరాజు, విద్యుత్ ఎస్ఈ కె.రమేష్, మల్లాయిగూడెం, కన్నాయిగూడెం సర్పంచ్లు నారం రాజశేఖర్, గొంది లక్ష్మణరావు, ఎంపీపీ జల్లిపల్లి శ్రీరామూర్తి, జడ్పీటీసీ వరలక్ష్మి, డీసీసీబి డైరెక్టర్ నిర్మల పుల్లారావు, కొటగిరి సీతరామ స్వామి.యూ.ఎస్ ప్రకాశరావు, జూపల్లి బ్రహ్మారావు,కంగాల కల్లయ్య, తహశీల్దార్ చల్లా ప్రసాద్, ఎంపీడీవో విద్యాదరావు, ఎంపీవో సీతారామరాజు, ఈఈ విజయ్, ఏడీఈ వెంకటేశ్వరరావు, ఏఈ శివశంకర్ పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు. ఎస్ఐ రాజేష్ శాంతి భద్రతలను పర్యవేక్షించారు.



కంటి వెలుగు...కంటి తుడుపే...!

దగ్గరి, దూరపు చూపుల కలిపి లేని కళ్ళజోళ్ళ ఆప్షన్‌లు ఏదో ఒకటి ఇస్తున్న వైనం : ప్రభుత్వ లక్ష్యం ఎండమావులే

నవతెలంగాణ-ఇల్లందు

ఏ కంటి సమస్య ఉన్నవారైనా నివారణా మార్గాలను, కళ్ళజోళ్ళు, అత్యున్నత నాణ్యత కలిగిన వైద్యం ఇస్తామని ప్రభుత్వం చెబుతోంది. రూ.కోట్లు ఖర్చు చేస్తున్నామంటున్నారు. కంటి వెలుగు కారక్రమానికి వెళ్ళే వారికి దగ్గరి, దూరపు చూపుల కలిపి లేని కళ్ళజోళ్ళ ఆప్షన్లు డేటాలో ఉండటం లేదు. దీంతో కళ్ళ జోళ్లు లేకుండానే బాధితులు వెనుదిరగాల్సి వస్తోంది. కొందరికి దగ్గరి రీడింగ్ గ్లాస్ ఇస్తున్నారు.

వివరాల్లోకి వెళితె... పట్టణంలోని మామిడి చెట్ల ప్రభుత్వ పాఠశాలలో గురువారం ఎంఎల్ఏ హరిప్రియ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇతర కార్యక్రమాలకు వెళ్ళిపోయారు. కంటి పరీక్షలు చేయడానికి ఆర్‌బిఎస్ఏ మెడికల్ ఆఫీసర్, ఏరియాల ఇంచార్జులుగా ఆప్తాల్మిక్ అసిస్టంట్‌లను, ఇతర సిబ్బందిని ప్రభుత్వం ఏర్పాటు చేసింది. కంటి సమస్యలు ఉన్న ప్రజలు పరీక్షలు చేయించుకున్నారు. కొందరికి దగ్గరి చూపు ఉంచే మరి కొందరికి దూరపు చూపులోపాలు ఉన్నాయి. ఆధార్ కార్డుతో పాటు కంటి లోపాలను ఆన్‌లైన్‌లో సిబ్బంది నమోదు చేస్తున్నారు. అనంతరం వెంటనే కళ్ళ జోళ్ళు ఇస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉంది. మరి కొందరికి దగ్గరి, దూరపు చూపు లోపాలు రెండు ఉన్నాయి. వీరికి 40 రోజులకు కంటి అద్దాలు వస్తాయని సెల్ నెంబర్‌కు ఫోన్ చేసి పిలిచి ఇస్తారని సిబ్బంది అంటున్నారు. కాని టాబ్‌లో ఆప్షన్స్ నమోదు కాక సమస్యగా తయారైంది. ప్రభుత్వానికి అద్దాలు ఇవ్వాలనే ఉద్దేశం ఉంటె ఆప్షన్స్ పెట్టేదేమోనని బాధితులంటున్నారు. దగ్గరి, దూరపు చూపు రెండు రకాల లోపాలు ఉన్నవారికి ఆర్ఇ, ఎస్‌పిహెచ్ 1.00, ఎల్ఇ 1.00, ఆర్.0.75, ఎల్.2.25 ఇలా కంటి సమస్యలు ఉంటున్నాయి.

వీటిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుంటే సబ్‌మిట్ కావడంలేదు. ఈ ఆప్షన్స్ ట్యాబ్‌లో లేక సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. 35 నుండి ఆపై వయస్సున్న వారికి దగ్గరి, దూరపు చూపులోపాలు ఉన్నవారు అధికంగా ఉంటారు. వీటితోపాటుగా కొందరికి కెటారాక్ట్, శుక్లాలు ఉన్నవారు ఉంటారు. సర్జరీలు అవసరం ఉంటుంది. ఇలాంటి సమస్యలు ఏమి లేకుండా రెండు రకాల చూపులో లోపాలు ఉన్నవారికి న్యాయం జరగడంలేదు. దీంతో బాధితులతో గొడవలేందుకని మళ్ళీ టెస్టులు చేయించడం లేదా పరీక్షలు చేసిన నిర్వాహకులతో రిపోర్టులు దిద్దించడం చేస్తున్నారు. ఆప్షన్‌లలో ఉన్నవాటిని వేసి దగ్గరిదో, దూరపు చూపుదో నమోదు చేసి ఏదో ఒక రీడింగ్ కళ్ళజోడు ముఖానికి పెడుతున్నారు. ఈ రకమైన అద్దాలు పెట్టుకుని వెళితె కళ్ళకు మరిన్ని సమస్యలు ఏర్పడి బాధితులు కిందపడటం, దేనికైనా గుద్దుకునే ప్రమాదాలు ఉంటాయి. వాస్తవానికి కంటికి ఉన్న సమస్యకు తగ్గట్టుగా కళ్ళజోళ్ళు ఇవ్వడం లేదు. దీంతో ప్రభుత్వ లక్ష్యం ఎండమావిగానే ఉంది. ఆప్తాల్మిక్ అసిస్టంట్ డా. మున్వర్ అలీని వివరణ కోరగా రిపోర్టులు మ్యానువల్‌గా రాస్తునాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.



జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు వెంటనే ఇవ్వాలి

కాలయాపన చేయకుండా వారి సమస్యలను పరిష్కరించాలి.

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండ్

నవతెలంగాణ-కొత్తగూడెం



కొత్తగూడెం పట్టణంలో 143వ సర్వే నెంబర్‌లో విలేకరులకు ప్రభుత్వం కేటాయించిన 20 ఎకరాల భూమిని జర్నలిస్టులకు వెంటనే ఇవ్వాలని సిపిఎం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య స్థానిక ఎమ్మెల్యే, కలెక్టర్లను కోరారు. ఈ సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేస్తూ జిల్లాలో ప్రింట్ అండ్ డిజిటల్, ఎలక్ట్రానిక్ మీడియాలో పనిచేస్తున్న జర్నలిస్టులలో 99 శాతం మంది దిగువ, మధ్య తరగతి, పేద కుటుంబాలకు చెందినవారేనని, వారికి వచ్చే ఆదాయంతో కుటుంబాలు గడవని దుస్థితి ఉన్నదని ఉందన్నారు. వృత్తి మీద గౌరవం, సమాజన్ని చైతన్య పరచడం కోసం తాము కష్టాలు ఎదుర్కుంటూ జీవనము కొనసాగిస్తున్నారని తెలిపారు. వారి విషయంలో ప్రభుత్వం గురుతర బాధ్యతగా వ్యవహరించలన్నారు. గత కొన్నేళ్లుగా ప్రభుత్వ హామీలు, సుప్రీం కోర్టు తీర్పులు ఉన్నపటికీ జర్నలిస్టుల సమస్యలు పరిష్కరానికి నోచుకోలేదన్నారు.ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్ సముదయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్యమంత్రి సభాముఖంగా జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలని ప్రకటన చేయడం అభినందనీయమన్నారు. జర్నలిస్టుల సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని సీపీఎం పార్టీగా ఇటీవల నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఎంను డిమాండ్ చేయడం జరిగిందన్నారు. గతంలో చాలా సార్లు సీఎం, ఎమ్మెల్యే అనేక మీటింగులో విలేకరుల కోరికలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. చాలా సంవత్సరాలైనా అమలు కాలేదని, గతంలో జిల్లా జర్నలిస్టులకు ఇచ్చిన హామీ కోసం కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూస్తున్నారన్నారు. అదే విధంగా కేరళ, తమిళనాడు, కర్ణాటక మాదిరిగా రిటైర్డ్ అయిన జర్నలిస్టులకు పెన్షన్ సౌకర్యం కల్పించాలని. మహిళా జర్నలిస్టులకు రక్షణ, రవాణా సౌకర్యాలు కల్పించాలన్నారు. జి.ఓ.నెం239 సవరించి ఆర్ఎన్ఐతో నడుస్తున్న చిన్న పత్రికలను ఎంప్యానెల్లో చేర్చాలన్నారు. చిన్న పత్రికలకు ప్రోత్సాహకాలతో పాటు, అక్రిడిటేషన్ కార్డులు ఇవ్వాలి. జర్నలిస్టులపై దాడులు అరికట్టి, రక్షణ చట్టం తేవాలని అన్నవరపు కనకయ్య డిమాండ్ చేశారు.

ఉమ్మడి జిల్లా ప్రధాన సమస్యలు సీఎం దృష్టికి..

సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు మచ్చా వెంకటేశ్వర్లు

నవతెలంగాణ - భద్రాచలం



ఖమ్మం బిఆర్ఎస్ సభ సందర్భంగా సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రధాన సమస్యలను తెలంగాణ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారని, అంతేకాకుండా తమ్మినేని ఈ సమస్యలపై తన ప్రసంగంలో ప్రధాన విషయాలుగా చెప్పారని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు, భద్రాచలం నియోజకవర్గం కన్వీనర్ మచ్చ వెంకటేశ్వర్లు ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సాగునీటి సమస్యకు పరిష్కారం చూపే సీతారామ ప్రాజెక్టుకు ఈ బడ్జెట్లో తగిన నిధులు కేటాయించి తక్షణమే పూర్తి చేయించాలని, గిరిజనులు, గిరిజనేతర పేదల సాగులో ఉన్న పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, భద్రాచలంను మేజర్ గ్రామపంచాయతీ గానే కొనసాగించాలని కోరారు. ఆంధ్రాలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని, భద్రాచలం పట్టణాన్ని ముంపు ప్రాంతం నుంచి రక్షించడానికి కరకట్టను పొడిగించాలని, ఖమ్మం నగరంలో జనరల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, అలాగే భద్రాచలంలో ట్రైబల్ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని, ఖమ్మం జిల్లాలో అతిపెద్ద పరిశ్రమ అయిన గ్రానైట్ పరిశ్రమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలను త్వరగా ఇవ్వాలని, ప్రభుత్వ పరంగా జరిగే అభివృద్ధి నిర్మాణాలకు ఖమ్మం గ్రానైట్ నే ఉపయోగించాలన్నారు. సి.ఫారం సమస్యను పరిష్కరించాలని ఇలా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని సిఎంకు తమ్మినేని వీరభద్రం ఇచ్చారని, సీఎం సానుకూలంగా స్పందించినట్లు మచ్చ తెలిపారు.

హృదయం పదిలం



ప్రత్యేకించి మహిళలు గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలంటే నెలసరి సమస్యల్ని తగ్గించుకోవడం, పీసీఓఎస్‌ను అదుపు చేసుకోవడంతో పాటు మరికొన్ని జాగ్రత్తలు కూడా తీసుకోవాలంటున్నారు నిపుణులు. అవేంటో తెలుసుకుందాం...

- వ్యాయామం ఎలాంటి సమస్యకైనా విరుగుడుగా పనిచేస్తుంది. ఎక్సర్‌సైజ్ చేయడం వల్ల గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. తద్వారా గుండె సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం తక్కువని కొన్ని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. అందుకే క్రమం తప్పకుండా వర్కవుట్‌ను రొటీన్‌లో భాగం చేసుకోవడం మంచిది.
- రోజూ కనీసం పది వేల అడుగులు వేయడం, మెట్లెక్కడం, భోజనం తర్వాత కాసేపు నడవడం.. ఇలా శరీరానికి కాస్త శ్రమ కలిగించినా చక్కటి ఫలితం ఉంటుంది.
- గుండె ఆరోగ్యంగా ఉండాలంటే బరువును అదుపులో ఉంచుకోవడం కూడా కీలకమే. కాబట్టి ఎత్తును బట్టి ఎంత బరువు (బీఎంఐ) ఉండాలో నిర్ధారించుకోవాలి. మీ బీఎంఐ ఎంతో తెలుసుకొని మీరు బరువు పెరగాలా, తగ్గాలా, దానికోసం ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి, ఎలాంటి వ్యాయామాలు చేయాలి? వంటి విషయాలన్నీ నిపుణులను అడిగి తెలుసుకుంటే మంచిది. ఇలా బీఎంఐని అదుపులో ఉంచుకోవడం వల్ల గుండె సమస్యలు వచ్చే అవకాశం 32 శాతం తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.
- రక్తంలో చక్కెర స్థాయులు, బీపీ ఎప్పటికప్పుడు చెక్ చేసుకోవడం వల్ల ఏమైనా హెచ్చుతగ్గులుంటే డాక్టర్ సలహా మేరకు వాటిని అదుపు చేసుకోవచ్చు.
- చిరుతిండ్లు, నూనె సంబంధిత పదార్థాలంటే ఎవరికైనా ఇష్టమే. కానీ వాటిని అమితంగా తీసుకుంటే మాత్రం బరువు పెరిగిపోయి దాంతో గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతుంది. కాబట్టి ఇలాంటి ఆహార పదార్థాలను మితంగా తీసుకోవడం లేదా వీటిని పూర్తిగా పక్కన పెట్టేయడం మంచిదంటున్నారు నిపుణులు.
- శరీరానికి తగిన పని చెప్పకుండా గంటల తరబడి ఒకేచోట కూర్చుండిపోయే వారిలో గుండె జబ్బులు, మధుమేహం వచ్చే అవకాశాలు ఎక్కువని చెబుతున్నాయి అధ్యయనాలు. కాబట్టి శరీరానికి తగినంత వ్యాయామం అందేలా జాగ్రత్తపడాలి. పని మధ్యలో కాస్త విరామం తీసుకొని నాలుగు అడుగులు వేస్తే మంచిదంటున్నారు.
- మానసిక సమస్యలు కూడా గుండె ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. కాబట్టి మనసును ప్రశాంతంగా ఉంచుకోవడానికి యోగా, శ్వాస సంబంధిత వ్యాయామాలు సహకరిస్తాయి.
- ఇలా మనం తీసుకునే జాగ్రత్తలన్నీ గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే కాదు.. ప్రత్యుత్పత్తి వ్యవస్థలో లోపాలు, నెలసరి సమస్యలు, ఇతర అనారోగ్యాల నుంచి కూడా విముక్తి కలిగిస్తాయి. కాబట్టి వీటిని గుర్తుపెట్టుకొని పాటిస్తే గుండె ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోవచ్చు.

గుడ్డు పెంకుతో...



గుడ్డు.. ఆరోగ్యానికి ఎంతో మంచిదన్న విషయం తెలిసిందే. అయితే గుడ్డు పెంకుల వల్ల కూడా ఎన్నో ప్రయోజనాలుంటాయి. ప్రత్యేకించి చర్మం బిగుతుగా ఉండడానికి ఇవి ఉపయోగ పడతాయంటున్నారు నిపుణులు.

- కారణమేదైనా చర్మం సాగిపోవడం వల్ల ముడతలు పడడం, గీతల్లా ఏర్పడడం సహజం. ఇవే మనల్ని వయసు పైబడిన వారిలా కనిపించేలా చేస్తాయి. మరి ఈ సమస్యల్ని దూరం చేసుకోవడానికి గుడ్డు పెంకుల పొడి, ఒక గుడ్డులోని తెల్లసొన, టేబుల్‌స్పూన్ తేనె, టేబుల్‌స్పూన్ పాలు, కొద్దిగా గులాబీ నీరు.. వీటన్నింటినీ ఒక బౌల్‌లోకి తీసుకొని బీటర్ సహాయంతో బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమంలో కాటన్ బాల్‌ను ముంచి ముంఖంపై కింది నుంచి పైకి అప్లై చేసుకోవాలి. అరగంటయ్యాక చల్లటి నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా తరచూ చేస్తుంటే చక్కటి ఫలితం ఉంటుంది.

కలలు కనడానికి పేదరికం అడ్డుకాదు. కృషి, పట్టుదల ఉండాలే కానీ మన విజయాన్ని ఎవ్వరూ ఆపలేరు. 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి' అబ్దుల్ కలామ్ చెప్పిన మాటలు ఎంతోమంది యువత స్ఫూర్తిగా తీసుకుని వారి కలల్ని సాకారం చేసుకుంటున్నారు. అలాంటి జాబితాలో ఇటీవలె ఓ దినసరి కూలి కూతురు చేరింది. పేదరికం తన కలలకు అడ్డుకాదని నిరూపించి కేవలం 25 ఏండ్లకే న్యాయమూర్తి అయ్యింది. ఆ యువ న్యాయమూర్తి గాయత్రి. తన పేరు పక్కన న్యాయమూర్తి అనే నాలుగు అక్షరాలు చేర్చుకోవడం కోసం అహర్నిశలు కష్టపడింది. అత్యంత చిన్న వయసులోనే కర్ణాటకలోని కోలారు సివిల్ కోర్టు న్యాయమూర్తిగా నియమించబడింది. ఆ కష్టం వెనుక ఆమె పట్టుదల ఉంది. పేదరికంలో పుట్టినా కష్టపడి చదివి న్యాయమూర్తిగా అవకాశాన్ని దక్కించుకుంది.



దినసరి కూలి కూతురు న్యాయమూర్తి అయ్యింది

కర్ణాటక రాష్ట్రంలోని బంగారుపేటకు, యళబుర్గికి చెందిన నారాయణస్వామి, వెంకటలక్ష్మి దంపతులకు గాయత్రి ఒక్కగానొక్క కూతురు. అత్యంత పేదరికంలో పెరిగింది. ఏదో సాధించాలనే తపనతో ఉన్న గాయత్రికి తన శ్రమకు తగిన ఫలం దక్కింది. 2021లో లా డిగ్రీ పూర్తి చేసిన గాయత్రి తన కలను సాకారం చేసుకోవాలనే నిరంతర కృషి చేస్తుంది. ఆమె సంకల్పం ఫలితంగా 25 ఏండ్ల వయసులో కర్ణాటక సివిల్ కోర్టులో న్యాయమూర్తి అయ్యారు. సివిల్ జడ్జిగా విజయవంతంగా ఎన్నికయ్యారు.



పేదరికంలో పుట్టింది

కర్ణాటక హైకోర్టు సివిల్ జడ్జీల పోస్టుల భర్తీకి ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఆహ్వానించింది. ఇటీవలె ఆ ఫలితాలను ప్రకటించింది. ఎంపిక జాబితాలో గాయత్రి పేరు కూడా ఉంది. ఇప్పుడు ఆమె ఆనందానికి అవధులులేవు. అట్టడుగు కులంలో, పేదరిక నేపథ్యం నుండి వచ్చిన గాయత్రి ఎస్.కారహళ్లిలోని గవర్నమెంట్ స్కూల్లో చదువుకుంది. కోలారు ఉమెన్స్ కాలేజీలో బీకాం పూర్తి చేసింది. కేజీఎఫ్‌లోని కెంగల్ హనుమంతయ్య కాలేజీలో 2021లో లా పూర్తి చేసింది. యూనివర్శిటీలో నాలుగో ర్యాంకు సాధించింది. అదే సంవత్సరం సివిల్ జడ్జి పోస్టులకు నిర్వహించిన డైరెక్ట్ రిక్రూట్ మెంట్ కోసం దరఖాస్తు చేసుకుంది. కానీ ఫెయిల్ అయ్యింది. ఆ తర్వాత రెండోసారి ప్రయత్నించి ఫలితం సాధించింది.

కన్నవారి కోరికను నెరవేర్చింది

గాయత్రి తల్లిదండ్రులు ఇద్దరూ రోజువారి కూలి పనులకు వెళ్ళేవారు. సంపాదించిన కొద్దిపాటి డబ్బుతోనే కూతుర్ని కష్టపడి చదివించారు. తమలా తమ ఒక్కగానొక్క కూతురు కష్టపడకూడదని తపన పడ్డారు. తల్లిదండ్రుల తపనను అర్థం చేసుకున్న గాయత్రి కష్టపడి చదివింది. కూతుర్ని ఉన్నత స్థానంలో చూడాలనుకున్న కన్నవారి కోరికను నెరవేర్చి ఇప్పుడు న్యాయమూర్తిగా అవకాశాన్ని దక్కించుకుంది.

వారి ప్రోత్సాహంతో...

సీనియరు న్యాయవాది శివరాం సుబ్రహ్మణ్యం వద్ద గాయత్రి జూనియర్ న్యాయవాదిగా పనిచేసింది. ఆమెలో ఉన్న ప్రతిభ, పట్టుదల గమనించిన న్యాయవాది శివరాం సుబ్రహ్మణ్యం సివిల్ న్యాయమూర్తి పరీక్షలకు హాజరు కావటానికి చదవాల్సిన పుస్తకాలను ఇచ్చి ప్రోత్సహించారు. ఆమెకు అన్ని రకాలుగాను సహకరిచారు. అలా సుబ్రహ్మణ్యం నమ్మకాన్ని, తల్లిదండ్రుల ఆశలను నెరవేరుస్తూ 25 ఏండ్లకే సివిల్ కోర్టు న్యాయమూర్తిగా నియమితులైంది. ఓ సాధారణ దినసరి కూలి కూతురు న్యాయమూర్తి అయ్యి అందరి నుండి ప్రశంసలు అందుకుంటుంది.

ప్రశంసల జల్లు

పేదరికంలో పుట్టి పెరిగా గాయత్రికి మొదటి నుంచీ సామాజిక అవగాహన ఎక్కువ. జీవితంలో ఏదో సాధించాలనే తపన ఆమెలో నిత్యం ఉండేది. ఆ తపనతోనే కష్టపడి చదివింది. శ్రమకు తగిన ఫలం దక్కించుకుంది. ఇప్పుడు ఇంత చిన్న వయసులో గాయత్రి సాధించిన ఘనత కోలార్ జిల్లా అంతటా ప్రశంసించబడింది. సోషల్ మీడియాలో విశేషమైన ప్రశంసలు అందుకుంటుంది.

ఆలోచించడం ఎలాగో నేర్పండి

పిల్లలకు మంచి చెడులు నేర్పాలి. అంతమాత్రాన... వారు చేసే ప్రతి పనినీ గమనించడం, చేయిపట్టి చేయించడం, వారి ప్రతి నిర్ణయానికీ షరతులు విధించడం వంటివి సరికాదంటారు మానసిక నిపుణులు. ఓవర్ పేరెంటింగ్‌గా పిలిచే ఈ విధానంతో భవిష్యత్తులో సొంతంగా ఆలోచించే శక్తికీ, నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలకూ దూరమవుతారని హెచ్చరిస్తున్నారు.

- పిల్లలను పట్టించుకోకుండా ఉండే పెంపకంవల్ల కలిగినట్టే, ఓవర్ పేరెంటింగ్‌తోనూ నష్టం ఉంటుందంటున్నారు నిపుణులు. చిన్నారులకు ప్రతి విషయంలో తల్లిదండ్రులు చేదోడువాదోడుగా ఉండాల్సిన అవసరమెంతో ఉంది.

అయితే ఎదుగుతున్నప్పుడూ.. అదే అనుసరిస్తే అది వారి కెరియర్‌కు ప్రతిబంధకంగా మారుతుంది. తోడుగా ఉంటూనే, వారికి సంబంధించిన అంశాల్లో ఛాయిస్ తీసుకోవడానికి అవకాశమివ్వాలి. చిన్నచిన్న సమస్యలకు పరిష్కారాలను వారినే ప్రయత్నించమని చెప్పాలి. అలా కాకుండా వారికెదురయ్యే ప్రతి సమస్యకూ.. పెద్దవాళ్లే ఆలోచిస్తే, మున్ముందు సొంతంగా నిర్ణయం తీసుకోవడానికి ధైర్యం చేయలేరు. వేసే అడుగులో పొరపాట్లు దొర్లినప్పుడు దానిపై అవగాహన కలిగించి సరిదిద్దుకోవడమెలాగో నేర్పాలి. అలా కాక పెద్దవాళ్ల మాటలు వినకపోతే ఇలాగే జరుగుతుందంటూ విమర్శలు మొదలుపెడితే వైఫల్యాన్ని విజయాలుగా మార్చుకోవడమెలాగో ఎప్పటికీ తెలుసు కోలేరు. కొత్త ప్రయత్నాలు చేయడానికీ వెనుకాడతారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోలేని స్థాయికి చేరతారు.



- సరైన నిర్ణయం తీసుకోక తప్పటడుగు వేస్తారేమో అని ముందుగానే భయంతో అడ్డుపడకుండా, సహనంగా పిల్లలను ప్రోత్సహించాలి. పెద్దవాళ్ల చెప్పే పాఠాలుకన్నా, వైఫల్యాల నుంచి మరింత తేలికగా సరైన మార్గాన్ని ఎంచుకోవడానికి అవకాశం ఉందంటున్నారు నిపుణులు. సైకిల్ నేర్చుకొంటే కింద పడిపోతావని పూర్తిగా దానికి దూరంగా ఉంచితే ఏమవుతుంది? ఎప్పటికీ నేర్చుకోలేరు. అలా కాకుండా, పిల్లలు కింద పడకుండా తొక్కడం నేర్పే శిక్షకుడిలా పెద్దవాళ్లు మారాలి. వారికి సంబంధించిన ప్రతి చిన్న అంశాన్ని అనుసరించి నీడలా వెంటాడటం కన్నా.. స్వేచ్ఛనిచ్చి చూడాలి. అది సొంత నిర్ణయాలు తీసుకోవడం నేర్పుతుంది. ప్రతి విషయానికీ ముందుకు ముందే సలహాలివ్వకూడదు. అప్పుడే వారికి ఆలోచించడమెలాగో తెలుస్తుంది. అవసరమైనప్పుడు మాత్రం సూచనలిస్తూ.. పిల్లలకు తల్లిదండ్రులు స్ఫూర్తిగానూ నిలిస్తే చాలు. భవిష్యత్తుకు కావాల్సిన నైపుణ్యాలను వారే అందుకొంటారు.

ప్రపంచరికార్డు సాధించేలా కంటి వెలుగు కార్యక్రమం

(మొదటిపేజీ తరువాయి)

ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు.వైద్యారోగ్యశాఖ కార్యదర్శి ఎస్.ఏ.ఎం. రిజ్వీ, జీహెచ్ఎంసీ కమీషనర్ లోకేష్ కుమార్, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమీషనర్ శ్వేతా మహంతి తదితర ఉన్నతాధికారులతో కలిసి కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా శాంతి కుమారి మాట్లాడుతూ, 2018లో నిర్వహించిన తొలివిడత కంటి వెలుగు కార్యక్రమంలో దాదాపు 1.57 కోట్ల మందికి కంటి పరీక్షలు నిర్వహించి ప్రపంచ రికార్డు సాధించినట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించిన ప్రస్తుత కంటివెలుగు కార్యక్రమంలో తొలివిడత రికార్డుని అధిగమించి సరికొత్త రికార్డు సాధించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రస్తుత కంటి వెలుగును సమర్థవంతంగా నిర్వహించడానికి 15,000 మంది వైద్యారోగ్య సిబ్బందితో కూడిన 1,500 బృందాలు రాష్ట్రంలోని గ్రామీణ ప్రాంతాల్లో 12,768 శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో 3,788 శిబిరాల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తాయని చెప్పారు. ఈ శిబిరాల్లో ప్రత్యేక సాఫ్ట్‌వేర్ సహాయంతో నాణ్యమైన కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి అక్కడికక్కడే రీడింగ్ అద్దాలను అందజేస్తామన్నారు. రాష్ట్రంలోని అన్ని నిర్ధారిత ప్రాంతాల్లో నేడు కంటి వైద్య పరీక్షలు ప్రారంభమయ్యాయని ఆమె వెల్లడించారు.

ఢిల్లీలో ఏప్రిల్ 5 కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీ

(మొదటిపేజీ తరువాయి)

సమస్యలు పెరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వం కార్మిక, కర్షక, వ్యవసాయ కూలీల వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పోతున్నదని విమర్శించారు. సేవ్ ఇండియా.. సేవ్ పీపుల్..రీచ్ టూ అన్‌రీచ్..ఐక్యతాపోరాటం' నినాదాలతో ముందుకు పోవాలని పిలుపునిచ్చారు. ఈ తీర్మానాన్ని బలపరుస్తూ సీఐటీయూ జాతీయ కార్యదర్శి చుక్కరాములు మాట్లాడుతూ..చలో ఢిల్లీ విజయవంతం కోసం క్షేత్రస్థాయిలో కృషి జరగాలని కోరారు. ప్రత్యామ్నాయ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్థమయ్యే విధంగా వివరించాలని సూచించారు. వర్కింగ్ క్లాస్‌ను చైతన్యపరిచేలా కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ ఐదో తేదీన తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమం జయప్రదంలో సీఐటీయూతో పాటు ఏఐకేఎస్, ఏఐఏడబ్ల్యూయూ కూడా కీలక పాత్ర పోషించాలని కోరారు.

'నిజామాబాద్' కేసులో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు..

నవతెలంగాణ - హైదరాబాద్

నిజామాబాద్ బార్ అసోసియేషన్ చైర్మెన్ ఎర్రం గణపతిపై అక్కడి రూరల్ పోలీసులు నమోదు చేసిన కేసులో ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు ఇచ్చింది. ఫిబ్రవరి 23న నిర్వహించబోయే తదుపరి విచారణలోగా వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. ఎన్‌బీఏ అధ్యక్షుడు గణపతిపై పోలీసులు నమోదు చేసిన కేసును కొట్టేయాలంటూ ఆయనతోపాటు హైకోర్టు బార్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా చీఫ్ జస్టిస్‌ను కోరారు. గణపతి రాసిన లెటర్‌ను హైకోర్టు రిట్‌గా స్వీకరించింది. భూమి పరిహార వివాద కేసు విషయంలో నిజామాబాద్ జిల్లా మొదటి అదనపు సెషన్స్ జడ్జి అటాచ్‌మెంట్ ఎగ్జిక్యూట్ వారెంట్‌ను జారీ చేశారు. ఆ ఆర్డర్ కాపీని అందజేసేందుకు గణపతి కలెక్టరేట్‌కు వెళ్లారు. ఈ నేపథ్యంలో అక్కడి ఏఓ ఫిర్యాదు మేరకు గణపతితోపాటు కోర్టు ఉద్యోగి, డిక్రీ హోల్డర్‌పై నిజామాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో తమపై అక్రమ కేసు బనాయించారంటూ గణపతి సమర్పించిన లేఖపై హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీతో కూడిన డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది. చీఫ్ సెక్రటరీ, హోంశాఖ ముఖ్య కార్యదర్శి, డీజీపీ, నిజామాబాద్ కలెక్టర్, ఎస్పీ, అడిషనల్ కలెక్టర్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ వరకు కేసు దర్యాప్తును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

2002 గుజరాత్ అల్లర్లు మోడీదే ప్రధాన బాధ్యత

(మొదటిపేజీ తరువాయి)

క్వశ్చన్' అనే పేరుతో డాక్యుమెంటరీ ప్రసారమైంది. విచారణ బృందంలోని సభ్యుడైన ఒక మాజీ దౌత్యవేత్త మాట్లాడుతూ, "విశ్వహిందూ పరిషత్, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అల్లర్లకు ప్రణాళికలు వేశాయి" అని చెప్పారు. మోడీ ప్రభుత్వం నుంచి లభించిన పోలీస్ రక్షణతోనే వీహెచ్‌పీ, ఆర్ఎస్ఎస్‌లు చెలరేగిపోయాయని, అమాయక పౌరులపై దాడులకు తెగబడ్డాయని నివేదిక స్పష్టంగా పేర్కొంది. విచారణ బృందం నివేదిక బ్రిటన్ ప్రభుత్వానికి చేరిందని, ఇందులోని విషయాలేవీ ఇప్పటివరకూ బయటకు రాలేదని డాక్యుమెంటరీ పేర్కొంది. బుధవారం వెబ్‌సైట్ నుంచి డాక్యుమెంటరీని బీబీసీ తొలగించింది.

గోద్రా రైలు దర్ఘటనలో పెద్ద సంఖ్యలో ప్రయాణికులు చనిపోవటంతో 2002 ఫిబ్రవరి–మార్చి మధ్యకాలంలో గుజరాత్ అంతటా మైనార్టీ ముస్లింలపై దాడులు మొదలయ్యాయి. అల్లర్లలో 790మంది ముస్లింలు, 254మంది హిందువులు చనిపోయారని అధికారిక నివేదికలో గుజరాత్ ప్రభుత్వం పేర్కొంది. మత ఘర్షణల్ని గుజరాత్ ప్రభుత్వం అడ్డుకోలేదన్న ఆరోపణల్ని సీఎంగా నరేంద్రమోడీ తిరస్కరించారు. అయితే తాజాగా బహిర్గతమైన బ్రిటీష్ ప్రభుత్వ విచారణ నివేదిక మాత్రం అల్లర్లకు ప్రధాన బాధ్యుడు నరేంద్రమోడీయేనని ఆరోపించింది. గుజరాత్ పోలీస్ రంగంలోకి దిగి తగిన చర్యలు తీసుకోకుండా ఆయనే అడ్డుకున్నారని విచారణ నివేదిక పేర్కొంది. ఈ మొత్తం ఘటనపై ప్రత్యేక విచారణ బృందాన్ని సుప్రీంకోర్టు ఏర్పాటు చేయగా, సరైన సాక్ష్యాధారాలు లేవని మోడీ, మరో 63మందికి క్లీన్‌చిట్ లభించింది. సిట్ నివేదికను 2013లో సుప్రీం ఆమోదించింది. అయితే పోలీసులు రంగంలోకి దిగకుండా నరేంద్ర మోడీ అడ్డుకున్నారనేందుకు ఆధారాలున్నాయని బ్రిటీష్ ప్రభుత్వ నివేదిక ఆరోపించటం గమనార్హం.

బయటకు తెలిసిందే కొంతే

గుజరాత్ 2002 అల్లర్లు రాజకీయ ప్రేరేపితం. ఇందులో లక్ష్యం సుస్పష్టం. హిందువులు మెజార్టీగా ఉన్న ప్రాంతాల్లో ముస్లింలను లక్ష్యంగా చేసుకొని ఊచకోత సాగింది. ఈ ఊచకోతలో బలైన వారి వివరాలన్నీ బయటకు రాలేదు. మీడియాలో, ఇతర మాధ్యమాల్లో బయటకు తెలిసినదానికంటే ఎక్కువగా క్షేత్రస్థాయిలో ఊచకోత సాగిందని డాక్యుమెంటరీ తెలిపింది. ఒక వర్గానికి చెందినవారిని ప్రణాళిక ప్రకారం చంపారని, లైంగికదాడులు ఎక్కువ సంఖ్యలో జరిగాయని పేర్కొంది. ప్రధాని మోడీపై గుజరాత్ అల్లర్లు ఒక మాయని మచ్చ..అని బ్రిటీష్ మాజీ విదేశాంగ కార్యదర్శి జాక్ స్ట్రా ఆరోపించారు. ఆయనపై వచ్చిన ఆరోపణలు చాలా తీవ్రమైనవని అన్నారు. సీఎంగా ఉన్న మోడీ ఆనాడు హిందూత్వ శక్తులను ఊసిగొల్పి, మరోవైపు పోలీసుల చేతులు కట్టేశారని చెప్పారు. ఈ ఆరోపణల కారణంగా బ్రిటిష్ ప్రభుత్వం 2005 నుంచి 2014 వరకు మోడీకి వీసా నిరాకరించింది.

వినియోగదారులపై భారాలు మోపడం తగదు


(మొదటిపేజీ తరువాయి)

2022–23లో టారీఫ్ ప్రతిపాదనలో ఎలాంటి సూచనల్లేవని పేర్కొన్నారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండానే డిస్కాంలు గతేడాది "డెవలప్‌మెంట్ ఛార్జీలు" పేరుతో విద్యుత్ వినియోగదారులపై భారాలు వేసి రూ.వేల కోట్లను అక్రమంగా వసూలు చేశాయని విమర్శించారు. డిస్కాంలు అంతర్గత సామర్థ్యం పెంచుకోకుండా వినియోగదారులపై భారాలు వేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. నేటికీ డిస్ట్రిబ్యూషన్ నష్టాలు కొనసాగుతూనే ఉన్నాయని వివరించారు. చట్ట ప్రకారం బొగ్గు, గ్యాస్, నీరు తదితర ముడి సరుకుల ధరలు పెరిగినప్పుడు వాటికనుగుణంగా ఛార్జీలను పెంచాలంటూ డిస్కాంలు దరఖాస్తులు పెట్టుకుంటున్నాయని తెలిపారు.

రెగ్యులేటరీ కమిషన్ బహిరంగ విచారణ జరిపి ముడిసరుకుల ధరలకనుగుణంగా ఛార్జీలను నిర్ణయించాలని పేర్కొన్నారు. కానీ ముడిసరుకు ధరలు పెరుగుతున్నాయంటూ డిస్కాంలు తప్పుడు లెక్కలు చూపించి వినియోగదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నాయనీ, ఇది సరైంది కాదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ సలహా మేరకు డిస్కాంలు "ఫ్యూయల్ సర్ ఛార్జీలు" ఎప్పటికప్పుడు వసూలు చేసుకోవాలంటూ గత నాలుగు రోజుల క్రితం విద్యుత్ నియంత్రణ మండలి ప్రకటించడం అత్యంత దుర్మార్గమని తెలిపారు. వచ్చేనెలలో విద్యుత్ ఛార్జీల పెంపుపై బహిరంగ విచారణ ఉన్నందున, ఈనెల 30 లోపు విద్యుత్ ఛార్జీల పెంపుపై డిస్కాంల ప్రతిపాదనలపై అభ్యంతరాలను తెలియజేయాలంటూ రెగ్యులేటరీ కమిషన్ ప్రకటించిందని వివరించారు. అనేకమంది అభ్యంతరాలు కూడా తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. కాబట్టి వచ్చేనెలలో జరిగే బహిరంగ విచారణలో టారీఫ్‌లు నిర్ణయించే వరకు వినియోగదారుల నుంచి ఎలాంటి అదనపు ఛార్జీలు వసూలు చేయొద్దని డిమాండ్ చేశారు. రెగ్యులేటరీ కమిషన్ ఇచ్చిన అక్రమ ఆదేశాలను తక్షణమే ఉపసంహరించుకోవాలనీ, వినియోగదారులపై భారాలు పడకుండా చూడాలని కోరారు.

సికింద్రాబాద్‌లో భారీ అగ్నిప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)



మంటలను అదుపు చేసేందుకు అధికారులు శ్రమిస్తుండగా.. మరో భవనానికి వ్యాపించాయి. ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. దాంతో చుట్టుపక్కల వారిని సురక్షిత ప్రాంతానికి తరలించారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిలో నలుగురిని పోలీసులు, అగ్నిమాక సిబ్బంది రక్షించారు. దట్టమైన పొగతో ఇద్దరు అగ్నిమాపక సిబ్బంది అస్వస్థతకు గురవ్వగా.. వెంటనే ఆస్పత్రికి తరలించారు. రాంగోపాల్‌పేట పోలీసులు దుకాణ యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భారీ అగ్ని ప్రమాదం వల్ల భవనం పూర్తిగా దెబ్బతింది. కూలిపోయే ప్రమాదం ఏర్పడింది.

సిలిండర్ల తరలింపు

భారీ ఎత్తున అగ్నిప్రమాదం సంభవించడంతోపాటు భవనం లోపల నుంచి పేలుడు శబ్దాలు రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అధికారులు ముందుగా మూడు ఫైరింజన్లతో మంటలను అదుపుచేసే ప్రయత్నం చేశారు. అయితే మంటలు అదుపు కాకపోవటంతో మరో మూడింటిని ఘటనాస్థలికి తెప్పించారు. ఆ తర్వాత మరికొన్ని ఫైరింజన్లను తెప్పించారు. నారాయణగూడ, సికింద్రాబాద్ నుంచి 50 వాటర్ ట్యాంకర్లతోపాటు దాదాపు 25 ఫైరింజన్లతో సహాయక చర్యలు చేపట్టినప్పటికీ అర్ధరాత్రి వరకుగానీ పరిస్థితి అదుపులోకి రాలేదు. దట్టమైన పొగతో ఊపిరాడక చిన్నారులు, వృద్ధులు ఉక్కిరిబిక్కిరయ్యారు. అప్రమత్తమైన అధికారులు ఆ సమీపంలోని కాలనీని ఖాళీ చేయించారు. ముందస్తు చర్యలో భాగంగా చుట్టుపక్కల ఇండ్ల నుంచి గ్యాస్ సిలిండర్లను అక్కడి నుంచి తరలించారు. మినిస్టర్ రోడ్‌లో వాహనాల రాకపోకలు నిలిపివేశారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బందితోపాటు డీఆర్ఎఫ్, 108 సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు: మంత్రులు

హోంమంత్రి మహమూద్ అలీ, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పర్యవేక్షించారు. అగ్నిప్రమాద ఘటనలో ఎవరూ గాయపడలేదని తెలిపారు. భవనంలో చిక్కుకున్న నలుగురిని అగ్నిమాపక సిబ్బంది రక్షించారని వెల్లడించారు. దుకాణం లోపల మరో ఇద్దరు ముగ్గురు చిక్కుకొని ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఇండ్ల మధ్య గోదాములు, పరిశ్రమలు ఉండటం దురదృష్టకరమన్నారు. వీటితో ప్రజలకు ముప్పు ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారితోపాటు అక్రమంగా గోదాములు, దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విచారణ అనంతరం.. అవసరమైతే భవనాన్ని కూల్చేస్తామని చెప్పారు.

హైదరాబాద్‌లో మైక్రోసాఫ్ట్ విస్తరిస్తాం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్‌లో కొత్తగా మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్టు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది. గతేడాది ఆ సంస్థ ఈ మేరకు ప్రకటించిన విషయం విదితమే. అందు కోసం రూ.16 వేల కోట్ల మేర పెట్టుబడి పెట్టనున్నట్టు మైక్రోసాఫ్ట్ వెల్లడించింది. 2022 ప్రారంభంలో వంద మెగావాట్ల సామర్థ్యంతో మూడు డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు మైక్రోసాఫ్ట్ ప్రకటించింది.ప్రస్తుతం హైదరాబాద్‌లో ఉన్న పెట్టుబడి అనుకూల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ సంఖ్యను రెట్టింపు చేస్తూ ఆరు డేటా సెంటర్లను 100 మెగావాట్లకు ఒకటి చొప్పున ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. రాబోయే 10–15 సంవత్సర కాలంలో ఈ ఆరు డేటా సెంటర్లు పూర్తి స్థాయిలో కార్యకలాపాలు కొనసాగిస్తాయని తెలిపింది.క్లౌడ్ ఆధారిత మౌలిక వసతులను పెంచి ప్రపంచవ్యాప్తంగా ఉన్న వినియోగదారులకు అత్యుత్తమ సేవలు అందించాలన్న మైక్రోసాఫ్ట్ లక్ష్యంలో భాగంగా ఇంత భారీ పెట్టుబడిని పెడుతున్నట్టు వివరించింది. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే.తారకరామారావుతో జరిగిన సమావేశంలో ఈ మేరకు మైక్రోసాఫ్ట్ తమ విస్తరణ ప్రణాళికలను వెల్లడించింది. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, మైక్రోసాఫ్ట్ మధ్య ఉన్న బంధం తాజా పెట్టుబడితో మరింత బలోపేతం అవుతుందని అభిప్రాయపడ్డారు. భారీ పెట్టుబడితో హైదరాబాద్‌లో కార్యకలాపాలను విస్తరిస్తున్నందుకు మైక్రోసాఫ్ట్ సంస్థకు కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. మైక్రోసాఫ్ట్ ఆసియా హెడ్ అహ్మద్ మజారీ మాట్లాడుతూ భవిష్యత్తులోనూ హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెడతామన్నారు.

రూ.150 కోట్లతో గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్

వెబ్‌పీటీ హైదరాబాద్ లో రూ.150 కోట్లతో గ్లోబల్ కేపబిలిటీస్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నది. ఔట్ పేషెంట్ రీహాబిలిటేషన్ థెరపీలో రోగులు, వైద్య సంస్థలకు అవసరమయ్యే డిజిటల్ సేవలను అందించడంలో అంతర్జాతీయంగా పేరున్న సంస్థ వెబ్‌పీటీ అమెరికాలోని ఫీనిక్స్ కేంద్రంగా ప్రపంచవ్యాప్తంగా వేగంగా అభివృద్ధి చెందుతున్న ఔట్‌పేషెంట్ రీహాబిలిటేషన్ థెరపీ సాఫ్ట్‌వేర్ వెబ్‌పీటీ. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో వెబ్‌పీటీ ఒప్పందం కుదుర్చుకున్నది. కండరాలు, ఎముకలకు సంబంధించిన సమస్యలతో బాధపడే రోగుల కు మరింత మెరుగైన పద్ధతుల్లో రీహాబిలిటేషన్ థెరపీని అందిం చడానికి వైద్య సంస్థలకు అవసరమయ్యే ఎండ్ టు ఎండ్ సాఫ్ట్ వేర్ సొల్యూషన్‌ను వెబ్‌పీటీ సాఫ్ట్‌వేర్ అందిస్తుంది. వెబ్‌పీటీ సీఈఓ ఆష్లే గ్లోవర్, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ పాల్ షుగా, సమ్మిట్ కన్సల్టింగ్ సర్వీసెస్ వ్యవస్థాపకుడు, సీఈఓ సందీప్ శర్మ లు మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులతో సమావేశమై తమ విస్తరణ ప్రణాళికలను చర్చించారు. వెబ్ పీటీకి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. వెబ్ పీటీ విజయాల్లో తెలంగాణ ప్రభుత్వం భాగస్వామిగా ఉంటుందని హామీనిచ్చారు.

ఆర్నెల్లకు ఎలా తగ్గిస్తారు..?

- 'ఎమ్‌వీ చట్టం'పై కేంద్రానికి హైకోర్టు నోటీసు

నవతెలంగాణ - హైదరాబాద్

రోడ్డు ప్రమాదం జరిగిన ఏడాదిలోపు కింది కోర్టులో దావా వేయాలన్న మోటార్ వెహికిల్ చట్టంలోని నిబంధనను కేంద్ర ప్రభుత్వం ఆర్నెల్లకు తగ్గించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. వ్యక్తి మరణించిన సందర్భంలో ఆ విషాదం నుంచి కుటుంబం కోలుకోవాలంటేనే ఏడాది సమయం పడుతుందంటూ అభిప్రాయపడింది. ఈ వివాదంపై నివేదిక అందజేయాలంటూ అమికస్‌క్యూరీగా నియమితులైన న్యాయవాది పి.శ్రీరాఘురామ్‌ను ఆదేశించింది. కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర న్యాయ శాఖ ముఖ్య కార్యదర్శి, నిజామాబాద్ మోటార్ యాక్సిడెంట్ క్లయిమ్స్ ట్రిబ్యునల్ చైర్మెన్‌లను ఆదేశించింది. హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్.తుకారాంజీతో కూడిన డివిజన్ బెంచ్ విచారణను ఫిబ్రవరి రెండుకి వాయిదా వేసింది. రోడ్డు ప్రమాదంలో కుటుంబంలోని వ్యక్తి మరణించడంతో నిజామాబాద్ జిల్లా ముక్పూర్ మండలం అమ్రాడ్ గ్రామానికి చెందిన ఎ. నవనీత అక్కడి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



సవాళ్లను ఎదురొడ్డి పోరాడుదాం

ఐద్వా అఖిల భారత అధ్యక్షులు పీ.కే శ్రీమతి

శ్యామల్ చక్రవర్తి నగర్ నుంచి నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి



'దేశంలో నేడు అనేక సవాళ్లు ఎదురవుతున్నాయి. కులం, మతం, ప్రాంతం, భాష పేర్లతో ప్రజలను విడగొట్టి పాలకులు రాజకీయ లబ్ధి పొందుతున్నారు. దీన్ని తిప్పికొట్టాలి. పాలకుల నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదురొడ్డి పోరాడుదాం' అని ఆలిండియా డెమోక్రటిక్ ఉమెన్ అసోసియేషన్(ఐద్వా) అఖిలభారత అధ్యక్షులు పీ.కే.శ్రీమతి పిలుపునిచ్చారు. శ్యామల్ చక్రవర్తి నగర్(బెంగుళూరు)లోని రంజనానిరులా, రఘునాథ్ సింగ్ వేదిక మీద జరుగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో గురువారం ఆమె సౌహార్ద్ర సందేశాన్ని ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక పోరాటాల్లో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్ఎస్ఎస్ మనువాదాన్ని ప్రజల్లోకి జొప్పిస్తున్నాయని విమర్శించారు. మహిళలపై దాడులు తీవ్రమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. సమానత్వం కోసం పోరాడుతున్నామన్నారు. దేశంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఐద్వా, సీఐటీయూ ఐక్యంగా పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఉందని నొక్కిచెప్పారు.

ఇబ్రహీం బాయ్..షుక్రియా...

- ల్యాప్‌టాప్‌ను భద్రంగా తిరిగి తెచ్చి ఇచ్చిన ఆటోడ్రైవర్
- ఆయన్ను అభినందించిన సీఐటీయూ నేతలు



ఆ మార్గంలో సీఎం వెళ్తున్నాడని పోలీసుల హడావిడి...తొందరగా ఆటో దిగాలంటూ ఆటోవాలా వేడుకోలు..హడావిడిగా ఆటో దిగేక్రమంలోనే ల్యాప్‌టాప్ బ్యాగ్ అందులో వెనకాలే ఉండిపోయింది. నిమిషంలోపే ఆటోను అనుసరించినా రెండు ఫ్లైఓవర్లు, ఓ క్రాస్ రోడ్డు ఉండటంతో లాభం లేకపోయింది. ఆటో అడ్డా వద్దకెళ్లి విచారించినా..అతను ఆ అడ్డావాడు కాకపోవడంతో ఫలితం లేకుండా పోయింది. పోలీసులు కంట్రోల్ రూమ్‌కి ఫోన్ చేసి విషయాన్ని చెప్పారు.

ఇలా గంటన్నర గడిచిపోయింది. ట్రాఫిక్ పోలీసుల సహాయంతో.. ఆటో ఎక్కిన ప్రాంతంలో సీసీ ఫుటేజీల పరిశీలనలో ఉండగానే..బాధితునికి అటువైపు నుంచి ఫోన్...కె.ఎన్. హరినేనా? మీ ల్యాప్‌టాప్ సీఐటీయూ కాన్ఫరెన్స్ రిసెప్షన్ కౌంటర్‌లో ఉంది. ఆటోవాలా మీ బ్యాగ్‌ను నిజాయితీగా తెచ్చి ఇచ్చాడు. ఇక్కడకు రండి' అంటూ పెట్టేశాడు. ల్యాప్‌టాప్‌లోని విలువైన డాటా పోయిందన్న తీవ్రబాధలో ఉన్న నవతెలంగాణ దినపత్రిక ఫొటోగ్రాఫర్ కె.ఎన్.హరికి ప్రాణం లేచివచ్చినట్టయింది. వెంటనే సీఐటీయూ 17వ మహాసభ జరుగుతున్న ప్రాంగణానికి వెళ్లాడు. ఆటోవాలా ఇబ్రహీం బాయ్‌ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. చిన్న వస్తువు దొరికితేనే పట్టికెళ్లిపోయే క్రమంలో బ్యాగులో 60వేల విలువైన ల్యాప్‌టాప్, విలువైన వస్తువులున్నప్పటికీ ఎలాంటి దురాశకు గురికాకుండా తెచ్చివ్వటం పట్ల సీఐటీయూ సభా ప్రాంగణంలోని పలువురు. నేతలు ఆటోవాలను అభినందించారు. 'వెనకాల ఆటోలో ల్యాప్‌టాప్ ఉండిపోయింది. నేనూ చూసుకోలేదు. మీరు ఆటో దిగిపోగానే ఇద్దరు ప్యాసింజర్లు అడిగితే బాడిగకు వెళ్లాను. వాళ్లను దించిన తర్వాత ఆటోలో చూస్తే బ్యాగు కనిపించింది. ప్రాణం గడబిడ అయింది. ప్యాలెస్‌గ్రౌండ్ నాలుగో గేటు..సీఐటీయూ సమ్మేళనానికి వచ్చామన్న మీ మాటలు గుర్తుకొచ్చాయి. వెంటనే ఆటోను ప్యాలెస్‌గ్రౌండ్ వద్దకు తీసుకొచ్చాను. కొద్దిసేపు అటూ ఇటూ తిరిగాను. ముందుకొస్తే అక్కడ రిసెప్షన్ కమిటీ బోర్డు కనిపించింది. వెంటనే అక్కడ సమాచారం ఇచ్చాను. అప్పటికే ల్యాప్‌ట్యాప్ ఆటోలో మిస్ అయ్యిందని మీరు సమాచారం ఇచ్చినట్టు వారు తెలిపారు. ల్యాప్‌టాప్ తిరిగి ఇచ్చినందుకు సంతోషంగా ఉంది' అని బెంగుళూరుకు చెందిన ఇబ్రహీంబాయ్ చిరునవ్వుతో చెప్పారు. ఆటోడ్రైవర్‌ను కలిసి అభినందనలు తెలిపిన వారిలో తెలంగాణకు చెందిన సీఐటీయూ సీనియర్ నాయకులు పి.రాజారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేశ్, కర్నాటక భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహంతోష్, తదితరులున్నారు.

ప్రజా ఐక్యతతోనే సామ్రాజ్యవాదంపై గెలుపు

- నిరంతర పోరాటాలు కొనసాగించాలి
- పెట్టుబడిదారీ వ్యవస్థపై క్యూబా సాగిస్తున్నదే అదే : చెగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా



ప్రజల మధ్య ఐక్యతతోనే సామ్రాజ్యవాదంపై గెలుపు సాధ్యమవుతుందని చెగువేరా కుమార్తె డాక్టర్ అలైదా గువేరా నొక్కిచెప్పారు. ఆ ఐక్యత కోసం ప్రపంచవ్యాప్తంగా మరింత కృషి పెరగాలని ఆకాంక్షించారు. బెంగుళూరులోని శ్యామల్ చక్రవర్తినగర్(ప్యాలెస్ గ్రౌండ్)లోగల కామ్రేడ్ రంజనా నిరులా, కామ్రేడ్ రఘునాథ్ సింగ్ వేదికలో జరుగుతున్న సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభ రెండో రోజైన గురువారం అలైదా గువేరా, ఆమె కుమార్తె ప్రొఫెసర్ ఎస్తిఫినా గువేరా ముఖ్య అతిథిలుగా హాజరయ్యారు.

పోరాట యోధుడి కుమార్తె సీఐటీయూ మహాసభకు హాజరవ్వడంతో హాజరైన ప్రతినిధులు, ఇతర సభ్యులు ఆమెకు జేజేలు పలికారు. చెగువేరా అమర్‌హై..అప్ అప్ సోషలిజం...డౌన్‌డౌన్ క్యాప్టలిజం...వర్కర్స్ యూనిటీ జిందాబాద్..సీఐటీయూ జిందాబాద్ అని పెద్ద పెట్టున నినాదాలు చేశారు. సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్‌సేన్ ఆమెను వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం ఆమె ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగించారు. పెట్టుబడిదారీ విధానంలో కార్మిక సమస్యలు ఎక్కడైనా ఒకే విధంగా ఉంటాయని చెప్పారు. అయితే ప్రజల మధ్య ఐక్యతను తీసుకొచ్చి, సమీకరించి పోరాటం సాగించడం ద్వారా అనుకున్న లక్ష్యాలను సాధించడానికి వీలవుతుందని నొక్కిచెప్పారు. అదే ఇప్పుడు క్యూబాలో చేస్తున్నట్టు చెప్పారు. ప్రపంచ పెట్టుబడిదారీ దేశమైన అమెరికాకు కేవలం 90 మైళ్ల దూరంలోనే చిన్న దేశంగానున్న క్యూబా దాన్ని ఎదిరించి ఇంతకాలంగా నిలబడిందంటే అక్కడి ప్రజల చైతన్యం, సహకారం, ఐక్యతతోనే సాధ్యమైందని వివరించారు. అయినా, అమెరికా నుంచి క్యూబాపై దాడి ఆగడం లేదనీ, ఆర్థిక, ఇతర దేశాల నుంచి సహకారం అందకుండా నిర్బంధాన్ని పెంచుతున్నదని తెలిపారు. మరోవైపు కోవిడ్‌తో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిందన్నారు. తమ దగ్గరా కొన్ని లోపాలున్నాయనీ, వాటినుంచి గుణపాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగుతున్నామని చెప్పారు. వాటి నుంచే సమాధానాలు వెతుక్కోవాలన్నారు. క్యూబా పోరాటం ముందుకు సాగాలంటే ప్రపంచ దేశాలు తమకు అండగా నిలవాల్సిన అవసరం నెలకొందని చెప్పారు. అమెరికా ఏమిచేసినా తమ దేశ ప్రజలు ఐక్యతతో పోరాడేందుకు సిద్ధమై ఉన్నారన్నారు. నార్త్ అమెరికాలోనూ సోషలిస్టు వ్యవస్థను విస్తరింపజేస్తామనే నమ్మకం తమకు ఉందని ఘంటాపథంగా చెప్పారు. విజయం సాధించేవరకూ నిర్దేశించుకున్న లక్ష్యానికి కట్టుబడి ఉండాలని నొక్కిచెప్పారు. భారతదేశంలోనూ కార్మిక సమస్యలపై అందర్నీ ఏకం చేయాలని సూచించారు. వర్కింగ్ క్లాస్ వ్యక్తే ఇతరుల మీద సానుభూతిని కలిగి ఉంటారనీ, వారే ప్రజల సమస్యలను అర్థం చేసుకోగలుగుతారని చెప్పారు. మనుషులందరూ సమానమేనని నొక్కిచెప్పారు. రంగు, రూపు, మతం, సంస్కృతిని బట్టి మనుషులను విభజించి చూడొద్దని కోరారు. కొన్ని అంశాల్లో భిన్నాభిప్రాయాలున్నప్పటికీ ఐక్యపోరాటాలకు అవి ఆటంకంగా మారకుండా చూసుకోవాలని కోరారు. ప్రధానమైన అంశాలపై అందర్నీ ఏకం చేసి పోరాటంలోకి దింపాలని పిలుపునిచ్చారు. పోరాటం ద్వారానే గెలుపు సాధ్యమనే విషయాన్ని గ్రహించాలన్నారు. అలైదా గువేరా ప్రసంగం అనంతరం సీఐటీయూ అఖిలభారత అధ్యక్షులు డాక్టర్ కె.హేమలత తలపాగా పెట్టి సత్కరించారు.

మహాసభ ప్రాంగణంలో ఎగ్జిబిషన్

ప్రారంభించిన సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.హేమలత, తపన్‌సేన్

- ఆకట్టుకున్న ఫొటోగ్యాలరీ, పుస్తకప్రదర్శనశాలలు
- త్రిపుర, కేరళలో వామపక్ష ఉద్యమాలపై ప్రత్యేక గ్యాలరీ



బెంగుళూరులోని శ్యామల్ చక్రవర్తి నగర్‌లోని సీఐటీయూ అఖిల భారత మహాసభల ప్రాంగణం వెలుపల ఎగ్జిబిషన్‌ను సీఐటీయూ అఖిల భారత అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె.హేమలత, తపన్‌సేన్ గురువారం ప్రారంభించారు. హిట్లర్ నియంతృత్వం, ఆనాటి ప్రజల దుర్భర జీవితాలను కండ్లకు కట్టినట్టు చూపేలా ఫొటో ఎగ్జిబిషన్‌ను సుదీశ్ ఏర్పాటు చేశారు. ఆ ఫొటో ఎగ్జిబిషన్‌ను సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షులు ఏకే పద్మనాభన్ ప్రారంభించారు. మళయాలళ, కన్నడ, నవతెలంగాణ పుస్తక ప్రదర్శనలను తపన్‌సేన్, కె.హేమలత, సీఐటీయూ కర్నాటక అధ్యక్షులు వరలక్ష్మి, ఉమేశ్, తదితరులు ప్రారంభించారు. కన్నడ భాషలో ఏర్పాటు చేసిన కేరళ, త్రిపుర, కర్ణాటక రాష్ట్రాల్లో వామపక్షాలు బలపడిన తీరును వివరించారు. త్రిపురలో వామపక్ష ప్రభుత్వం ఉన్న సమయంలో ట్రైబల్స్ అభివృద్ధి కోసం, అక్షరాస్యత పెంచేందుకు చేసిన కృషిని తెలిపేలా ఏర్పాటు చేశారు. నవతెలంగాణ బుక్‌హౌస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పుస్తక ప్రదర్శనశాలలో తపన్‌సేన్, కె.హేమలత కలియ తిరిగారు. పుస్తకాలను పరిశీలించారు. ఎగ్జిబిషన్‌ను మహాసభ ప్రతినిధులు ఆసక్తిగా తిలకించారు.



సీఐటీయూ అఖిల భారత 17వ మహాసభలో ప్రధాన కార్యదర్శి నివేదికపైనా, గత మహాసభ నుంచి ఇప్పటి వరకూ తెలంగాణలో సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను సీఐటీయూ ఉపాధ్యక్షులు పద్మశ్రీ మాట్లాడారు. కోవిడ్ సమయంలో చేసిన సహాయ కార్యక్రమాలు, హెల్ప్‌లైన్ సెంటర్ల కృషి గురించి వివరించారు. మూడేండ్ల కాలంలో ఆయా రంగాల్లో చేసిన పోరాటాల గురించి విడమర్చి చెప్పారు.



సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి భూపాల్ మహాసభ చర్చల్లో పాల్గొని తెలంగాణలో మూడేండ్ల కాలంలో జరిగిన పోరాటాలను, సాధించిన విజయాలను వివరించారు. వలసకార్మికులు, కాంట్రాక్టు కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రస్తావించారు. కార్మికగర్జన పాదయాత్ర, సింగరేణి, బీడీ, రవాణా రంగాల వారీగా చేపట్టిన జీపుజాతాల గురించి వివరించారు. సామాజిక సమస్యలపైనా చేసిన పోరాటాల గురించి చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయేతర కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై 15 రోజుల పాటు 450 గ్రామాల్లో సర్వే చేశామన్నారు. 6500 కార్మికులను సర్వే చేశామని తెలిపారు.

నవచిత్రం

గాండీవధారి అర్జున



వరుణ్ తేజ్

వరుణ్ తేజ్ హీరోగా, ప్రవీణ్ సత్తారు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రానికి 'గాండీవధారి అర్జున' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. గత ఏడాది అక్టోబర్‌లో ఈ సినిమా షూటింగ్ ప్రారంభమైంది. గురువారం వరుణ్ తేజ్ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమా మోషన్ పోస్టర్‌ను చిత్ర యూనిట్ విడుదల చేసింది.

ఇందులో వరుణ్ తేజ్ సెక్యూరిటీ ఎక్స్‌పర్ట్‌గా నటిస్తున్నారు. ఎదుటి వారిని ప్రమాదాల బారి నుంచి కాపాడే రోల్‌లో ఆయన నటించటంతో 'గాండీవధారి అర్జున' టైటిల్‌ను ఖరారు చేసినట్టు చిత్ర యూనిట్ పేర్కొంది. మిక్కి జె.మేయర్ ఈ చిత్రానికి సంగీత సారథ్యం వహిస్తున్నారు. ఈ యాక్షన్ థ్రిల్లర్‌ను శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై నిర్మాత బి.వి.ఎస్.ప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే తెలియజేయనున్నారు.

హంట్‌లో అన్నీ ఉన్నాయి..



భరత్

సుధీర్ బాబు హీరోగా భవ్య క్రియేషన్స్ పతాకంపై వి.ఆనంద ప్రసాద్ నిర్మించిన సినిమా 'హంట్'. మహేష్ దర్శకత్వం వహించారు. ఇందులో తమిళ హీరో భరత్ ప్రధాన పాత్రలో నటించారు. ఇది ఆయన నటించిన తొలిసారి స్ట్రెయిట్ తెలుగు సినిమా కావడం విశేషం. రిపబ్లిక్ డే కానుకగా ఈనెల 26న థియేటర్లలో విడుదల కానుంది. ఈ సందర్భంగా భరత్ మీడియాతో సంభాషించారు.

'బాయ్స్, ప్రేమిస్తే, యువసేన చిత్రాలతో తెలుగులోనూ నేను ఫేమస్ అయ్యాను. తమిళ సినిమాలు వరుసగా చేయటంతో తెలుగులో బాగా గ్యాప్ వచ్చింది. దర్శకుడు మహేష్ చెప్పిన కథ నచ్చి, దాదాపు 12 ఏళ్ళ తర్వాత తెలుగులో ఈ మూవీ చేశా. పైగా... సుధీర్ బాబు నాకు మంచి ఫ్రెండ్. సీసీఎల్‌లో ఇద్దరం కలిసి క్రికెట్ మ్యాచులు ఆడాం. శ్రీకాంత్ కూడా సీసీఎల్ వల్ల కాస్త క్లోజ్. సో.. అన్నీ కుదిరి ఈ సినిమా ఓకే చేశా. ఈ కథ మా ముగ్గురి (భరత్, శ్రీకాంత్, సుధీర్ బాబు) చుట్టూ తిరుగుతుంది. ఇందులో ఆర్యన్ దేవ్ అనే ఐపీఎస్ ఆఫీసర్‌గా నటించా. ఇందులో యాక్షన్, క్రైమ్, థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో పాటు ఎమోషన్, ఫ్రెండ్‌షిప్ అన్నీ ఉంటాయి. ఈ సినిమా తెలుగులోనూ నా మార్కెట్‌కి హెల్ప్ అవుతుందన్న నమ్మకం ఉంది. తమిళ్ మూవీ 'కాళిదాసు'లో నా లుక్ చూసి డైరెక్టర్ మహేష్ ఈ మూవీలోనూ అలానే ఉండాలనుకున్నారు. ఆ సినిమా హిట్ కాబట్టి సెంటిమెంట్ కూడా వర్కవుట్ అవుతుందని అదే లుక్‌తో నటించా (నవ్వుతూ). ఈ కథ ప్రధానంగా హైదరాబాద్‌లోనే నడుస్తుంది. కొన్ని యాక్షన్ పార్ట్స్ పారిస్‌లో కూడా షూట్ చేశాం. కథకు సూటయ్యేలా, స్క్రీన్ ప్లేకు కనెక్టయ్యేలా యాక్షన్ సీన్స్ బాగా డిజైన్ చేశారు. సినిమా కోసం ఖర్చుకు వెనుకాడకుండా భవ్య క్రియేషన్ ఆనంద్ ప్రసాద్‌గారు చాలా లావిష్, రిచ్‌గా తీశారు. యాక్షన్ ఎపిసోడ్స్ కోసం ఫారిన్ యాక్షన్ కొరియోగ్రాఫర్స్‌ను తీసుకు వచ్చారు. ప్రేక్షకులకు మంచి సినిమా అందించాలని ఆలోచించే నిర్మాత ఆయన. ఈ ప్రాజెక్టుపై టీమ్ అంతా పాజిటివ్‌గా ఉన్నాం. రిలీజయ్యాక ఆడియెన్స్ ఆదరిస్తే, నిర్మాతలూ ఓకే అనుకుంటే, సీక్వెల్ ఉంటుందేమో చూడాలి' అని భరత్ చెప్పారు.

టెన్షన్ పెడుతూనే నవ్విస్తుంది



వీజే సన్నీ, హర్షిత్‌రెడ్డి, హన్షిత

కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేసేందుకు ప్రముఖ ఓటీటీ సంస్థ జీ5తో హరీష్ శంకర్ కలిశారు. ఆయనకు సపోర్ట్‌గా దిల్‌రాజు కూడా జాయిన్ అయ్యారు. వీరిద్దరూ కలిసి 'ఏటీఎం' అనే వెబ్ సిరీస్‌ని రూపొందించారు. బిగ్ బాస్ విన్నర్ వీజే సన్నీ, కృష్ణ, రవిరాజ్, రాయల్ శ్రీ, దివి తదితరులు కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు సి.చంద్రమోహన్ దర్శకత్వం వహించారు. ఈనెల 20న ఈ వెబ్ సిరీస్ ప్రీమియర్ అవుతుంది. ఈ సందర్భంగా బుధవారం జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో హరీష్ శంకర్ మాట్లాడుతూ, 'పోస్ట్ ప్రొడక్షన్ టైమ్‌లో సినిమా చూశాను. దర్శకుడు చంద్రలో మంచి కామెడీ టైమింగ్ ఉంది. కంటెంట్‌ను ప్యూర్‌గా చెప్పొచ్చు అనే ప్యాషన్‌తో ఓటీటీల్లోకి వచ్చాం. దానికి సపోర్ట్ చేసిన జీ5కి థ్యాంక్స్' అని అన్నారు.

'ట్రైలర్ చూడగానే సినిమా ట్రైలర్‌గానే అనిపించింది. చంద్ర కంటెంట్‌ను హ్యాండిల్ చేసిన తీరు నచ్చింది. టెన్షన్ పడుతూనే సిరీస్‌ను ఎంజాయ్ చేస్తారు' అని నిర్మాత దిల్ రాజు చెప్పారు. దర్శకుడు సి.చంద్ర మోహన్ మాట్లాడుతూ, 'మంచి టీమ్ దొరికినందుకు హ్యాపీగా ఉంది. టాప్ టెక్నీషియన్స్ కుదిరారు. సపోర్ట్ చేసిన అందరికీ థ్యాంక్స్. ఈ వెబ్‌సిరీస్ అందర్నీ కచ్చితంగా అలరిస్తుంది' అని తెలిపారు.'ఈ వెబ్‌సిరీస్ నా జీవితంలో మరచిపోలేని జర్నీ. మా కెప్టెన్ చంద్రమోహన్‌తో వర్క్ చేయటం అమేజింగ్' అని వీజే సన్నీ చెప్పారు. నిర్మాత హర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, "ఈ సిరీస్ హరీష్‌గారి ఐడియా నుంచి స్టార్ట్ అయ్యింది. సన్నీ, రోయల్, కృష్ణ, రవి మంచి యాక్టర్స్‌గా పేరు తెచ్చుకుంటారు. సుబ్బరాజ్ మా కోసం ఇందులో నటించారు' అని చెప్పారు. నిర్మాత హన్షిత మాట్లాడుతూ, 'ఇదొక గేమ్ చేంజర్ అని నమ్ముతున్నాం. నాన్నగారి మైండ్, హరీష్ అన్న గుండె కలిసే ఈ సిరీస్ క్రియేట్ అయ్యింది. నాన్న చెప్పినట్టు టెన్షన్ పెడుతూనే ఇది నవ్విస్తుంది' అని తెలిపారు.

నయా సస్పెన్స్ థ్రిల్లర్



రుహాని శర్మ, నాని, శ్రీధర్ స్వరగావ్

రుహాని శర్మ ప్రధాన పాత్రధారిగా 'హర్' అనే ఓ వైవిధ్యభరితమైన సస్పెన్స్ థ్రిల్లర్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. తొలిసారి ఫిమేల్ లీడ్ చేస్తూ ఓ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ రోల్ చేస్తోంది. తాజాగా ఈ సినిమా టీజర్‌ను యువ కథానాయకుడు నాని రిలీజ్ చేసి, చిత్ర బృందానికి అభినందలు తెలిపారు.

ఈ టీజర్‌లో రుహాని శర్మ క్యారెక్టర్ హైలైట్ అయింది. ఆమె ఓ ఛాలెంజింగ్ రోల్ చేసిందని కొన్ని సన్నివేశాలు ప్రూవ్ చేశాయి. ఆద్యంతం ఆసక్తికరంగా దర్శకుడు శ్రీధర్ స్వరగావ్ రూపుదిద్దిన ఈ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ పై అంచనాలు రెట్టింపు అయ్యాయి. డబుల్ అప్ మీడియాస్ సంస్థ ఫస్ట్ ప్రొడక్షన్‌గా ఈ సినిమాను 'హర్ చాప్టర్ 1'గా రిలీజ్ చేయబోతున్నారు. రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించారు. వికాస్ వశిష్ట, ప్రదీప్ రుద్ర, జీవన్ కుమార్, అభిగ్న్య, సంజయ్ స్వరూప్, బెనర్జీ, రవివర్మ ఇతర ముఖ్యపాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రానికి డిఓపీ : విష్ణు బేసి, ఎడిటింగ్: చాణక్య తూరుపు, మ్యూజిక్: పవన్.

బుట్టబొమ్మ.. కలర్‌ఫుల్‌గా ఉంటుంది



అనిక సురేంద్రన్

ఎన్నో విజయవంతమైన చిత్రాలను అందించిన సితార ఎంటర్టైన్మెంట్స్ సంస్థ నుంచి 'బుట్ట బొమ్మ' అనే మరో ఆసక్తికరమైన చిత్రం రాబోతోంది. ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్‌తో కలిసి సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ ఫీల్ గుడ్ రూరల్ డ్రామా ఫిల్మ్‌కి సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య నిర్మాతలు. అనిక సురేంద్రన్, సూర్య వశిష్ట, అర్జున్ దాస్ ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రంతో శౌరి చంద్రశేఖర్ రమేష్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ సినిమా ఈనెల 26న భారీస్థాయిలో థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో నాయిక అనిక సురేంద్రన్ మీడియాతో ముచ్చటించారు.

'ఎన్నో ఏళ్లుగా బాల నటిగా సినిమాల్లో నటిస్తూ వచ్చాను. ఇప్పుడిలా హీరోయిన్‌గా నటించే అవకాశం రావడం సంతోషంగా ఉంది. 'కప్పేలా' మలయాళ వెర్షన్ చూశాను. చాలా నచ్చింది. నా పాత్రలో ఎన్నో ఎమోషన్స్ ఉన్నాయి. నటనకు కూడా మంచి ఆస్కారం ఉన్న పాత్ర. తొలిసారి హీరోయిన్‌గా నటించడాన్ని కొంత ఒత్తిడిగా ఫీలయ్యాను. పైగా నాది సినిమాలో ప్రధాన పాత్ర. అయితే దర్శకుడు రమేష్, మిగతా చిత్ర యూనిట్ మద్దతుతో ఎలాంటి ఒత్తిడికి గురి కాకుండా సినిమాని పూర్తి చేయగలిగాను. రీమేక్ పరంగా మూల కథ అలాగే ఉంటుంది. కానీ తెలుగు ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా కొన్ని మార్పులు చేశారు. ఒరిజినల్ ఫిల్మ్ కంటే కూడా ఇది ఇంకా కలర్‌ఫుల్‌గా ఆకట్టుకునేలా ఉంటుంది. నేను ఇప్పటిదాకా పని చేసిన ఉత్తమ నిర్మాణ సంస్థల్లో సితార ఒకటి. నిర్మాత వంశీ నన్ను ఈ చిత్రం కోసం ఎంపిక చేసినందుకు ధన్యవాదాలు. సితార లాంటి పెద్ద సంస్థలో హీరోయిన్‌గా మొదటి సినిమా చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. ఈ సినిమా విడుదలకు ముందే తెలుగులో ఇంకా అవకాశాలు వస్తున్నాయి. ప్రస్తుతం మలయాళంలో 'ఓ మై డార్లింగ్' అనే మూవీలో హీరోయిన్‌గా నటిస్తున్నాను. తమిళంలో ఒక మూవీ చేస్తున్నాను. అలాగే కొన్ని తెలుగు సినిమాలు చర్చల దశలో ఉన్నాయి' అని నాయిక అనిక సురేంద్రన్ అన్నారు.

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886